అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 5-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 195 | Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ఎడిటర్స్ గిల్డ్‌పై కేసు

మీడియా వాణిని అణచివేస్తున్న మణిపూర్ ప్రభుత్వం



ఇంఫాల్ : మీడియా వాణిని అణచివేసేందుకు బీజేపీ నేతృత్వంలోని మణిపూర్ ప్రభుత్వం యత్నిస్తున్నది. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ)కి చెందిన ...11లో

పాత్రికేయులపై కేసులు రాజ్యాంగ విరుద్ధం : సుప్రీంకోర్టు

వివరాలు 11లో..

ఇండియా విజయం సాధించి తీరాలి

లేదంటే దేశమంతా మణిపూర్, హర్యానాలా తగలబడుతుంది : స్టాలిన్



చెన్నై : మోడీ ప్రభుత్వంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్ర తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్ష కూటమి ఇండియా విజయం సాధించి తీరాలని లేకుంటే.. దేశమంతా మణిపూర్, హర్యానాలా తగలబడిపోతుందని అన్నారు. స్పీకింగ్ ఫర్ ఇండియా' అనే పాడ్‌కాస్ట్‌లో ఆయన బీజేపీపై విమర్శలు గుప్పించారు. సోమవారం ఉదయం ప్రసారమైన ఈ ఎపిసోడ్ తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రసారమవుతున్నది. బీజేపీ వాగ్దానం చేసినట్టుగా ఒక్కొక్కరికి రూ.15 లక్షలు ప్రజలందరి ఖాతాల్లోనూ జమ కాలేదని, రైతుల ఆదాయం రెట్టింపు కాలేదని, రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించలేదని అన్నారు.

మత విద్వేషాల ముసుగులో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను తన కార్పొరేట్ స్నేహితులకు దోచిపెడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎయిర్ ఇండియా, విమానాశ్రయాలు, ఓడరేవులు బీజేపీకి సన్నిహితంగా ఉండే ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని కప్పిపుచ్చేందుకు పలు రాష్ట్రాల్లో కుల, మతవిద్వేషాలను రెచ్చగొడుతోందని ధ్వజమెత్తారు. 2002లో గుజరాత్‌లో నాటిన ద్వేషం మణిపూర్, హర్యానాకు విస్తరించిందని అన్నారు.భారతదేశం మొత్తం మణిపూర్, హర్యానాగా మారకుండా ఉండాలంటే ప్రతిపక్ష కూటమి ఇండియా కచ్చితంగా విజయం సాధించితీరాలని అన్నారు. భిన్న సంస్కృతులతో కూడిన భారతదేశ వైవిధ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, మత సామరస్యం, ఫెడరలిజం, లౌకిక విధానాలు, సోషలిజం పునరుద్ధరణ కోసమే ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు ఏదైనా ఒక నిర్ణయం తీసుకోవడానికి ముందు ప్రతిపక్షాలను సంప్రదించడం పరిపాటి. కానీ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో అందుకు భిన్నమైన వాతావరణం కన్పిస్తోంది. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ సందర్భంలోనూ ప్రతిపక్షాలతో చర్చించిన పాపాన పోలేదు. జమిలి ఎన్నికలపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటుచేసింది. ఏ సంప్రదింపులూ లేకుండా ఏకపక్షంగా ప్రకటించిన ఈ కమిటీ కేవలం కంటి తుడుపు చర్య మాత్రమే. జమిలి ఎన్నికలపై ప్రభుత్వం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలో కమిటీ చేసే సిఫార్సులకు, అందులోని సభ్యుల అభిప్రాయాలకు విలువ ఏముంటుంది?



జమిలి వెనుక..

విడివిడి ఎన్నికలు నష్టం చేస్తాయని భావన

కర్నాటక పరాభవం ఓ కారణం

కలవరపెడుతున్న ప్రతిపక్షాల ఐక్యత

'ఇండియా'కు పెరుగుతున్న ఆదరణతో మోడీ సర్కార్‌లో ఆందోళన

న్యూఢిల్లీ : లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిపితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రయోజనాలు, లాభాల మాట అటుంచితే లోక్‌సభకు, శాసనసభలకు విడివిడిగా ఎన్నికలు జరిపితే తనకు రాజకీయంగా నష్టం కలుగుతుందేమోనని బీజేపీ అనుమానిస్తోంది. కర్నాటకలో ఎదురైన పరాభవమే ఈ సంవత్సరం చివరలో రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని శాసనసభలకు జరిగే ఎన్నికలలో కూడా పునరావృతమవుతుందేమోనని కమలనాథులు ఆందోళన చెందుతున్నారు.

అందుకే ఒకే రాయి విసిరి రెండు పక్షులను నేలకూల్చాలని మోడీ నిర్ణయించారు. ఆ క్రమంలోనే శాసనసభ ఎన్నికలను నివారించి వాటిని లోక్‌సభ ఎన్నికలతో పాటే జరపాలని భావిస్తున్నారు. పైగా జీ-20 దేశాల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించబోతున్నారు. ఈ తరుణంలో అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి ఎదురైతే ప్రపంచ దేశాల ముందు తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మోడీ భయపడుతున్నారు.

మరోవైపు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి రోజురోజుకూ సంఘటితమవు తోంది. విస్తృతం కూడా అవుతోంది. తాజాగా ముంబయిలో జరిగిన సమావేశాల్లో ఇది మరింత స్పష్టమైంది.



ప్రజల్లో సైతం 'ఇండియా' కూటమికి సానుకూలత, ఆదరణ పెరుగుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా లోక్‌సభ ఎన్నికలలో ఉమ్మడి అభ్యర్థిని నిలపాలని ముంబయిలో జరిగిన సమావేశంలో కూటమి నిర్ణయించింది. ఇది అధికారపక్షానికి గుబులు పుట్టిస్తోంది. అయితే ఏ పార్టీ పోటీ చేయాలి, ఏ ప్రాతిపదికన అభ్యర్థిని నిలపాలి అనే విషయాలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ అంశాలపై సమన్వయ కమిటీ నిర్ణయం తీసుకోవటానికి ఇంకా సమయం పడుతుంది. ఆ సమయం ప్రతిపక్షాలకు ఇవ్వకూడదనేది బీజేపీ ఎత్తుగడగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అమెరికా, ఐరోపాలను కుదిపేస్తున్న సమ్మెలు



వాషింగ్టన్, బ్రస్సెల్స్ : అమెరికా, ఐరోపా దేశాలను సమ్మెలు, నిరసనలు కుదిపేస్తున్నాయి. విపరీతంగా పెరిగిపోతున్న ధరలొకవైపు, పడిపోతున్న నిజ వేతనాలు, అంతులేని నిరుద్యోగం ఇంకొకవైపు దీంతో ఆగ్రహించిన ప్రజానీకం ఎక్కడికక్కడ వీధుల్లోకి వస్తున్నారు. ఇదివరకెన్నడూ లేని విధంగా నిరసనలు, ఆందోళనలతో ఈ దేశాలు అట్టుడుకుతున్నాయి. మెరుగైన వేతనాలు, ఉపాధి కోసం కార్మికులు అనేక చోట్ల సమ్మెలకు దిగుతున్నారు. ఇటీవల కాలంలో యూరప్‌లో సమ్మెలు, నిరసనలు సర్వసాధారణమైపోయాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఆందోళనలు పెరగడమే కాదు, వాటి తీవ్రత కూడా పెరిగింది. అమెరికాలో ఈ ఏడాది ఇప్పటివరకూ 230 సమ్మెలు జరిగాయి. 3,20,000మందికి పైగా కార్మికులు సమ్మెల్లో పాల్గొన్నారు. సమ్మెలు, పికెటింగ్‌లు, ఇతర రూపాల్లో నిరసనలు గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బాగా పెరిగాయని అమెరికా లేబర్ బ్యూరో, కార్నెల్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ లేబర్ రిలేషన్స్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎయిర్‌లైన్స్, రైల్వేస్, పోస్టల్, కొరియర్ సర్వీసెస్, కార్ల తయారీదార్లు, నర్సులు, టీచర్లు, హాలీవుడ్ రైటర్లు, నటులు ఇలా అన్ని రంగాలకు చెందిన వారు సమ్మె బాటపట్టారు. ఉపాధి భద్రతలో సంక్షోభం నెలకొనడం, పని పరిస్థితులు, జీవన పరిస్థితులు మరింత దారుణంగా ...11లో

ఎస్సీ గురుకులాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గురుకులాల్లోని కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ఇప్పటికే బీసీ గురుకులాల్లోని 139 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసిన ...11లో

ఉపాధ్యాయ పోస్టులు పెరిగేనా?

9,979 మంది టీచర్లకు పదోన్నతులు

- అవి ఖాళీగానే ఉంటాయా? భర్తీ చేస్తారా?
- నిరుద్యోగ అభ్యర్థుల్లో టెన్షన్
- 5,089 పోస్టుల భర్తీ పట్ల వ్యతిరేకత
- సీఎం హామీ ప్రకారం 13,086 నింపాలంటూ డిమాండ్
- రెండో వారంలో డీఎస్సీ నోటిఫికేషన్! 2లో..

16న హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ భేటీ

17న పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ

- ఐదు హామీల ప్రకటన
- కాంగ్రెస్ సభ ఏర్పాట్లు పరిశీలించేందుకు 6న కేసీ వేణుగోపాల్ రాక
- సోనియా, ఖర్గే, రాహుల్‌కు రేవంత్ ధన్యవాదాలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో టీపీసీసీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నది. కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలన్న టీపీసీసీ విజ్ఞప్తిమేరకు ఏఐసీసీ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో అందుకనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల సభను తలపించేలా ఏర్పాట్లు చేయడంతో అందుకు విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించాలని భావిస్తున్నది. ఈ ప్రతిష్టాత్మకమైన సమావేశాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఈ నెల 6న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌కు రానున్నారు. సీడబ్ల్యూసీలోకి ఎక్కువ మంది సభ్యులను తీసుకుని విస్తృతపరించిన తర్వాత తొలి సమావేశాలు హైదరాబాద్‌లో జరగడం గమనార్హం. సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలు, బీజేపీ జమిలి ఎన్నికల ప్రస్తావనపై, ఇండియా కూటమి బలోపేతం, పార్లమెంటు ఎన్నికలు, ఐదు రాష్ట్రాల ఎన్నికలు తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 16న సీడబ్ల్యూసీ సమావేశం, 17న సీడబ్ల్యూసీ సభ్యులతోపాటు, అన్ని రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు, పార్లమెంటరీ పార్టీ నేతల ...11లో

కీలక కమిటీని ప్రకటించిన కాంగ్రెస్..

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 16 మందితో పార్టీ ఎన్నికల కమిటీని ప్రకటించింది. పదహారు మంది సభ్యులు గల ఈ కమిటీలో తెలుగు రాష్ట్రాల నుండి టీపీసీసీ ...11లో

హస్తం జాబితా ఎప్పుడొస్తదో..?

కారు పార్టీ అభ్యర్థుల ఎదురు చూపులు...



- బలమైన ప్రత్యర్థులుంటే గెలుపు కష్టమేనని ఆందోళన
- లేదంటే గట్టెక్కొచ్చనే భావన
- అభ్యర్థుల అనుచరుల్లోనూ ఇదే చర్చ
- అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తొలి జాబితా వచ్చి అప్పుడే పది రోజులు కావస్తోంది. దాంతో నేతల హడావుడి.. పైనుంచి జనంలో ఉండి, వారి మెప్పును పొందాలంటూ ఆదేశాలు. వీటితోపాటు ఇంటిలిజెన్స్ రిపోర్టులు, అధిష్టానం చేయించే సర్వేలు... వీటన్నింటితో బీఆర్ఎస్ అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరవు తున్నారు. ఇదే సమయంలో తమ ప్రత్యర్థులు ఎవరా అని ఒకవైపు ఆసక్తి, మరోవైపు ఆందోళనతో వారు ఎదురు చూస్తున్నారు. ప్రత్యర్థి తమకన్నా బలహీనుడైతే బయటపడొచ్చు. అదే బలవంతుడైతే...? ఇదే వీరి ఆసక్తి, ఆందోళనకు ప్రధాన కారణం. అందుకే ఇప్పుడు గులాబీ క్యాండిడేట్ల చూపంతా హస్తం జాబితా వైపే. కర్నాటక ఫలితాల తర్వాత రాష్ట్రంలో అనూహ్యంగా పుంజుకుందని భావిస్తున్న హస్తం పార్టీ అభ్యర్థులపైన్నే బీఆర్ఎస్ సిట్టింగులు, సీటు దక్కించుకున్న వారి భవితవ్యం ఆధారపడి ఉందంటూ ఆ పార్టీకి చెందిన నేతలే అభిప్రాయపడుతున్నారు. తమ తమ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నిలబెట్టే అభ్యర్థుల ఆధారంగా తమ గెలుపోటములు ప్రభావితమవుతాయని వారు భావిస్తున్నారు.

ప్రభుత్వ వర్గాలు, ఇంటిలిజెన్స్ సర్వేల ప్రకారం బీఆర్ఎస్ ఇప్పటి వరకూ 40 నుంచి 50 నియోజకవర్గాల్లో గట్టి పట్టును కలిగుంది. అదే మోతాదులో కాంగ్రెస్ కూడా పుంజుకోవటం గులాబీల్లో గుబులు పుట్టిస్తోంది. ఈ పెరిగిన కాంగ్రెస్ గ్రాఫ్‌నకు తోడు వారి అభ్యర్థులూ బలమైన వారైతే... ఆయా సీట్లలో కారు ముందుకు పోవటం కష్టమేననే వాదనలు బలంగా వినబడుతున్నాయి. గులాబీ పార్టీ కంచుకోటలని భావిస్తున్న స్థానాల్లో కూడా గెలుపు అంత సులభం కాకపోవచ్చని తెలుస్తోంది. ఉదాహరణకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, నాగార్జున సాగర్, హుజూర్‌నగర్, కోదాడ, మునుగోడు, మిర్యాలగూడ, సూర్యాపేట, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర, భద్రాచలం, కొత్తగూడెం, సత్తుపల్లి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొడంగల్, కొల్లాపూర్‌తోపాటు ఉమ్మడి వరంగల్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మూడేసి సీట్ల చొప్పున బీఆర్ఎస్‌కు ఇబ్బందులు తప్పేట్టు లేవు. ఆయా సీట్లలో సీనియర్లు, అంగబలం, అర్థబలం ఉన్న వారికే కాంగ్రెస్ టిక్కెట్లు దక్కే అవకాశాలుండటమే దీనికి కారణం. ఈ జిల్లాలు కాకుండా ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని కొన్ని ...11లో



నేడు గురుపూజోత్సవం

ముఖ్య అతిథిగా సీఎం కేసీఆర్

- 126 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం ఉదయం 10 గంటలకు గురుపూజోత్సవం జరగనుంది. ఈ ...11లో

మళ్లీ ముసురు

కొన్నిచోట్ల భారీ వర్షం

- ప్రాజెక్టుల్లోకి చేరుతున్న వరద
- వాగులో చిక్కుకున్న రైతును కాపాడిన అధికారులు
- నిజాంసాగర్ ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తివేత
- నీట మునిగిన పంట పొలాలు



నవతెలంగాణ- మొఫసిల్

కొన్ని రోజులు మొఖం చాటేసిన వర్షాలు.. మళ్లీ వచ్చేశాయి. రెండ్రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి ఓ మోస్తరు వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ప్రభావం కొనసాగుతోంది. వర్షాలతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు, చెరువులు నీటితో నిండుతున్నాయి. కామారెడ్డి జిల్లాలో వాగులో చిక్కుకున్న రైతును అధికారులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ఐదు గేట్లను ఎత్తారు. పంట పొలాలు నీట మునిగాయి.ఉపరితల ఆవర్తనం మంగళవారం నాటికి బలపడి అల్పపీడనంగా మారనుందని ...11లో

ఎవరెన్ని ట్రిక్కులు చేసినా

బీఆర్ఎస్‌దే హ్యాట్రిక్

పాలకుర్తిలో రూ.160 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రుల శంకుస్థాపన



నవతెలంగాణ-జనగామ

ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హాట్రిక్ మాత్రం బీఆర్ఎస్‌దేనని మంత్రి హరీశ్ రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వెల్మిడి గ్రామంలో శ్రీ సీతారామచంద్రుల స్వామి దేవాలయ పున:ప్రతిష్ఠతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. బీఆర్ఎస్ మూడోసారి అధిక సీట్లతో అధికారంలోకి వచ్చి హాట్రిక్ కొడుతుందన్నారు. కేసీఆర్ ఆశీస్సులతో పాలకుర్తిని అభివృద్ధి చేసిన ఘనత దయాకర్ రావుదేనని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడ కూడా ప్రజలకు మట్టి అంటకుండా మంత్రి దయాకర్ రావు సీసీ రోడ్లు వేయించారన్నారు. మంత్రి ఎర్రబెల్లి కోరిక మేరకు పాలకుర్తిలో 50 పడకల ఆస్పత్రిని త్వరలో మంజూరు చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 24 గంటలు ఇస్తున్న కరెంటు వేరే ప్రభుత్వం వస్తే వచ్చే పరిస్థితి లేదన్నారు. బీజేపీ ఓటమి భయంతో జెమిలి పద్ధతి తెరమీదికి ...11లో

ఉపాధ్యాయ పోస్టులు పెరిగేనా?

• రెండో వారంలో డీఎస్సీ నోటిఫికేషన్! • విద్యాశాఖ కసరత్తు వేగవంతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'రాష్ట్రంలో 1,947 గెజిటెడ్ హెడ్మాస్టర్, 2,162 పీఎస్‌హెచ్‌ఎం, 5,870 స్కూల్ అసిస్టెంట్ కలిపి 9,979 ఉపాధ్యాయ పోస్టులకు పదోన్నతులు కల్పిస్తాం'.అని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఇటీవల మీడియా సమావేశంలో చెప్పారు. అయితే ఆ పదోన్నతుల ద్వారా ఖాళీ అయ్యే 9,979 పోస్టులను భర్తీ చేస్తారా? లేదా?అన్నది చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటిస్తామంటూ చెప్పడం పట్ల అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన 13,086 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. అందుకోసం ఇప్పటికే రెండుసార్లు విద్యాశాఖ సంచాలకుల కార్యాలయాన్ని ముట్టడించారు. పోలీసులు లాఠీచార్జీ కూడా చేశారు. అయినా వెనక్కి తగ్గడం లేదు. ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు 5,089 పోస్టుల భర్తీకి డీఎస్సీ వేస్తే అంగీకరించేది లేదంటూ అభ్యర్థులు స్పష్టం చేస్తున్నారు. అయితే 5,089 ఉపాధ్యాయ, 1,523 ప్రత్యేక ఉపాధ్యాయ (డిజెబుల్డ్) పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. వాటి భర్తీ కోసం పాఠశాల విద్యాశాఖ అధికారులు కసరత్తును వేగవంతం చేశారు. ఇప్పటికే జిల్లాల వారీగా, సబ్జెక్టుల వారీగా పోస్టులను ఖరారు చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ ఖరారుపై చర్చిస్తున్నారు. రాష్ట్రంలో చివరిసారిగా 2017లో 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీఆర్టీ నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసింది. అప్పుడు ఈడబ్ల్యూఎస్ కోటా లేదు. ఇంకోవైపు ఎస్టీ కోటా 6.6 శాతం ఉండేది. వారి జనాభా దామాషా ప్రకారం ఎస్టీ రిజర్వేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం పది శాతానికి పెంచింది. డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఈడబ్ల్యూఎస్ కోటాను చేర్చడంతోపాటు ఎస్టీలకు పది శాతం రిజర్వేషన్‌ను వర్తింపచేస్తున్నారు. ఈ దిశగా విద్యాశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకుని డీఎస్సీ నోటిఫికేషన్‌ను సిద్ధం చేస్తున్నారు.

జనవరిలో డీఎస్సీ రాతపరీక్షలు?

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈనెల రెండో వారంలో విడుదల చేయాలని భావిస్తున్నారు. నెలరోజులపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించాలని షెడ్యూల్‌ను రూపొందిస్తున్నారు. ఈనెల 15న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్ష జరగనుంది. ఈ ఏడాది పేపర్-1కు 2,69,557 మంది, పేపర్-2కు 2,08,498 మంది కలిపి 2,91,058 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈనెల 27న టెట్ ఫలితాలు విడుదల కానున్నాయి. అయితే ఇప్పుడు టెట్‌కు హాజరయ్యే అభ్యర్థులు కూడా డీఎస్సీకి దరఖాస్తు చేసే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఈ దిశగా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇంకోవైపు 2017లో అక్టోబర్ 10న టీఆర్టీ నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసింది. అయితే 2018 ఫిబ్రవరిలో రాతపరీక్షలను నిర్వహించారు. అయితే ఇప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ ఈనెల రెండో వారంలో విడుదల చేసే అవకాశమున్నది. ఈ లెక్కన డీఎస్సీ రాతపరీక్షలు వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించే అవకాశం లేకపోలేదు. వచ్చేనెల నాలుగు తర్వాత ఎప్పుడైనా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసే అవకాశమున్నది. ఇంకోవైపు జమిలి ఎన్నికలు జరుగుతాయంటూ చర్చ జరుగుతున్నది. ఏదేమైనా ఎన్నికలు రాబోతున్నాయి. వాటిని దృష్టిలో ఉంచుకుని డీఎస్సీ రాతపరీక్షల తేదీలను విద్యాశాఖ ఖరారు చేయనుంది.

ఎస్జీటీ పోస్టులకు బీఎడ్ అభ్యర్థులు అర్హులేనా?

సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు బీఎడ్ అభ్యర్థులు అర్హులేనా?అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే ఇటీవల రాజస్థాన్ కేసులో సుప్రీం కోర్టు కీలకమైన తీర్పు ఇచ్చింది. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ప్రాథమిక పాఠశాలల్లో బోధించేందుకు డీఎడ్ అభ్యర్థులే అర్హులని స్పష్టం చేసింది. అదే విషయాన్ని జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్సీటీఈ) కూడా వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. దాని ప్రకారం ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ అభ్యర్థులే అర్హులు. అయితే రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నదో ఇప్పటి వరకు ప్రకటించలేదు. ప్రభుత్వ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని లక్షలాది మంది బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

సంఘవి వెన్నెముకకైన గాయం ప్రమాదకరం

ఏఐజీ డైరెక్టర్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి

- ప్రేమోన్మాది చేతిలో కత్తిపోట్లకు గురైన యువతి హెల్త్ బులెటిన్ విడుదల
- కొందుర్గులో కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన
- నిందితుడికి గతంలోనే నేర చరిత్ర ఉన్నట్టు సమాచారం



నవతెలంగాణ- శేరిలింగంపల్లి/ షాద్‌నగర్

హైదరాబాద్ ఎల్‌బీ నగర్ ఆర్టీసీ కాలనీలో పట్టపగలే ఓ ప్రేమోన్మాది యువతి ఇంట్లోకి చొరబడి ఆమెపై దాడిచేసేందుకు ప్రయత్నించగా, అడ్డుకోబోయిన ఆమె తమ్ముడుపై కత్తితో తీవ్రంగా దాడి చేయడంతో అతను మృతిచెందాడు. తీవ్ర గాయాలతో ఉన్న యువతి సంఘవి ప్రస్తుతం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్యంపై హాస్పటల్ డైరెక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి హెల్త్ అప్‌డేట్స్‌ను మీడియాకు విడుదల చేశారు. కత్తిపోట్లకు గురైన యువతి సంఘవి గర్భాశయ ప్రాంతానికి సమీపంలోని వెన్నెముకకు తీవ్రంగా గాయమయిందని, ఇది ప్రధాన నరాలను ప్రభా వితం చేయడంతో ఆమె జీవితాంతం కదలకుండా ఉండే అవకాశం ఉందని తెలిపారు. అలాగే, ముఖంపై అనేక కత్తిపోట్లు ఉండటంతో ప్లాస్టిక్ సర్జన్లు కుట్లు వేశారన్నారు. ట్రామా కేర్ బృందం న్యూరో సర్జన్లు, ఆర్థోపెడిక్స్, ఎమర్జెన్సీ ఫిజిషియన్ ల బృందం సంఘవికి చికిత్స చేసిందని తెలిపారు. కానీ వెన్నెముకకు తగిలిన గాయం ప్రాణాంతక మైనదని, తమ న్యూరో సర్జన్ల బృందం ఆమెను మానసికంగా ధృఢంగా ఉండే విధంగా ప్రయత్నిం చిందని తెలిపారు. వైద్యానికి అయ్యే ఖర్చులు మొత్తం భరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. కాగా, మృతి చెందిన సంఘవి సోదరుడు పృథ్వీ మృత దేహాన్ని సోమవారం సొంత గ్రామ మైన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొందుర్గుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వాహనాన్ని రోడ్డుపై ఆపి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిందితుడు శివను ఎన్ కౌంటర్ చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నింది తుడు కుమ్మరి శివకుమార్‌కు గతంలో నేర చరిత్ర ఉన్నట్టు తెలిసింది. నిందితుడు శివకుమార్ డిగ్రీ పూర్తి చేశాక సినిమా అవకాశాల కోసమంటూ కొన్నాండ్లు హైదరాబాద్‌లో ఖాళీగా తిరిగాడు. ఈ వ్యవహారం ఇంట్లో గొడవకు దారి తీసింది. మూడేండ్ల క్రితం తండ్రి గట్టిగా మందలించడం తో.. విచక్షణ కోల్పోయిన శివ కుమార్ సుత్తితో కొట్టడంతో తండ్రి మరణించాడని నేరెళ్లచెరువు గ్రామస్తులు ఇప్పుడు గుర్తుచేస్తున్నారు. ఆ కుటుం బానికి ఒక్కడే కుమారుడు కావడం, ఆవేశంలో చేసిన తప్పునకు భవిష్యత్తు ఏమవుతుందోననే ఉద్దేశంతో ఈ విషయాన్ని గ్రామపెద్దలు బయటకు పొక్కనివ్వలేదని చెబుతున్నారు. తండ్రి మరణాన్ని సహజ మరణంగా చూపించి అంత్యక్రియలు చేశారని తెలిపారు. ఆనాడు అతన్ని స్వేచ్ఛగా విడిచిపెట్టినందుకే ఇప్పుడు మరో ఘాతుకానికి పాల్పడ్డాడని వాపోతున్నారు. కాగా, నిందితుడు శివకుమార్‌కు ఉన్న నేర చరిత్రపై విచారణ చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలకు పెంచాలి

సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నెలకు రూ.18 వేలకు పెంచాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. ఆశా వర్కర్లకు ప్రసూతి సెలవులు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. గత కొంతకాలంగా ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు ఇస్తున్నారని గుర్తు చేశారు. గతంలో 106 రోజుల సమ్మె సందర్భంగా ప్రగతి భవన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఫిక్స్‌డ్ వేతనంగా రూ.ఆరు వేలు చెల్లిస్తామన్న సీఎం హామీ ఇప్పటికీ అమలు కావడం లేదని తెలిపారు. పాతపద్ధతిలోనే పారితోషికాలను చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం చెల్లించిన 16 నెలల కరోనా రిస్క్ అలవెన్స్ (నెలకు రూ.వెయ్యి) బకాయిలు, 2021 నుంచి డిసెంబర్ వరకు ఆర్నెల్ల పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. గతేడాది డిసెంబర్ ఆరు లెప్రసీ, ఈ ఏడాది జనవరి 18 నుంచి కంటి వెలుగు అదనపు పనులకు అదనపు డబ్బులు చెల్లించాలని సూచించారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశాలకు పదోన్నతులు కల్పించాలని తెలిపారు. ఇన్‌చార్జీల అలవెన్సులు చెల్లించాలని పేర్కొన్నారు. 32 రకాల రిజిస్టర్లను ముద్రించి సరఫరా చేయాలని వివరించారు.

రిజిస్టర్ల కోసం ఆశాలు పెట్టిన ఖర్చులను ఇప్పించాలని తెలిపారు. ఐదేండ్లుగా పెండింగ్ యూనిఫారం ఇవ్వాలని సూచించారు. జిల్లా ఆస్పత్రుల్లో విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలని కోరారు. జాబ్ చార్ట్ విడుదల చేసి పనిభారం తగ్గించాలని పేర్కొన్నారు. టీబీ స్పూటమ్ పరీక్ష డబ్బాలను ఆశాలతో మోపించే పనిని రద్దు పర్చాలనీ, అధికారుల వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు.

నాలాలో మహిళ గల్లంతు..!

- రెండ్రోజులైనా లభించని ఆచూకీ
- మూసీని జల్లెడ పడుతున్న జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలోని గాంధీనగర్‌లో నాలాలో పడినట్టు భావిస్తున్న మహిళ ఆచూకీ ఇప్పటి వరకు లభించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి మహిళ కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసీ పరివాహక ప్రాంతంలో లక్ష్మి కుటుంబం నివాసముంటోంది. నాలాను ఆనుకుని వారి ఇల్లు ఉంది. వెనుకవైపు బాత్‌రూమ్ ఉంది. అయితే రెండేండ్ల కిందట నాలావైపు ఉన్న గోడ కూలిపోయింది. దాంతో నిచ్చెన సహాయంతో కిందకు దిగి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి లక్ష్మి కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ సిబ్బంది, డీఆర్ఎఫ్ బృందాలు మహిళ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 100 మంది డీఆర్ఎస్, జీహెచ్ఎంసీ సిబ్బంది నాలుగు టీమ్‌లుగా విడిపోయి మూసీలో గాలిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి వర్షం



కురుస్తుండటంతో నాలా ఉప్పొంగి ప్రవహిస్తోంది. సంఘటనా స్థలం నుంచి గాలింపు చర్యలు చేపట్టిన ఈ బృందాలు గోల్నాకా వరకు దాదాపు 10కిలోమీటర్ల మేర అణువణువు పరిశీలించాయి.

ఇంట్లో పహరీ గోడపై గాజులు పగిలి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. లక్ష్మి కిందపడి పోయిందా లేక ఏమైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఒక వేళ కాలు జారి నాలాలో పడిపోతే అరుపులు కేకలెందుకు వేయలేదు, ఎవరూ గమనించలేదా అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం: కుటుంబసభ్యులు

జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్లే లక్ష్మి గల్లంతైందని ఆమె కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. రెండేండ్ల కిందట ఇంటి గోడ కూలిపోయిందని, నాలాను ఆనుకుని తాము గోడ కట్టుకుంటామని చెప్పినా అధికారులు అంగీకరించలేదన్నారు. నాలా సమీపంలో ఓ గోడ నిర్మించిన తర్వాతే తాము గోడ కట్టుకోవాలని అధికారులు సూచించారని, కానీ ఇప్పటి వరకు వారు గోడ నిర్మించలేదన్నారు. గోడ ఉంటే ఇంతటి ఘోరం జరిగేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

అడుగేస్తే అంతే సంగతులు

హుస్సేన్ సాగర్ దిగువనున్న మూసీ నాలాను ఆనుకుని వేలాది ఇండ్లు, వందలాది బస్తీలున్నాయి. అడుగుతీసి అడుగేస్తే నాలాలో పడిపోవాల్సిందే. ఇంటి వెనుకవైపు నాలాలో ప్రవహించే మురుగు నీటితో గోడలు నిత్యం తడిగా ఉంటాయి. గోడ కూలినా లేదా వెనుకవైపు డోర్ నుంచి పొరపాటున ఒక్క అడుగు బయటపెట్టినా అంతే సంగతులు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాకు పహరీ నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు : మంత్రి సబిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్ ఆశయాలను సాధించే విధంగా ఉపాధ్యాయులు స్ఫూర్తిదాయకంగా ఉండాలని విద్యా శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని కోరారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. సోమవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయుల అనుభవాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో సురక్షితంగా ఉంటుందని చెప్పారు. ప్రతి వ్యక్తి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు ప్రొఫెసర్ వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన తదితరులు పాల్గొన్నారు.

సంఘవిపై దాడి చేసిన ఉన్మాదిని కఠినంగా శిక్షించాలి : మల్లు లక్ష్మి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంఘవిపై దాడి చేసిన ఉన్మాదిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్న సంఘవి ఇంటిపై ఉన్మాది శివకుమార్ దాడి చేశారనీ, అడ్డు వచ్చిన తమ్ముడు పృథ్వీపై కత్తితో పొడిచి చంపారని తెలిపారు. సంఘవిని పెండ్లి చేసుకుందాం రా..అంటూ దాడి చేశారని పేర్కొన్నారు. ఏఐజీ ఆస్పత్రితో చికిత్స పొందుతున్న సంఘవిని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి శశికళతో కలిసి వారు పరామర్శించారు. రాజధాని నగరంలో పట్టపగలు అత్యంత దుర్మార్గంగా జరిగిన నేరమని తెలిపారు. ఇలాంటి దాడులు రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాల్సిన యంత్రాంగం మాటలకే పరిమితమవుతోందని విమర్శించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి తక్షణం శివకుమార్‌కు తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. సంఘవి కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలనీ, సంఘవికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలనీ, ఆమె చేస్తున్న వైద్య విద్యను పూర్తి చేసేలా ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు.

జూబ్లీహిల్స్‌లో డ్రగ్స్ పట్టివేత ఇద్దరి అరెస్ట్..

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత డ్రగ్స్ విక్రయిస్తుండగా ఇద్దరు వ్యక్తులను రోడ్ నెంబర్ 5లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, జూబ్లీహిల్స్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. సోమవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో టాస్క్‌ఫోర్స్ కమిషనర్ ఓఎస్డీ రాధాకృష్ణన్ రావు, ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ రవీందర్ ప్రసాద్‌తో కలిసి వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

రాజస్థాన్‌కు చెందిన హోంగార్డు ప్రతాప్‌శర్మ డ్రగ్స్ కొరియర్‌గా వ్యవహరిస్తున్నాడు. పోలీస్ కార్డు ఉండటం వల్ల ఎండీఎంఏ డ్రగ్స్‌ను సునాయాసంగా చెక్ పోస్టులను దాటిస్తూ ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో కామారెడ్డికి చెందిన వీరేందర్ డ్రగ్స్ కోసం ప్రతాప్ శర్మకు ఆర్డర్ ఇచ్చాడు. డ్రగ్స్ తీసుకొని హైదరాబాద్ వచ్చిన ప్రతాప్‌శర్మ వీరేందర్‌కు డ్రగ్స్ ఇస్తుండగా అప్పటికే నిఘా పెట్టిన టాస్క్‌ఫోర్స్, జూబ్లీహిల్స్ పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేశారు. వారి నుంచి 215 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. రూ.8500, రెండు మొబైల్ ఫోన్స్ సీజ్ చేశారు. నిందితులను రిమాండ్ చేసి తిరిగి పోలీస్ కస్టడీకి తీసుకోనున్నారు. ప్రతాప్ శర్మ ఇంకా ఎంతమందికి సప్లై చేశాడు.. అనే విషయంపై పోలీసు విచారణలో తెలుసుకుంటామని, ఇద్దరి మొబైల్ ఫోన్ డేటాను విశ్లేషిస్తే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని డీసీపీ తెలిపారు. గతంలో వీరిద్దరిపై మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు కూడా ఉందని.. ఆ కేసులో వీరేంద్ర అరెస్టు కాగా ప్రతాప్ శర్మ పరారీలో ఉన్నట్టుగా తెలిసిందని వివరించారు.

వాతావరణ శాఖ అలర్ట్

పలు జిల్లాలకు హెచ్చరిక

- రాత్రంతా అతి భారీ వర్షాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. 48 గంటలుగా కురుస్తున్న వానలతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఉపరితల ఆవర్తనం మంగళవారం నాటికి బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సోమవారం తెలియజేసింది. అల్పపీడన ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే పరిస్థితులు ఉత్పన్నం కావచ్చొని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తొమ్మిది జిల్లాలకు 'ఆరెంజ్' అలెర్ట్, 18 జిల్లాలకు 'ఎల్లో' అలర్ట్‌ను ప్రకటించింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు జగిత్యాల, కరీంనగర్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, హన్మకొండ, సిద్దిపేట, కామారెడ్డి, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీగా వానలు పడతాయని చెప్పింది.

ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను విడుదల చేసింది. మంగళవారం నుంచి బుధవారం వరకు మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లో అక్కడక్కడ అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయగా, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాలతో పాటు ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది.

గద్వాల ఎమ్మెల్యే డీకే అరుణ

- ఆమే ఎంపికైనట్లు గెజిట్ ప్రచురించండి
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గద్వాల అసెంబ్లీ నియోజవర్గ ఎమ్మెల్యేగా డీకే అరుణ ఎన్నికైనట్టు గెజిట్ ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు ఈసీ కార్యదర్శి సంజయ్‌కుమార్ లేఖ రాశారు. హైకోర్టు ఉత్తర్వులను తదుపరి గెజిట్‌లో ప్రచురించాలని పేర్కొన్నారు. ఈసీ లేఖపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ ఆ ఆదేశాలను వెంటనే అమలు చేయాలనీ, త్వరలోనే తాను శాసనసభ కార్యదర్శిని కలుస్తాననీ చెప్పారు. జోగులాంబ జిల్లా గద్వాల ఎమ్మెల్యేగా బీ కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నిక చెల్లదని హైకోర్టు ఇటీవల తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. నామినేషన్ సందర్భంగా తప్పుడు వివరాలతో అఫిడవిట్ దాఖలు చేసినందుకు శిక్షగా రూ.2.50 లక్షలు జరిమానా విధించి, ఖర్చుల కింద పిటిషనర్ డీకే అరుణకు రూ.50 వేలు చెల్లించాలని ఆదేశించింది. కృష్ణమోహన్‌రెడ్డి తరువాత అత్యధిక ఓట్లు సాధించిన అరుణను 2018 డిసెంబరు 12 నుంచి ఎమ్మెల్యేగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. నాటి ఎన్నికల్లో గద్వాల నుంచి అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అభ్యర్థిగా కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా డీకే అరుణ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కృష్ణమోహన్‌రెడ్డికి 1,00,057 ఓట్లు రాగా, డీకే అరుణకు 71,612 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత ఆమె కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వెళ్ళిన విషయం తెలిసిందే.

గీత కార్మికుల ప్రమాద నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- వృత్తి చేసే వారందరికీ సేఫ్టీ మోకులివ్వాలి
- 22న చలో హైదరాబాద్
- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లు గీత కార్మికుల ప్రమాద నివారణకు ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలనీ, అందరికీ సెప్టీ మోకులు ఇవ్వాలని లేదంటే ఈ నెల 22న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆఫీసు బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయనీ, తాళ్ల ఎక్కే క్రమంలో ప్రమాదం జరిగి వందలాదిమంది కాళ్లూ, చేతులు విరగడం, నడుములు పడిపోతున్నాయని తెలిపారు. రెండు రోజులకొకరి చొప్పున చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాదికి సుమారు 550 మంది చెట్టుపై నుంచి పడుతున్నారని తెలిపారు.అందులో 180 మంది చనిపోతున్నారని పేర్కొన్నారు. ఇంత ప్రమాదం ఏ వృత్తిలో లేదని తెలిపారు. వీరిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. మునుగోడు ఎన్నికల సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ అధ్యక్షులు, కేటీఆర్ ప్రమాదాలు నివారించే చర్యలు తీసుకుంటామని, గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు ఇస్తామని, లిక్కర్ షాపులు సొసైటీలకు ఇస్తామని తదితర గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వాటిని నేటి వరకూ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన లిక్కర్ షాప్ టెండర్ల లో సొసైటీలకు రిజర్వేషన్లు కల్పించకుండా పాత పద్ధతినే కొనసాగించారని తెలిపారు. మోపెడ్‌ల కోసం రేండేండ్లుగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీతన్న బీమా అమలు చేయాలనీ, ఎక్స్ గ్రేషియో యధావిధిగా ఇవ్వాలనీ, పెన్షన్ 5000 లకు పెంచాలని డిమాండ్ చేశారు. సొసైటీలకు భూమి, కల్లుకు మార్కెట్, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్‌కి రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 2023- 24 లో గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. జీవో నెంబర్ 5 ప్రకారం కల్లుగీత వృత్తి చేస్తున్న వారందరికీ రూ. లక్ష చొప్పున ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షులు ఎల్లారి గోవిందు, గౌని వెంకన్న, బాల్నె వెంకటమల్లయ్య, వి. వెంకటనర్సయ్య, పామనగుళ్ళ అచ్చాలు, కార్యదర్శులు యస్. రమేష్ గౌడ్, బూడిద గోపి, బండ కింది అరుణ్, గాలి అంజయ్య, మడ్డి అంజిబాబు, పాల్గొన్నారు.

నినాదంగానే మిగులుతుంది..

- ఒకే దేశం - ఒకే ఎన్నికలు పై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఒకే దేశం, ఒకే ఎన్నికలు నినాదంగానే మిగులుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికల వల్ల రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కోల్పోతాయని చెప్పారు. బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేల భూ కబ్జాలపై ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి చీకటి దందాను అడ్డుకున్నందుకే సూర్యాపేటలో బీసీ నేత వట్టే జానయ్య యాదవ్ పై అక్రమ కేసులు పెట్టారన్నారు. మంత్రితో జానయ్యకు ప్రాణహాని ఉందన్నారు.

రైతు ఉద్యమ హామీలను అమలు చేయాలి

- కేంద్రం మోసంపై రెండో దశ ఉద్యమం : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్



నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా రైతులకు కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్లో సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. డిసెంబర్ 9, 2021న ప్రధాన మంత్రి మోడీ లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలతో రైతులు ఉద్యమాన్ని విరమించారని చెప్పారు. అయితే, కనీస మద్దతు ధరల చట్టం, రైతు ఉద్యమకారులపై కేసుల ఎత్తివేత వంటి హామీలను అమలు చేయక రైతులను మోడీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ మోసాన్ని మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దేశ వ్యాప్తంగా రెండో దశ రైతు ఉద్యమం ప్రారంభించాలని సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయించిందని చెప్పారు. కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం, రైతుల రుణ విముక్తి, కార్పొరేట్ కంపెనీలకు కాకుండా రైతులకు లాభం కలిగించే పంట బీమా పథకం, రైతు ఉద్యమకారులపై కేసుల ఎత్తివేత అంశాలపై చర్చించామన్నారు. 2011 సాగుదారుల చట్టాన్ని అమలు చేసి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 11.5 లక్షల ఎకరాల్లో ఆదివాసీలకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సెప్టెంబర్ నుంచి నవంబరు వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కృష్ణారెడ్డి, రాష్ట్ర కన్వీనర్ వెంకటయ్య, జిల్లా నాయకులు బాల్ రెడ్డి, రాజన్న, రాబర్ట్, మేకల ఆంజనేయులు, ప్రసాద్, ఎస్ రాజు, అజయ్, ఆర్ ఎస్ రమేష్, హనుమంతు, వెంకటయ్య, బుచ్చన్న, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుడిసెలను కూల్చిన వారిపై కేసులు పెట్టాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకే రవి

నవతెలంగాణ-చెన్నూర్

నివాస స్థలాలకు పట్టాలివ్వాలని ఐదు నెలలుగా గుడిసెలు వేసుకుని పోరాడుతున్న పేదలపై దాడి చేసి.. గుడిసెలను కూల్చి కాల్చేసిన దుండగులపై వెంటనే కేసులు నమోదు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకే రవి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన భూపోరాట క్షేత్రం వద్దకు వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దుండగులపై పోలీసులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పేదలపై కేసులు నమోదు చేయడంలో ఉన్న శ్రద్ధ.. కబ్జాదారులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి రెండ్రోజులు కావస్తున్నా ఏ ఒక్కరినీ అరెస్టు చేయకపోవడంలో పోలీసుల ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

తక్షణమే నిందితులను అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు బోడంకి చందు, పట్టణ కార్యదర్శి ఎండీ హవేశ్ తదితరులు ఉన్నారు.

స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- స్వర్ణకారులకు చేయూతనందించాలి
- స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి రాఘవాచారి
- ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా



నవతెలంగాణ - ముషీరాబాద్

కార్పొరేట్ జ్యువెలరీ షాప్‌ల మూలంగా ఉపాధి కోల్పోతున్న స్వర్ణకారులకు చేయూతనందించాలని, స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు వింజమూరి రాఘవాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడితే చేతివృత్తులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని భావించి ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన స్వర్ణకారులకు.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. కార్పొరేట్ తరహాలో నూతన జ్యువెలరీ షోరూంలు విరివిగా ఏర్పడటంతో స్వర్ణకార కుటుంబాలకు పనుల్లే రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల కాలంలోనే సుమారు 10 కుటుంబాల్లో 14 మంది ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఐదు మెన్ కమిటీ రిపోర్ట్‌ను యథాతథంగా అమలు చేసి తమిళనాడు రాష్ట్రంలో మాదిరిగా ఇక్కడా స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. జీవో 272 లోపాలను సవరించి.. పటిష్టంగా అమలు చేయాలని, స్వర్ణకారులపై పోలీసు వేధింపులను అరికట్టాలని అన్నారు. పుస్తె, మెట్టెలు, ప్రధాన ఉంగరాలు, లక్ష్మీ రూపులు తదితర పనులను స్వర్ణకారులే చేసే విధంగా.. జ్యువెలరీ షాపుల్లో వాటిని అమ్మకుండా ప్రభుత్వం జీవో తీసుకురావాలని కోరారు. స్వర్ణకార వృత్తి చేస్తూ అకాల మరణం చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా, స్వర్ణకారులకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహాధర్నాలో స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షులు రామదాసు లక్ష్మణాచారి, రవి ప్రశాంత్‌చారి, రాష్ట్ర కార్యదర్శి రాగిఫణి, సతీష్ చారి, ప్రచార కార్యదర్శులు నాగరాజు చారి, సతీష్ చారి, పోతులూరి చారి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల భారీ ర్యాలీ... సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నవతెలంగాణ-చెన్నూర్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్వర్ణకారులు సోమవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో భారీ రాలీ నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్ రోడ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వర్ణకారులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కార్పొరేట్ సంస్థలు, షాపుల్లో ఆభరణాలను విక్రయించడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వర్ణకారులు ఉపాధిలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివాహ కార్యక్రమాలకు వినియోగించే పుస్తె, మట్టెలు, ప్రధాన ఉంగరాలు తదితర వస్తువులు స్వర్ణకారులే చేయడం ఆచారంగా వస్తోందన్నారు. వాటిని కూడా కార్పొరేట్ సంస్థలే విక్రయిస్తుండటంతో తమకు పనిలేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సంప్రదాయ ఆభరణాలైన పుస్తె, మట్టెలు, ఉంగరాలు, ముఖ్యమైన వాటిని స్వర్ణకారులు మాత్రమే తయారు చేసే విధంగా ప్రభుత్వం జీఓ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. స్వర్ణకారుల సంక్షేమానికి ప్రభుత్వం భరోసా కల్పించి తమ వృత్తిని పరిరక్షించాలని కోరారు.

సంపాదకీయం

జంట మంటలు

దేశ రాజకీయాలు ఒక్కసారిగా జమిలి ఎన్నికల చుట్టూ తిరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో మణిపూర్, హర్యానా ఘటనల నుండి దేశప్రజల దృష్టి మళ్లీంచడానికి కేంద్రం ఈ ఎత్తుగడను తీసుకోచ్చింది. అంతేకాదు ప్రతిపక్షాలను కనీసం

> ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేశామని, త్వరలో మూడో పెద్ద వ్యవస్థగా ఎదుగుతుందని చెబుతోంది. కానీ, దేశంలో పేరుకుపోతున్న నిరుద్యోగం, అదుపులేని ద్రవ్యోల్బణం, తగ్గుతున్న ఉపాధి అవకాశాలు, పెరుగుతున్న ధనిక-పేద తారతమ్యాలు జీవన ప్రమాణాలను అతలాకుతలం కావిస్తున్నాయి. మణిపూర్ హింసాకాండ గురించి పార్లమెంటులో చర్చకు కూడా సాహసించలేకపోయినవారు ఇలాంటి జిమ్మిక్కులకు పూనుకుంటున్నారు.

సంప్రదించకుండానే మాజీ రాష్ట్రపతి ఆధ్వర్యంలో అధ్యయన కమిటీ ఏర్పాటు చేసింది. మార్గదర్శకాలను సైతం నిర్దేశించింది. జమిలి ఎన్నికలపై లా కమిషన్ లేవనెత్తిన కీలక ప్రశ్నలను అందులో ప్రస్తావించనే లేదు! కమిటీలో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కూడా కల్పించలేదు. ప్రతిపక్షాల ఐక్య సంఘటన "ఇండియా" మూడవ సమావేశం ముంబాయిలో జరుగుతున్న సమయంలో హఠాత్తుగా 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అన్న పల్లవి అందుకుంది బీజేపీ సర్కార్. అనూహ్యంగా ఈనెల18 నుంచి 22 దాకా ఐదురోజులు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ ప్రత్యేక సమావేశాల ఎజెండా మాత్రం రహస్యంగా ఉంచడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' వల్ల సర్కారీ ఖజానాకు చాలా సొమ్ము కలిసివస్తుందని, తరచూ ఏదో ఒక మూల ఎన్నికలు జరుగుతుండటంతో ప్రజాపాలన స్తంభించిపోతోందన్నది చెప్పే వారి మాటలు అర్థరహితం. ప్రవర్తన నియమావళి నియంత్రించేది అధికారపక్షాలకు అనుచిత లబ్ధి చేకూర్చే ఓట్ల తాయిలాలనే తప్ప, సాధారణ పాలనను కాదు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానం వాస్తవ రూపం దాల్చాలంటే కొన్ని రాష్ట్రాల్లో శాసనసభలను ముందుగానే రద్దుచేయాలి. మరికొన్ని చోట్ల వాటి కాలపరిమితిని పొడిగించాలి. అందుకు రాజ్యాంగ సవరణ తప్పదు. రాజ్యాంగ అస్తిత్వానే కుళ్లబొడిచే సవరణలు చెల్లవని సర్వోన్నత న్యాయస్థానం గతంలోనే గిరిగీసింది. ఏకకాల ఎన్నికలు సుసాధ్యం కావాలంటే అన్ని రాష్ట్ర ప్రభుత్వాల, పార్టీల ఏకాభిప్రాయాన్ని కూడగట్టక తప్పదని కేంద్రమే మొన్న జులైలోనే రాజ్యసభలో ప్రకటించింది. అంతలోనే మాట మార్చింది.



సమకాలీన రాజకీయ వాతావరణంలో ఏకాభిప్రాయ సాధన దుర్లభమే. అటువంటప్పుడు ఉన్న పళంగా జమిలిపై ఇంత హడావుడి ఎందుకు అన్నదే ఎవరికీ అంతుపట్టని ప్రశ్న. మన దేశంలో పార్టీలను చీల్చి ప్రభుత్వాలను పడగొట్టే దుష్ట సంస్కృతి వెర్రితలలు వేస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న కమలనాథులకు ఇది వెన్నతో పెట్టిన విద్య. ఒక్క స్థానం ఆధిక్యతతోనైనా సరే, ప్రభుత్వాలు సుస్థిరంగా మనగలిగే ప్రజాస్వామిక వాతావరణం మన దేశంలో ఎప్పుడో తుడిచిపెట్టుకుపోయింది. రాజకీయ అస్థిరతను నివారించాలంటే పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని సడలించాలి. ఒక వేళ జమిలి తలుపులే తెరుచుకుంటే రాష్ట్రపతి పాలన రూపేణా రాష్ట్రాలపై పెత్తనం చెలాయించేందుకు కేంద్రానికి అవకాశం చిక్కుతుందన్న భయాందోళనలూ వ్యక్తమవు తున్నాయి.

ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేశామని, త్వరలో మూడో పెద్ద వ్యవస్థగా ఎదుగుతుందని చెబుతోంది. కానీ, దేశంలో పేరుకుపోతున్న నిరుద్యోగం, అదుపులేని ద్రవ్యోల్బణం, తగ్గుతున్న ఉపాధి అవకాశాలు, పెరుగుతున్న ధనిక-పేద తారతమ్యాలు జీవన ప్రమాణాలను అతలాకుతలం కావిస్తున్నాయి. మణిపూర్ హింసాకాండ గురించి పార్లమెంటులో చర్చకు కూడా సాహసించలేకపోయినవారు ఇలాంటి జిమ్మిక్కులకు పూనుకుంటున్నారు.

మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థల విధులు వేటికవే ప్రత్యేకమైనవి. ఈ మూడంచెల పాలన వ్యవస్థలో ఎవరి బాధ్యతలు ఏమిటో ఓటర్లకు తెలియాలి. వాటి ఆధారంగా వెలువడే ప్రజాతీర్పులే ప్రజాస్వామ్యానికి ఊపిరులూదుతాయి. గల్లీ నుండి ఢిల్లీ వరకు అన్నింటికీ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే జాతీయ అంశాలే తప్ప స్థానిక సమస్యల ఊసే ఉండదు. అయినా ఒక రాష్ట్రంలోనే నాలుగైదు విడతల్లో పోలింగ్ నిర్వహించక తప్పని స్థితిలో ఎన్నికల కమిషన్ ఉంది. అందుకే ఏకకాల ఎన్నికలు ఆచరణలో అసాధ్యమైనవి. కనీసం ఐదు రాజ్యాంగ సవరణలు చేయవలసి ఉంటుంది. అంతే కాకుండా దేశంలోని కనీసం సగం రాష్ట్రాల శాసనసభలు కూడా పార్లమెంటు చేసిన సవరణను మూడింట రెండొంతుల మెజారిటీతో అంగీకరించవలసి ఉంటుంది. రకరకాల సమస్యలు జనాన్ని పీడిస్తున్నాయి. ఫలితంగా పలుకుబడి క్షీణిస్తోందని సర్వేలన్నీ ఘోషిస్తున్నాయి. జమిలి ఎన్నికల మాట ఎలా ఉన్నా 2024 సార్వత్రిక ఎన్నికలను ఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలలో నిర్వహించాలని మోడీ వ్యూహం అయి ఉండొచ్చు. ఎన్నికలకు సిద్ధంకావడానికి "ఇండియా"కు తగినంత సమయం ఉండకూడదన్న దురుద్దేశమూ ఉంది. ఏమైనా జమిలి ఎన్నికలనేవి ఒక రాజకీయ ప్రయోజన వ్యూహం తప్ప మరోటి కాదు.

ఐక్యత, సహకారమే లక్ష్యంగా బ్రిక్స్ విస్తరణ

> నిజానికి బ్రిక్స్‌ను సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక అని కూడా అనలేం. మోడీ, సౌదీ రాజు, ఈజిప్టుకు చెందిన సిసి వంటి వారు ఆయా దేశాల అధినేతలుగా ఉండగా వారి ఆధ్వర్యంలోని బ్రిక్స్ సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక ఎలా అవుతుంది? మరి బ్రిక్స్ వల్ల ఉపయోగం ఏమిటి? సామ్రాజ్యవాద పెత్తనం కింద ఉన్న ఐఎంఎఫ్ తదితర సంస్థలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై చెలాయిస్తున్న గుత్తాధిపత్యాన్ని ఎంతో కొంతమేరకు బ్రిక్స్ బలహీనపరచగలుగుతుంది. అది తప్పకుండా ఒక సానుకూల పరిణామమే. దానితోటే సామ్రాజ్యవాదానికి ఏదో పెద్ద దెబ్బ తగులుతుందని అనుకోలేం. అయితే ప్రపంచ శ్రామిక వర్గం సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోడానికి మరింత సానుకూల వాతావరణాన్ని బ్రిక్స్ సృష్టించగలదు.

మొదట బ్రిక్స్ దేశాల కూటమిలో ఐదు దేశాలు ఉండేవి. అవి: బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా. ఆ తర్వాత జొహన్నెస్‌బర్గ్ శిఖరాగ్ర సమావేశంలో మరో ఆరు దేశాలను కూడా చేర్చుకోవాలని నిర్ణయించారు. అవి: అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్. మొత్తం 22 దేశాలు బ్రిక్స్‌లో చేరాలన్న ఉత్సుకతను వ్యక్తం చేయగా వాటిలోంచి పై ఆరింటిని ఎంపిక చేశారు. ప్రస్తుతం బ్రిక్స్‌కు అధ్యక్ష స్థానంలో ఉన్న దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వ వర్గాలు వెల్లడి చేసిన వివరాల ప్రకారం ఏకంగా 40 దేశాలు బ్రిక్స్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నాయి. ఉన్నట్టుండి బ్రిక్స్ వేదిక పలుకుబడి ఇంతగా పెరగడానికి కారణం ఏమిటి? అన్న ప్రశ్న సహజంగా తలెత్తుతుంది.



ప్రభాత్ పట్నాయక్

"ఉన్నతస్థాయి"కి చెందిన సామ్రాజ్యవాద దేశాల సరసన నిలిచే అవకాశం నిరాకరించబడినందున కొన్ని పెద్ద దేశాలు తమ స్థాయికి గుర్తింపు వచ్చేలా తగిన పాత్రను ప్రపంచ వ్యవహారాలలో పోషించడానికి వీలుగా బ్రిక్స్‌ను ఏర్పాటు చేసుకున్నారని చాలామంది భావిస్తుంటారు. కాని బ్రిక్స్‌లో ఉన్న సభ్యదేశాలను చూస్తే వాటిమధ్య చాలా తేడాలున్నాయి. రష్యా, చైనా ఐరాస భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం ఉన్న దేశాలు. వాటికి అక్కడ వీటో హక్కు ఉంది. వాటిలో ఒకటైన రష్యా ప్రస్తుతం "ఉన్నతస్థాయి" కూటమి దేశాలతో యుద్ధంలో ఉంది. ఇక రెండోది చైనా. ఆ దేశాన్ని తమ ప్రధాన శత్రువుగా "ఉన్నతస్థాయి" దేశాలు ప్రకటించాయి. కాబట్టి ఆ రెండు దేశాలూ "ఉన్నతస్థాయి" దేశాల సరసన చేరడానికి తహతహలాడుతున్నాయని అనుకోలేం. ఇక బ్రిక్స్ ఒక

> బైడెన్‌తో సహా చాలామంది అమెరికా పనుపున సౌదీ అరేబియా పర్యటించి ఒపెక్ దేశాల సమావేశంలో ఉత్పత్తుల పరిమాణం తగ్గించుకోవాలన్న నిర్ణయం జరగకుండా ఉండాలని ఒత్తిడి తెచ్చారు. కాని అమెరికా ఒత్తిడులు ఫలించలేదు. ఆ తర్వాత కూడా పలుమార్లు ఒపెక్ కూటమి తమ ఉత్పత్తుల పరిమాణాన్ని తగ్గిస్తూ నిర్ణయాలను ప్రకటించింది. తమ సహజవనరుల ఉత్పత్తి విషయంలో ఆయా దేశాలు తగిన స్వేచ్ఛ కలిగివుండాలంటే కేవలం అమెరికా మీదే ఆధారపడి అంతర్జాతీయ సంబంధాలను నెరిపితే చాలదని, తమ సంబంధాలను విస్తృత పరచుకోవాలని, అదే సమయంలో అమెరికాకు ఆగ్రహం కలిగించకుండా వ్యవహరించాలని ఆ దేశాలు భావిస్తున్నాయి. అందుకు వాటికి బ్రిక్స్ ఒక దారిగా కనిపించింది.

కూటమిగా ప్రపంచ రాజకీయాలలో తలెత్తిన ఏ ప్రధాన పరిణామంలోనూ గణనీయమైన పాత్రను పోషించినట్టు దాఖలా లేదు. బ్రిక్స్‌లో చేరితే తమ దేశానికి ప్రపంచ వ్యవహారాలలో ప్రాధాన్యత పెరుగుతుందని అనుకుని అందులో చేరడానికి సన్నద్ధతను వ్యక్తం చేస్తున్న దేశాలు ఏవీ లేవు. తమ ప్రాధాన్యతను పెంచుకోడానికే వివిధ దేశాలు బ్రిక్స్‌లో చేరడానికి సిద్ధపడుతున్నాయన్న వాదన ప్రస్తుత ప్రపంచంలోని రాజకీయ ఆర్థిక పరిస్థితులను పట్టించుకోలేదు.

ప్రస్తుత ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభంలో మునిగివుంది. ప్రభుత్వాల ప్రతినిధులు, మితవాద ఆర్థికవేత్తలు ఎప్పుడూ ఉన్న వ్యవస్థను సమర్థించుకుంటూ వుంటారు. వారు సైతం ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక దీర్ఘకాలిక ఆర్థికమాంద్యంలో చిక్కుకునివుందని అంటున్నారు. పాత అంతర్జాతీయ సంస్థలు ఇటువంటి సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనడానికి సరిపోవు. ఆ సంస్థలనిప్పటి అవసరాలకు తగినట్టుగా మార్పు చేసే సత్తా సామ్రాజ్యవాద దేశాలకు లేదు. లేదా కొత్తదనాన్ని కలిగివుండి ప్రస్తుత పరిస్థితులకు తగినవిధంగా వ్యవహరించగల కొత్త సంస్థలను ఏర్పాటు చేయగల సత్తా కూడా వాటికి లేదు. ఈ పరిస్థితులలో బ్రిక్స్ ఒక ఆశాజనకమైన నవ్యత్వాన్ని ప్రదర్శిస్తోంది. ప్రస్తుతం సామ్రాజ్యవాదుల గుప్పెట్లో ఉండే సంస్థలు ఆర్థిక సంక్షోభాన్ని నివారించగలవన్న విశ్వాసం క్రమంగా తరిగిపో తోందనడానికి తార్కాణమే బ్రిక్స్ పలుకుబడి పెరగడం. దీనిని బట్టి బ్రిక్స్‌ను ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక కూటమిగా చూడకూడదు. అందులో కొన్ని సభ్యదేశాలు నిస్సందేహంగా సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరినే కలిగివున్నాయి. కాని ఈజిప్ట్, ఇథియోపియా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటివి ఏ కోశానా సామ్రాజ్యవాద వ్యతిరేకం కాదు. ఇప్పుడు బ్రిక్స్‌లో చేరగానే అవి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకం అయిపోయాయని భావించలేం. సామ్రాజ్యవాదంతో విభేదించకుండానే ప్రస్తుత పరిస్థితుల్లో ఆశాజనకమైన వేరే దారి ఏదైనా ఉన్నదా అని అన్వేషిస్తున్న క్రమంలో వాటికి బ్రిక్స్ అటువంటి ఒక వేదికగా కనిపించింది. అందులో చేరడం ద్వారా రానున్న రోజుల్లో తమకు కావాల్సిన కీలకమైన సహాయం ఆశించవచ్చునని అవి ఆశిస్తున్నాయి.

ప్రస్తుతం విస్తరించిన బ్రిక్స్‌లో మూడు రకాల దేశాలు ఉన్నాయి. సామ్రాజ్యవాదం ఏకపక్షంగా ఆంక్షలు విధించడం, లేదా వాటికి నష్టం కలిగించేలా "రక్షణ" విధానాలను అనుసరించడం కారణంగా కొన్ని దేశాలు, చమురు, సహజవాయువు ఉత్పత్తి చేసే దేశాలు, ఇప్పటికే ప్రపంచ సంక్షోభంలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న దేశాలు, సమీపకాలంలో ఇబ్బందులను ఎదుర్కొనబోతున్న దేశాలు ఉన్నాయి చైనా, రష్యా, ఇరాన్ మొదటి కోవకి చెందినవి. రష్యా, ఇరాన్, సౌదీ అరేబియా, యుఎఇ రెండో కోవకి చెందుతాయి. (ఒక దేశం రెండు, మూడు రకాల ఇబ్బందులను ఎదుర్కొనడం జరుగుతోంది) ఈజిప్ట్, ఇథియోపియా, అర్జెంటినా మూడో కోవకి చెందుతాయి. రాబోతున్న సంక్షోభంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు అవసరం అన్న దృష్టితో ఉన్నవి బ్రెజిల్, ఇండియా.

ఎటువంటి భద్రతామండలి ఆమోదమూ లేకుండానే ఏకపక్షంగా సామ్రాజ్యవాదదేశాలు విధించిన ఆంక్షలను ఎదుర్కొంటున్న దేశాలకు ఆ ఆంక్షలనుండి తప్పుకొని బయటపడడానికి మార్గాంతరంగా బ్రిక్స్ ఉండే అవకాశం కనిపి స్తోంది. ఈ అర్థంలో చూసినప్పుడు ఇరాన్‌ను సభ్యదేశంగా అంగీకరించాలన్నది జొహన్నెస్‌బర్గ్ శిఖరాగ్ర సమావేశం తీసుకున్న నిర్ణయాలలోకెల్లా ప్రాముఖ్యత కలిగివుంది. ఇరాన్ మీద తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధించడమే కాదు, సంపన్న పశ్చిమ దేశాల్లో ఇరాన్ దాచుకున్న విదేశీ మారకపు నిల్వలను ఆ దేశం వినియోగించుకోడానికి వీలులేకుండా ఆంక్షకు గురైన మొదటి దేశం అది. సామ్రాజ్యవాద దేశాలు తమకు తాముగా ఏర్పాటు చేసుకున్న నిబంధనలకు సైతం ఇది విరుద్ధం. సామ్రాజ్యవాద ముఠానుండి ఇటువంటి ధాష్టీకం రానురాను మామూలైపోయింది. తాజాగా ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా ఇదే విధమైన ఆంక్షను ఎదుర్కొంటోంది. విదేశాల్లోని తన స్వంత విదేశీమారకపు నిధులను రష్యా ఇప్పుడు వినియోగించుకోడానికి వీలు లేకుండా ఆంక్ష పెట్టారు. సామ్రాజ్యవాదులు పన్నిన ఈ ఉచ్చునుంచి బైట పడాలంటే బ్రిక్స్ అందుకు ఒక సాధనంగా ఉపయోగపడుతుంది.

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా తమ ఉత్పత్తుల ధరలు పడిపోవడం చమురు, సహజవాయువు ఉత్పత్తి చేసే దేశాలు ఎదుర్కొంటున్న సమస్య. ఆ ధరలను పడిపోకుండా నిలబెట్టడానికి ఆ దేశాలు తమ ఉత్పత్తుల పరిమాణాన్ని తగ్గించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. అప్పుడు వాటి డిమాండ్ పెరిగి ధరలు నిలబడతాయి. కాని ఇది అమెరికాకు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. బైడెన్‌తో సహా చాలామంది అమెరికా పనుపున సౌదీ అరేబియా పర్యటించి ఒపెక్ దేశాల సమావేశంలో ఉత్పత్తుల పరిమాణం తగ్గించుకోవాలన్న నిర్ణయం జరగకుండా ఉండాలని ఒత్తిడి తెచ్చారు. కాని అమెరికా ఒత్తిడులు ఫలించలేదు. ఆ తర్వాత కూడా పలుమార్లు ఒపెక్ కూటమి తమ ఉత్పత్తుల పరిమాణాన్ని తగ్గిస్తూ నిర్ణయాలను ప్రకటించింది. తమ సహజవనరుల ఉత్పత్తి విషయంలో ఆయా దేశాలు తగిన స్వేచ్ఛ కలిగివుండాలంటే కేవలం అమెరికా మీదే ఆధారపడి అంతర్జాతీయ సంబంధాలను నెరిపితే చాలదని, తమ సంబంధాలను విస్తృత పరచుకోవాలని, అదే సమయంలో అమెరికాకు ఆగ్రహం కలిగించకుండా వ్యవహరించాలని ఆ దేశాలు భావిస్తున్నాయి. అందుకు వాటికి బ్రిక్స్ ఒక దారిగా కనిపించింది.

ఇక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులలో ఉన్న ఈజిప్ట్, అర్జెంటినా, ఇథియోపియా వంటి దేశాలు, అంతమోతాదులో



కాకపోయినా, ఇబ్బందులను ఎదుర్కొంటున్న బ్రెజిల్, ఇండియా, దక్షిణాఫ్రికా దేశాలు బ్రిక్స్ పట్ల ఆకర్షితులవడానికి కారణం వేరే ఉంది. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వ్యాపారం జరపగలిగే అవకాశం బ్రిక్స్ ద్వారా జరిగే వీలుంది. ఇటీవలే బ్రెజిల్, చైనా తమ స్థానిక కరెన్సీల రూపంలో పరస్పరం వ్యాపారం చేసుకోడానికి ఒప్పందం కుదుర్చు కున్నాయి. అదే మాదిరిగా ఇండియా, యుఎఇల మధ్య కుదిరింది. బ్రిక్స్ సభ్య దేశాల నడుమ ఈ తరహా ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందాలు రానున్న కాలంలో మరిన్ని జరుగుతాయి. బ్రిక్స్ పట్ల ఆకర్షితులవడానికి ఇదొక ప్రధాన కారణం.ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందం కుదుర్చుకునే దేశాల కరెన్సీల విలువలను సాపేక్షంగా నిర్ణయించుకుంటారు. అప్పుడు డాలర్ అనేది ఆ వ్యాపారంలో అవసరం ఉండదు. అప్పుడు ఆ రెండు దేశాలకూ పరస్పరం వ్యాపారం జరుపు కోడానికి ఎక్కువ కరెన్సీ అందుబాటులోకి వస్తుంది. (అదే డాలర్ అయితే దానిని పరిమితంగానే నిల్వ ఉంచుకోగలుగుతాయి) అప్పుడు వాటి వ్యాపారం కూడా విస్తరిస్తుంది. దానితోబాటు కరెన్సీ చెలామణీ కూడా పెరుగుతుంది. డాలర్ నిల్వల కొరత అనే సమస్య ఆ దేశాల వ్యాపారానికి అవరోధంగా ఇంకెంతమాత్రమూ ఉండదు.

అయితే ఇది సమస్యలో సగభాగానికి మాత్రమే పరిష్కారం. దానితోబాటు ఇంకొక అంశాన్ని కూడా పరిష్కరించుకోవాలి. రెండు దేశాల నడుమ వ్యాపారం జరిగినప్పుడు ఆ రెండింటిలో ఒక దేశం రెండో దేశానికి చేసిన ఎగుమతుల విలువ ఎక్కువగా ఉండి దిగుమతుల విలువ తక్కువగా ఉంటే అప్పుడు చెల్లింపుల మిగులు ఒక దేశానికి, లోటు రెండో దేశానికి ఏర్పడుతుంది. ఆ తేడాను భర్తీ చేయడానికి మిగులు ఉన్న దేశం వెంటనే గాని, సమీప భవిష్యత్తులో గాని రెండో దేశంనుండి ఎక్కువ సరుకులను దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా చేస్తే విదేశీ వ్యాపారంలో లోటును బర్తీ చేసుకోడానికి రుణం తీసుకోవలసిన అగత్యం తలెత్తదు. పైగా డాలర్ రుణం కోసం దేవులాడాల్సిన పనిలేనప్పుడు ఆ రెండు దేశాలూ తమ తమ ఉత్పత్తుల సామర్ధ్యాన్ని మరింత పెంచుకోగులుగాయి. తద్వారా ప్రపంచ సంపద పెరుగుతుంది. అంటే డాలర్ నియంత్రణ నుండి బైటపడగలిగితే ద్వైపాక్షికంగా ఒప్పందాలు కుదుర్చుకునే దేశాలకు లాభదాయకంగా ఆ ఒప్పందాలు పరిణమిస్తాయి.ఇటువంటి ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందాలను బ్రిక్స్ ప్రోత్సహిస్తే, వాణిజ్యలోటు ఏర్పడిన దేశాలు అప్పులపాలు గాకుండా ఆ దేశం నుండి రెండో దేశం వాణిజ్యలోటు భర్తీ అయ్యే విధంగా సరుకులను దిగుమతి చేసుకుంటే, అప్పుడు అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకోలుకోడానికి ఎంతో దోహదం చేస్తుంది. అప్పుడు బ్రిక్స్ సామ్రాజ్యవాద ఆధిపత్యానికి ఒక నిజమైన ప్రత్యామ్నాయ వేదికగా వ్యవహరించగలుగుతుంది.

బ్రిక్స్ సభ్యదేశాలలోని వామపక్ష వాదుల మధ్య ఇప్పుడు ఒక చర్చ నడుస్తోంది. సామ్రాజ్యవాదం బ్రిక్స్‌ను గురించి ఏమనుకుంటోంది? అన్నది వారి ప్రశ్న. కొంతమంది బ్రిక్స్ సామ్రాజ్యవాద వ్యతిరేక వేదికే గాని, పెట్టుబడిదారీ వ్యతిరేక వేదిక కాదు అని వాదిస్తున్నారు. నిజానికి బ్రిక్స్‌ను సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక అని కూడా అనలేం. మోడీ, సౌదీ రాజు, ఈజిప్టుకు చెందిన సిసి వంటి వారు ఆయా దేశాల అధినేతలుగా ఉండగా వారి ఆధ్వర్యంలోని బ్రిక్స్ సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక ఎలా అవుతుంది? మరి బ్రిక్స్ వల్ల ఉపయోగం ఏమిటి? సామ్రాజ్యవాద పెత్తనం కింద ఉన్న ఐఎంఎఫ్ తదితర సంస్థలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై చెలాయిస్తున్న గుత్తాధిపత్యాన్ని ఎంతో కొంతమేరకు బ్రిక్స్ బలహీనపరచగలుగుతుంది. అది తప్పకుండా ఒక సానుకూల పరిణామమే. దానితోటే సామ్రాజ్యవాదానికి ఏదో పెద్ద దెబ్బ తగులుతుందని అనుకోలేం. అయితే ప్రపంచ శ్రామిక వర్గం సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోడానికి మరింత సానుకూల వాతావరణాన్ని బ్రిక్స్ సృష్టించగలదు.

(స్వేచ్ఛానురణ)



బాల కార్మికులు లేని సమాజాన్ని నిర్మిద్దాం

కొన్ని దేశాలలో 5 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సున్నవారిని, ఇంకొన్ని దేశాలలో 5 నుంచి 18 సంవత్సరాల మధ్యలో ఉన్న వారిని బాల కార్మికులుగా గుర్తిస్తున్నారు. బాల్యాన్ని నాశనం చేసే రీతిలో బాలల శారీరక, మానసిక అభివృద్ధికి ఆటంకమై వారికి కనీస అక్షరాస్యతను, వినోదాన్ని కూడా పొందే అవకాశాన్ని ఇవ్వనిస్థితిని బాలకార్మిక వ్యవస్థగా చెప్పొచ్చు. ఈ వ్యవస్థలో ఉండే వారిని బాల కార్మికులుగా పిలుస్తారు. శ్రమకు బలైపోతున్న వీరి జీవితాలు మనం సాధించిన అభివృద్ధిని ప్రశ్నిస్తున్నాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ -19కి ముందు 160 మిలియన్ల మంది ఉన్నారు. ఇందులో 63మిలియన్ల మంది బాలికలు, 97మిలియన్ల మంది బాలురు ఉన్నారు. ఇందులో ఎక్కువగా 70శాతం వ్యవసాయ రంగంలో, 20శాతం సేవారంగం లోనూ, 10శాతం ఇతర పరిశ్రమలలో పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో బాల కార్మికుల ప్రాబల్యం పట్టణ ప్రాంతాల్లో కంటే మూడు రెట్లు ఎక్కువ. అత్యధికంగా సబ్ సహారాన్ ఆఫ్రికా ప్రాంతంలో 86.6మిలియన్ల మంది ఉన్నారు. కోవిడ్ 19 వలన అదనపు ఆర్థిక అవసరాలు, పాఠశాలల మూసివేతలు, పెద్దలలో ఉద్యోగం కోల్పోవడం, ఆదాయ నష్టాలు, తల్లిదండ్రుల్లో ఒక్కరుగాని లేదా ఇద్దరూ మరణించడం వలన 2022 సంవత్సరం ముగింపున మరో 8.9 మిలియన్ల మంది కొత్తగా బాలకార్మికులు పెరుగుతారని అంచనా వేసింది. వీరిపై దృష్టి పెట్టకపోతే వీరి సంఖ్య మరింత పెరగొచ్చని తెలిపింది.

బాల కార్మికులు ప్రపంచంలోని అత్యంత పేద దేశాలలో నలుగురిలో ఒకరున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ బాలకార్మికుల సమస్య తొలినాళ్లలో అంటే 16, 17వ శతాబ్దాలలో తమ పిల్లలను విక్రయించేవారితో ప్రారంభమైంది. కొనుగోలు చేసిన వారు తమ ఇళ్లల్లో పనులు చేయించుకునేవారు. పారిశ్రామిక విప్లవం మొదలైన తరువాత బాలకార్మికులు ఎక్కువయ్యారు. కారణం తక్కువ వేతనంతో ఎక్కువ పనిని పిల్లలతో పరిశ్రమ యజమానులు చేయించుకునేవారు. ఇప్పుడు ఎక్కువగా వ్యవసాయ రంగం, గృహ సంబంధ పనులు, బాణాసంచా, వస్త్రాలు, గనులు, మైనింగ్, బొమ్మల తయారీ, గొడుగులు తయారీలోనూ, వార్తా పత్రికలు ఇంటింటికీ అందించడంలోనూ బాల కార్మికులు ఎక్కువగా ఉన్నారు.ఇంకా వ్యవసాయం, పాడి, మత్స్య, అటవీ రంగాలలో, రిటైల్‌గా వస్తువులు అమ్మడం లోనూ, రెస్టారెంట్‌లలోనూ, వస్తువులు లోడింగ్, చెత్తను తీయడం, బూట్లు పాలిష్ చేయడం, అసంఘటిత రంగాల లోనూ, కొన్నిరకాల యంత్రాలు ఆపరేటింగ్ చేయడంలో, ఉప్పు పరిశ్రమ, అద్దాల తయారీ పరిశ్రమలోనూ, ఎక్కువ మంది బాలకార్మికులు కనిపిస్తున్నారు. తరువాత కాలంలో అన్నిరంగాలలో బాలకార్మికులు పెరుగుతూ వచ్చారు. కుటుంబంలో ఎక్కువ మంది సంపాదించే స్థితిలో లేకపోవడం, పెద్ద కుటుంబాలు, చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణించడం, ఏదో సమస్యలతో రోడ్ల మీద పిల్లలను వదిలివేయడం, తప్పిపోయిన పిల్లలు, తల్లిదండ్రుల నిరక్షరాస్యత, తరచూ పిల్లలతో పనికోసం వలసలు వెళ్ళడం, వ్యవసాయరంగంలో పెద్దలకు సాయంగా పిల్లలను తోడుగా ఉంచుకోవడం మొదలైన కారణాలుగా ఉన్నాయి.

18ఏండ్ల కంటే తక్కువ వయస్సున్న వారికి కొన్ని హక్కులున్నాయి. అన్ని పరిస్థితులలో లింగ, జాతి, మతం, కులం, హోదాలతో సంబంధం లేకుండా అందరికీ విద్యను అందజేయాలి. ఈ విషయంలో అన్ని దేశాలు అందరికీ విద్యావకాశాలు కల్పిస్తున్నాయి. ఇంకా పిల్లలకు వారికి నచ్చిన రంగంలో చదువుకునే హక్కు ఉంది. జీవించే హక్కు, ఆర్థిక సామాజిక, పర్యావరణ, అభివృద్ధి హక్కులున్నాయి. ఇక మనదేశంలో తీసుకుంటే బాల కార్మిక వ్యతిరేక చట్టం 1986లో మన దేశం రూపొందించబడింది. భారత రాజ్యాంగం బాలలకు కొన్ని హక్కులు కల్పించింది. ఆర్టికల్ 14లో సమానత్వం హక్కు, ఆర్టికల్ 15లో వివక్షతకు వ్యతిరేకంగా ఉండే హక్కు, ఆర్టికల్ 21లో వ్యక్తిగత జీవించే హక్కు, ఆర్టికల్ 21(ఎ)లో ఆరు సంవత్సరాల నుండి 14ఏండ్లలోపు పిల్లలందరికీ నిర్బంధ ఉచిత విద్యను పొందే హక్కు, ఆర్టికల్ 23లో శ్రమ దోపిడీ నుండి రక్షించబడే హక్కు, ఆర్టికల్ 24లో 14ఏండ్ల వయస్సు లోపు చిన్న పిల్లల చేత పరిశ్రమల్లోనూ, గనులలోనూ, ఇతర ప్రమాదభరిత ఉత్పత్తి ప్రక్రియలలోను పనిచేయించరాదు, ఆర్టికల్ 45లో పిల్లలకు ఉచిత నిర్బంధవిద్యను అందించడం వంటి హక్కులున్నాయి. వారికి అందజేయడంలో ప్రభుత్వాలు విఫలమైన మాట వాస్తవం.

బాలకార్మికులను గుర్తించకపోతే సరైన పోషకాహారం లేకపోవడం వలన శారీరకం గానూ, మానసికంగానూ, మేధోపరంగానూ, అభివృద్ధి చెందలేరు. త్వరగా అలసిపోవడం వలన అనేక వ్యాధులు గురవుతారు. మారిన కాలానికి అనుగుణంగా విద్య నేర్చకపోవడం వలన పనిచేసే రంగంలో నాణ్యతను కోల్పోయే కారణంగా పనిచేసే రంగం నుండి నెట్టబడి నిరుద్యోగులలుగా తయారవుతారు. అప్పుడు వీరికి ఉపాధి దొరకక దొంగతనానికి, స్మగ్లర్లుగా, గూండాలుగా, మాఫియా ముఠా సభ్యులుగా తయారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. బాలకార్మిక వ్యవస్థను సరైన సమయంలో నిషేధించాలి. ఆయా దేశాలలో వారి చట్టాల ప్రకారం ఉల్లంఘించే వ్యక్తుల మీద, సంస్థల మీద చర్యలు తీసుకోవాలి. వీళ్లకు ప్రత్యేక పాఠశాలలు తెరవాలి. సరైన పోషకాహారం అందేటట్లు చూడాలి. మానసిక వైద్యులచే కౌన్సిలింగ్ ఇప్పించాలి. కేవలం ప్రభుత్వాలు మాత్రమే ఈ పనిని చేయలేవు. స్వచ్ఛంద సంస్థలు తల్లిదండ్రులకు బాలకార్మికులు వలన కలిగే ఇబ్బందులను తెలియజేయాలి. ఈ అనాగరిక బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- డిజె మోహనరావు, 9440485824

సమాజంలో గురువుల పాత్ర-ఒక విశ్లేషణ

గురువు విజ్ఞానులను రూపొందిస్తాడు. తమ విద్య ద్వారా వాళ్ళను స్వయం పోషకులను చేస్తాడు. వాళ్లలో అవగుణాలను నశింపజేసుకో గల్గిన విచక్షణ జ్ఞానాన్ని నింపుతాడు. అలా త్రిమూర్తుల కర్తవ్యాలను ఒక్క గురువే నిర్వహిస్తుంటాడు! అందుకే గురువునంతగా గౌరవించింది సమాజం! గురువుల్లో అలాంటి పాత్రను సమర్థవంతంగా నిర్వహించిన మహోన్నత వ్యక్తిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను గుర్తించింది దేశం. ఉన్నత విద్యావంతుడిగా, లెక్చరర్, ప్రొఫెసర్, వైస్ ఛాన్సలర్, విదేశీ రాయభారి, రాష్ట్రపతిగా భారతదేశానికి విశిష్టసేవలందించాడు! పలు వ్యాసాలు, ప్రసంగాలు, గ్రంథాల ద్వారా 'భారతీయ తత్వశాస్త్రానికి ప్రపంచ ఖ్యాతి నార్జించాడు! "సంకుచితత్వం నుండి విశాలతత్వానికి, మానవ స్థాయి నుండి అతీత స్థానానికి ఎదగాలన్న కాంక్ష, మనిషి స్వభావంలోనే నిక్షిప్తమై, అదే అతని గమ్యమన్న భావన మనిషిని నడిపిస్తున్నది!" అని సహేతుకంగా నిరూపిస్తూ "భావ వాది జీవిత దృక్పథం' గ్రంథాన్ని అందించిన మానవ మహోపకారి రాధాకృష్ణన్! అందుకే ఆయన జన్మదినం 1988 సెప్టెంబరు 5ను గురు పూజోత్సవాన్ని జరుపుకుంటున్నాం.



పాతూరి వెంకటేశ్వరరావు

మనిషి ఆధునిక సమాజంలోకి అడుగుపెట్టాక విద్య దాని ప్రాముఖ్యతను చాటింది. మనిషి వ్యవసాయం నేర్చి, స్థిర నివాసి అయ్యాక అనేక వస్తువుల అవసరత ఏర్పడింది! ఉదాహరణకు పొలం పనికి నాగలి, పలుగు, పార, కొడవలి, గొడ్డలి, ఇంటికి తలుపు, తాళం, కళ్ళెం, గొళ్ళెం, కంచం, మంచం, కప్పు, చెప్పు, తట్ట, బుట్ట వగైరాలు! వీటన్నిటితోనే ఎవరికి వాళ్ల రూపొందించుకోలేరు గనుక, గ్రామస్తులంతా బృందాలుగా ఏర్పడి ఆయా పనులను పంచుకున్నారిలా... గ్రామంలో సగంమంది సేద్యం చేసి ధాన్యం పండించటానికి అలా వ్యవసాయ పరికరాల తయారీ, కుండలు, బట్టలు, చెప్పులు వగైరాల ఉత్పత్తి కార్యక్రమాలను ఒక్కో బృందం చేపట్టింది. అందరి ఉత్పత్తులను గ్రామస్తులందరూ పంచుకుంటూ తమ అవసరలను తీర్చుకునేవారు. అలా ప్రతి గ్రామమూ మరో గ్రామంపై ఆధార పడకుండా జీవించేవారు. అందుకే దీనిని "గ్రామీణ స్వయం పోషక ఆర్థిక విధానం"మన్నారు 'కారల్‌మార్క్స్'.



ఆయా వస్తూత్పత్తి లో పగలంతా శ్రమించి, రాత్రికాగానే నిద్రపోయే వారు గ్రామస్తులు. మరి వాళ్ళ పిల్లలకు చదువు, సంస్కారం నేర్పి ప్రయోజకుల్ని చేసేదెవరు? అందుకని గ్రామస్తులంతా సమావేశమై గ్రామంలో కెల్లా తెలివి, జ్ఞానం, అనుభవం, శీలం గలవారిని గుర్తించి వారిలో అత్యుత్తముని తమ గ్రామానికి గురువు (పెద్ద)గా నియమించుకున్నారు. బాల బాలికలను ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యతను అతనికప్పగించారు. ఆయన నిరంతరం అదే పనిలో లీనమయ్యేవారు. పోషణను సమిష్టి బాధ్యతగా స్వీకరించింది గ్రామం! 'ప్రేమ, కరుణ, క్షమ, పరోపకారం వంటి మానవీయ విలువలను, నీతి, నిజాయితీ, సత్యం, ధర్మం వంటి నైతిక విలువలను కూడ, కథలు, పాటలు, నాటికల రూపంలో ప్రబోధిస్తూ స్వీయ, సామాజిక ప్రయోజకులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతుండేవాడు గురువు! కేవలం విద్యాబోధనకే కాక, ఖాళీ సమయంలో గ్రామీణులకు మెళుకువలు నేర్పుతో, వాళ్ళ అధికోత్పత్తులకు తోడ్ప డుతుండేవాడు! ముందుగా ప్రకృతి వైపరీత్యాల ప్రమాదాలను గుర్తించి, గ్రామస్తులను హెచ్చరిస్తుండేవాడు. ప్రజల, పశువుల అనారోగ్యాలకు పరిష్కా రాలను సూచిస్తూ గ్రామ క్షేమానికి తోడ్పడుతుండేవాడు! అందుకే నాడు గురువును, దైవ సమానునిగా భావించి, తమ తమ ఉత్పత్తులలో మేలైన వాటిని, ముందుగా గురువుకే సమర్పించుకునే వారు ప్రజలు! పరిణామ క్రమంలో గురుకులాలు, పాఠశాలలుగా గురువులు ప్రభుత్వోద్యోగులుగా మారారు.

ఉదారవాద ఆర్థిక విధానాల పుణ్యాన 'ఉన్నది అమ్ముకో, లేనిది కొనుక్కో'మనే వ్యాపార వ్యవస్థగా మారింది సమాజం! తక్షణ లాభాల దిశగా పెట్టుబడులను మళ్ళించి, విద్యారంగానికి నిధులను కుదించారు పాలకులు! అయితే అక్కడక్కడ కొంతమంది సామాజిక స్పృహను విస్మరిస్తున్నారనే విమర్శ వస్తోంది. ఉదాహరణకు యూపీలోని ముజఫర్‌నగర్‌లోని ఖుబ్బాపూర్‌లో నేహా పబ్లిక్ పాఠశాలలో ఎక్కాలు సరిగ్గా అప్పగించలేదని రెండో తరగతిలో ఓ ముస్లిం బాలుడిని తోటి హిందూ బాలురతో రెచ్చగొట్టి మరీ కొట్టించిన ఉపాధ్యాయిని త్రిప్తా త్యాగి దుష్కృత్యం క్షమించరానిది. పదే పదే కొట్టించటం ఒక్కటే కాదు. ఆ సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. ముస్లిం పిల్లలు బాగా చదవరని, వారి తల్లులు అసలు పట్టించుకోరని ఇష్టారీతిన ఆమె వ్యాఖ్యానించటం- పిల్లల హృదయాల్లో మత విద్వేషాన్ని నాటడమే అవుతుంది. ఇలాంటి ఉపాధ్యాయుల వల్ల ప్రజలకు, వాళ్ళకు మధ్య గల ప్రేమ, గౌరవాభిమానాలు ఆవిరైపోతున్నాయి! ఈ రోజు దేశం ఇంతటి అభివృద్ధిని సాధిస్తుందంటే కారణం కచ్చితంగా సమాజ నిర్మాతలైన ఉపాధ్యాయులే. కానీ అక్కడక్కడ వీరి ప్రవర్తన పసి పిల్లల్లో విద్వేషాలకు బీజం వేస్తున్నది.ఈ ధోరణి పూర్తిగా మారాల్సిన అవసరం కొన్ని ఘటనలు నొక్కి చెబుతున్నాయి.

> విద్యా వ్యాపారంగా మారిపోవటానికి వ్యవస్థ ప్రభావమే కారణమన్నది కొంతమేరకు నిజమే! కానీ దయచేసి అందరిలాగే ఈ వ్యాపార ప్రవాహంలో కొట్టుకుపోకుండా ఉపాధ్యాయులు నిలదొక్కుకోవాలి. ఎందుకంటే డాక్టరు తప్పుకు పేషెంట్, ఇంజనీరు తప్పుకు కట్టడం, లాయర్ తప్పుకు క్లైంటు, రాజకీయ నేత తప్పుకు అతని పార్టీ నష్టపోతాయి.కానీ ఉపాధ్యాయుని తప్పుకు, నిర్లక్ష్యానికీ జాతి భవితవ్యమే నాశనమవుతుందని విజ్ఞులు అంటున్నారు. అందరిలా ఆశల కోసం కాక, ఆశయాల కోసం జీవించి దారి తప్పి పతనమార్గాన కొట్టుకుపోతున్నవారిని దిశానిర్దేశం చేసి కాపాడాలి.

విద్యా వ్యాపారంగా మారిపోవటానికి వ్యవస్థ ప్రభావమే కారణమన్నది కొంతమేరకు నిజమే! కానీ దయచేసి అందరిలాగే ఈ వ్యాపార ప్రవాహంలో కొట్టుకుపోకుండా ఉపాధ్యాయులు నిలదొక్కుకోవాలి. ఎందుకంటే డాక్టరు తప్పుకు పేషెంట్, ఇంజనీరు తప్పుకు కట్టడం, లాయర్ తప్పుకు క్లైంటు, రాజకీయ నేత తప్పుకు అతని పార్టీ నష్టపోతాయి.కానీ ఉపాధ్యాయుని తప్పుకు, నిర్లక్ష్యానికీ జాతి భవితవ్యమే నాశనమవుతుందని విజ్ఞులు అంటున్నారు. అందరిలా ఆశల కోసం కాక, ఆశయాల కోసం జీవించి దారి తప్పి పతనమార్గాన కొట్టుకుపోతున్నవారిని దిశానిర్దేశం చేసి కాపాడాలి. వ్యాసమహర్షి, రాధాకృష్ణన్‌లా సరైన విద్య నందించాలి. అలా విద్యార్థులకు, సమా జానికీ గురువులుగా మంచి హితబోధకులవ్వాలి. ఈ గురు పూజోత్సవ దినాన సమాజసేవకు పాటుపడే ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి శుభాకాంక్షలు! నా శుభాశీస్సులు!


(నేడు ఉపాధ్యాయ దినోత్సవం)

సెల్:98490818889

వరదల నివారణపై ముందస్తు చర్యలు చేపట్టాలి

- నివేదిక ఇవ్వాలన్న హైకోర్టు

నవతెలంగాణ - హైదరాబాద్



వరదల వల్ల వివిధ తరహా నష్టాల నియంత్రణకు విపత్తు నిర్వహణ చట్టంలోని సెక్షన్ 39కి అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వరదలు వచ్చాక తీసుకునే సహాయక చర్యల కంటే ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ మేరకు సెక్షన్ 39లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని విపత్తుల నిర్వహణ శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. భారీ వర్షాలు, వరదల సమయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గల్లంతైన గట్టం మహాలక్ష్మి కోసం గాలించి ఆచూకీ గుర్తించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె మరణించినట్టు నిర్ధారణ అయితే ఆమె కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. జులై, ఆగస్టులో వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని కోరుతూ డాక్టర్ చెరుకు సుధాకర్ వేసిన అనుబంధ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. వరదల్లో 47 మంది మరణించారనీ, వారిలో 24 మందికి పరిహారం చెల్లించినట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ న్యాయవాది హరేంద్ర ప్రసాద్ వివరాలు సమర్పించారు. వరదలప్పుడు 192 సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి 20,387 మందికి తాత్కాలిక నివాసం, ఆవాసం, వైద్యసేవలు అందించినట్టు వివరించారు. వరదలు తగ్గాక ఆ కేంద్రాలను ఎత్తేశామన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గల్లంతైన మహాలక్ష్మి ఆచూకీ మాత్రం లభించలేదన్నారు. వరదలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకునేలా ఉత్తర్వులివ్వాలని పిటిషనర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోరారు. విచారణ డిసెంబర్ 18కి వాయిదా పడింది.

ఎంపీ అవినాష్ తండ్రికి బెయిల్ నిరాకరణ

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు, కడప ఎంపీ అవినాష్ రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, అదే కేసులో మరో నిందితుడు గజ్జల ఉదయకుమార్ రెడ్డిలకు హైకోర్టులో ఎదురుదెబ్బతగిలింది. తమకు బెయిల్ ఇవ్వాలంటూ కోరుతూ వేసిన వేర్వేరు పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ లక్ష్మణ్ తుది ఉత్తర్వులు జారీ చేశారు.

'ఏపీ సీఎం జగన్‌కు భాస్కర్‌రెడ్డి సన్నిహిత బంధువు. ఇదే కేసులో ఎనిమిదో నిందితుడైన ఎంపీ అవినాష్‌రెడ్డికి తండ్రి. భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌లపై తీవ్ర అభియోగాలున్నాయి. వివేకా హత్యకు కుట్ర, సాక్ష్యాల చెరిపివేతలో వారిద్దరి ప్రమేయంపై ఆధారాలు కనిపిస్తున్నాయి. వారిద్దరూ పలుకుబడి ఉన్న వ్యక్తులు. ఇతరులను బెదిరించి సాక్షులపై ప్రభావితం చేసే అవకాశాలున్నాయి. సీఐ శంకరయ్య, గంగిరెడ్డి వాంగ్మూలాలు ఇస్తామంటూ వెనక్కి తగ్గారు. ఇద్దరు సాక్షులు అనుమానాస్పద స్థితిలో మరణించారు. సాక్షులను ప్రభావితం చేస్తే బెయిల్ రద్దు కోరవచ్చనడం సరికాదు. దస్తగిరి, సాక్షుల వాంగ్మూలాల విశ్వసనీయతను ట్రయల్ కోర్ట్ పరిశీలిస్తుంది. బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకోలేం. అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ సుప్రీం కోర్టు పరిశీలనలో ఉంది. దస్తగిరి మినహా నిందితులందరూ జ్యుడీషియల్ కస్టడీలోనే ఉన్నారు. కేసు డైరీ, అన్ని అంశాలనూ పరిశీలించిన అనంతరం పిటిషన్లను కొట్టివేస్తున్నాం'అని ఉత్తర్వుల్లో పేర్కొంది.

శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికల కేసులో అడ్వకేట్ కమిషన్

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికపై దాఖలైన ఎన్నికల పిటిషన్ కేసులో సాక్షుల వాంగ్మూలాల నమోదుకు హైకోర్టు అడ్వకేట్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. సాక్షులకు నోటీసులు ఇచ్చింది. ఈనెల 11 నాటికి సాక్షుల స్టేట్‌మెంట్లను రికార్డు చేయాలని కమిషన్‌ను ఆదేశించింది. ఎవరికీ వాయిదాలు ఇవ్వరాదని చెప్పింది. ఈ మేరకు జస్టిస్ లక్ష్మణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల ఆరు, ఎనిమిది, 11 తేదీల్లో సాక్షులుగా ఉన్న అధికారుల స్టేట్‌మెంట్లను రికార్డు చేసి 12న జరిగే విచారణ నాటికి ఇవ్వాలని కమిషన్‌ను ఆదేశించారు.

నోటీసులు జారీ

మెదక్ పోలీస్ స్టేషన్‌లో ఖదీర్ ఖాన్ వ్యాపారి అనుమానాస్పద మృతి కేసుపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. దొంగతనం కేసులో తన భర్త ఖాన్‌ను పోలీసులు కొట్టడం వల్లే మరణించాడంటూ అతని సతీమణి సిద్దేశ్వరి పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ అలోక్ అరధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. హోం కార్యదర్శి, మెదక్ ఎస్పీ, మెదక్ ఎస్‌హెచ్‌ఓ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఇదే ఘటనపై విచారణలో ఉన్న పిల్‌తో కలిపి ఈ పిటిషన్‌ను విచారిస్తామంది. సిట్ ఏర్పాటు చేయాలనీ, పిటిషనర్‌కు ప్రభుత్వం రూ.50 లక్షలు ఇచ్చేలా ఉత్తర్వులివ్వాలని ఆమె న్యాయవాది వాదించారు.

నేడు టీపీసీసీ అత్యవసర సమావేశం

మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈనెల 16,17 తేదీల్లో సీడబ్ల్యూసీ సమావేశాలు హైదరాబాద్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం టీపీసీసీ అత్యవసర విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

గాంధీభవన్‌లో ఫ్లెక్సీ కలకలం

ఎల్బీనగర్ ఫ్లెక్సీల వార్‌కు గాంధీభవన్ వేదికైంది. రెండు వర్గాలతో క్యాడర్ అయోమయానికి గురవుతున్నది. కాంగ్రెస్ పార్టీ పేరుతో గాంధీభవన్ వద్ద 'మధుయాష్కీగౌడ్ ఎల్బీనగర్‌కు రావొద్దు. తిరిగి నిజామాబాద్‌కు పోవాలి' అనే పోస్టర్లు వెలిశాయి. పోస్టర్లు ఏర్పాటుతో రాజకీయ కలకలం రేపుతున్నది. ఈ విషయంపై తనకు ఎలాంటి సంబంధం లేదంటూ ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లో తనకు సర్వేలన్నీ అనుకూలంగా ఉన్నాయనీ, ఇలాంటి చిల్లర చేష్టలు తనను ఏమీ చేయలేవని తెలిపారు. ఈ స్థానం నుంచి తనకే ఎక్కువగా గెలుపు అవకాశాలు ఉన్నాయన్నారు. తన గెలుపు కోసం నియోజకవర్గంలో పని చేసుకుంటున్నాననీ, ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో మరోసారి వర్గ విభేదాలు రచ్చకెక్కాయి.

పీఈసీ సభ్యులతో స్క్రీనింగ్ కమిటీ విడివిడిగా భేటీ

తమ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలంటూ కాంగ్రెస్ పార్టీకి దరఖాస్తుల పరిశీలన ముగిసిన నేపథ్యంలో స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించింది. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ (పీఈసీ) సభ్యులతో స్క్రీనింగ్ కమిటీ విడివిడిగా భేటీ అయింది. ఈమేరకు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వి.హనుమంతరావు, జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య తదితరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాత్రం పార్టీ కోసం కష్టపడిన నాయకులకు సముచిత స్థానం కల్పించాలంటూ లేఖ ఇచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేతలకు టికెట్లు ఇవ్వాలని కోరుతూ స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ మురళీధర్‌కు మానవతారాయ్, కొనగాలి మహేష్, బాలలక్ష్మి, విజయ్ వినతిపత్రం సమర్పించారు.

11 నుంచి కొత్త ఎస్సైలకు ట్రైనింగ్ షురూ

- ఏర్పాట్లపై దృష్టి సారించిన పోలీసు అకాడెమీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : ఎంపికైన కొత్త ఎస్సైలకు ఈనెల 11వ తేదీ నుంచి శిక్షణా తరగతులను ప్రారంభించటానికి రాజ బహదూర్ వెంకట్రామ్‌రెడ్డి పోలీసు అకాడెమీలో ఏర్పాట్లు పూర్తైనట్టు తెలిసింది. అలాగే, కొత్తగా ఎంపికైన ఎస్సైలు ఈనెల 9వ తేదీన సంబంధిత అధికారుల ముందు హాజరయ్యేలా అంతర్గత ఆదేశాలను డీజీపీ కార్యాలయం నుంచి జారీ అయినట్టు తెలిసింది.

ఈనెల 10 నుంచి వీరికి ట్రైనింగ్ మొదలు పెట్టాలనీ, 11 నుంచి తరగతులు ప్రారంభించాలని కూడా షెడ్యూల్ నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే, 16న ఎస్సైల ట్రైనింగ్ శిక్షణా కార్యక్రమాన్ని డీజీపీ లేదా హోం మంత్రి ద్వారా ప్రారంభింప చేయడానికి కూడా సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం.

ప్రారంభమైన జీ20 సాంకేతిక వర్క్‌షాప్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ పరిశోధన, విద్యాశాఖ, వ్యవసాయం, రైతుల సంక్షేమం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వాతావరణ అనుకూల వ్యవసాయంపై జీ20 తలపెట్టిన సాంకేతిక వర్క్‌షాప్ సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శంషాబాద్ నోవాటెల్‌లో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో జీ20 సభ్య దేశాల నుంచి విదేశీయులు, అతిథులుగా ఆహ్వానించబడిన దేశాలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభ సమావేశంలో పాల్గొన్న కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శోభా కరంద్లాజే మాట్లాడుతూ జీ 20 దేశాల్లో ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయం దెబ్బతిన్నదనీ, దీనిపై వర్క్‌షాప్ తగిన సిఫారసులు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్క్‌షాప్‌లో భాగంగా జీ20 దేశాల ప్రతినిధులు 5న ఐసీఏఆర్-ఐఐఎంఆర్‌ను, 6న ఐసీఏఆర్-క్రిడాలను సందర్శించనున్నారు.

తొమ్మిది రంగాల్లో ప్రపంచ లక్ష్యాలు సాధించాలి

-సునీల్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంచాయతీరాజ్ సంస్థలు తొమ్మిది రంగాల్లో ప్రపంచ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి సునీల్ కుమార్ సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయితీ రాజ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ - అవలోకనం, అవకాశాలు అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయితీ రాజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్. జి.నరేంద్ర కుమార్, అదనపు కార్యదర్శి డాక్టర్ చంద్ర శేఖర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఇంటర్ విద్యా కమిషనర్‌కు టీజీజేఎల్‌ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్‌ఏ-475) కోరింది. ఈ మేరకు ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్‌కు సోమవారం ఆన్‌లైన్ ద్వారా ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ వినతిపత్రం సమర్పించారు. ఈ ఏడాది మార్చికి సంబంధించి మహబూబ్‌నగర్, ఖమ్మం, హన్మకొండ జిల్లాల్లో కొన్ని కాలేజీల్లో పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకులకు వివిధ కారణాల వల్ల వేతనాలు అందలేదని తెలిపారు. మేకి సంబంధించి 449 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు 28 రోజుల వేతనాలు అందాల్సి ఉందని పేర్కొన్నారు. జూన్, జులై, ఆగస్టు వేతనాలు ఇంత వరకు అందలేదని వివరించారు.

మహిళల భద్రతకు నిధులేవి ?

• బడ్జెటరీ కేటాయింపులో అలసత్వం • కేటాయించిన నిధులనూ ఖర్చు చేయని వైనం

న్యూఢిల్లీ : గత దశాబ్ద కాలంలో మహిళల భద్రత కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టింది. ఇది సంతోషించదగిన విషయమే అయినప్పటికీ ఈ పథకాలు, కార్యక్రమాలకు అవసరమైన బడ్జెటరీ కేటాయింపులు మాత్రం చేయడం లేదు. వాటి అమలుపై అధికార యంత్రాంగం కూడా పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

మన దేశంలో శిశువు జన్మించినప్పటి నుండే లింగ అసమానతలు ప్రారంభమవుతున్నాయి. ఆడపిల్ల పుట్టిందంటేనే పెదవి విరుపులు. ఆ తర్వాత వనరులు, సౌకర్యాల విషయంలో వివక్ష. విద్య, ఆరోగ్య రక్షణ వంటి రంగాలలోనూ చిన్నచూపే. సమాన పనికి సమాన వేతనమనేది అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది.



'సంబల్'దీ అదే దారి

2020-21లో కేంద్రం 'వన్ స్టాప్ సెంటర్' పేరుతో మరో పథకాన్ని ప్రారంభించి రూ.160 కోట్లు ఖర్చు చేసింది. మహిళల రక్షణ, సాధికారత కోసం దీనిని ఉద్దేశించారు. అయితే దీనిని ఆ తర్వాత వివిధ పథకాలతో కలిపేశారు. వీటన్నింటినీ కలగలిపి 'సంబల్' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఏ పథకానికి విడిగా ఎంత కేటాయించారో తెలియడం లేదు. బేటీ బచావ్ బేటీ పఢావ్, వన్ స్టాప్ సెంటర్, నారీ అదాలత్, మహిళా పోలీస్ వాలంటీర్, ఉమెన్స్ హెల్ప్‌లైన్...ఇలా అన్ని పథకాలకూ కలిపి 'సంబల్' పేరిట 2021-22లో రూ.587 కోట్లు కేటాయించారు.

ఖర్చు చేసింది మాత్రం రూ. 183 కోట్లు. తర్వాతి సంవత్సరాలలో కేటాయింపుల ను కూడా రూ.562 కోట్లకు కుదించారు. ఈ పథకాలకు బడ్జెటరీ కేటాయింపుల్లో సరైన ప్రాధాన్యత లభించడం లేదన్నది వాస్తవం. కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయకపోవడంతో తదుపరి సంవత్సరాలలో కేటాయిం పుల్లో మరింత కోత పెడుతున్నారు.

ఆందోళనకరంగా నేరాల రేటు

మరోవైపు దేశంలో మహిళలపై అకృత్యాలు, అఘాయిత్యాలు, వేధింపులు పెరిగిపోతున్నాయి. లైంగిక వేధింపుల కేసులు భారీగానే నమోదవుతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో తాజా నివేదిక ప్రకారం ప్రతి లక్ష జనాభాలో మహిళలపై నేరాల రేటు 2020లో 56.5 ఉంటే 2021లో 64.5కు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2021లో మహిళలపై అత్యాచారం లేదా సామూహిక అత్యాచారం జరపడంతో పాటు వారిని హతమార్చిన ఘటనలు 293 జరిగాయి.

ఏం చేయాలి?

నిర్భయ, సంబల్ వంటి కార్యక్రమాలు మహిళలకు అవసరమైన భద్రతను అందిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ కావాల్సింది అధికారుల్లో చిత్తశుద్ధి. ప్రభుత్వం కూడా అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు వాటిని సరిగా ఖర్చు చేయడంపై దృష్టి సారించాల్సి ఉంటుంది. గతంలో జరిగిన పొరబాట్లను గుర్తించి వాటిని సరిచేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే మహిళల కోసం రూపొందించిన పథకాలు, కార్యక్రమాలు సత్ఫలితాలను అందిస్తాయి.

'నిర్భయ'లో కోతలు

మహిళల కోసం ఎన్నో పథకాలు, కార్యక్రమాలు చేపడుతున్నామని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటు న్నప్పటికీ వాటికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు మాత్రం చేయడం లేదు. 2013-14లో మహిళల కోసం ప్రత్యేక పోలీస్ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసేందుకు, వారికి ప్రయాణాలలో భద్రత కల్పించేందుకు కేంద్రం 'నిర్భయ' పేరిట కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసింది. దీనికి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించింది. అయితే 2017-18, 2018-19, 2019-20 సంవత్సరాలలో రూ.550 కోట్ల చొప్పున మాత్రమే కేటాయింపులు జరిపింది. 2021- 22, 2022-23లో మరింత కోత పెట్టి రూ.500 కోట్ల చొప్పున కేటాయించింది. పోనీ కేటాయించిన నిధులనైనా సరిగా ఖర్చు చేస్తున్నారా అంటే అదీ లేదు. 2023 ఏప్రిల్ 23 నాటికి ఈ నిధికి రూ.12,008.5 కోట్లు కేటాయించి నప్పటికీ రూ.4,923 కోట్లు మాత్రమే విడుదల చేశారు. అందులోనూ రూ.2,521 కోట్లు ఖర్చు చేశారు. అంటే కేటాయించిన సొమ్ములో 21%, విడుదల చేసిన నిధులలో 51% మాత్రమే ఖర్చు పెట్టారు.

బృందాకరత్ పిటిషన్‌పై సుప్రీం విచారణ అక్టోబర్ 3కు వాయిదా

న్యూఢిల్లీ: సీఏఏ వ్యతిరేక నిరసనలపై విద్వేష ప్రసంగాలు చేసినందుకు బీజేపీకి చెందిన అనురాగ్ ఠాకూర్, ప్రవేశ్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, పార్టీ ఢిల్లీ కార్యదర్శి కెఎం తివారీ వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు అక్టోబరు 3కి వాయిదా వేసింది. తొలుత బీజేపీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదుకు ట్రయల్ కోర్టు తిరస్కరించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. ఆ ఆదేశాలను బృందాకరత్ సవాలు చేశారు. ఈ కేసు విచారణను వాయిదా వేయా లని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు కోరడంతో జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ పంకజ్ మిథాల్‌లతో కూడిన బెంచ్ వాయిదా వేసింది. ఈ కేసులో ప్రతివాదులకు తదుపరి వాయిదా మంజూరు చేయబో మని సుప్రీం తెలిపింది. బృందాకరత్ వేసిన పిటిషన్‌పై ఢిల్లీ పోలీసులకు ఏప్రిల్ 17న సుప్రీం నోటీసులు జారీ చేసింది. విద్వేష ప్రసంగాలు చేసినందుకు ఆ ఇద్దరు బీజేపీ ఎంపీలపై సీపీఐ(ఎం) నేతలు బృందాకరత్, కె.ఎం.తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను గతేడాది జూన్ 13న ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. ట్రయల్ కోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు తిరస్కరించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటే తగిన అథారిటీ నుంచి అనుమతి తీసుకోవాల్సిన అవసరం వుందని పేర్కొంది. ఆ ఇద్దరు బీజేపీ నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నా రని, ఫలితంగా ఢిల్లీలో ఆందోళనలు జరుగుతున్న రెండు వేర్వేరు ప్రాంతాల్లో మూడు కాల్పుల సంఘటనలు చోటుచేసుకున్నాయ ని పిటిషనర్లు తెలిపారు. బీజేపీతో పాటు విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ తదితర సంస్థల నాయకులు ఢిల్లీలోని నాంగ్లోరు, ఘోండా చౌక్‌తోపాటు వివిధ ప్రదేశాల్లో జరిగిన బహిరంగ సభల్లో హిందూ మతం పేరుతో ముస్లిం సమాజంపై ప్రజలను రెచ్చగొట్టారని పిటిషన్‌లో సీపీఐ(ఎం) నేతలు పేర్కొన్నారు. హిందూ మతం పేరుతో రాజ్యాంగ విలువలు, లౌకికవాదానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టారు. దేశ రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో ఇటువంటి సమావేశాలు జరుగుతున్నాయి. ముస్లిం సమాజంపై ఆర్థిక, సామాజిక బహిష్కరణకు నిరంతరం పిలుపు ఇస్తున్నాయి' అని తెలిపారు.

గువహతి ఎవిక్షన్ డ్రైవ్

- ఇద్దరు మహిళల అర్ధనగ్న నిరసన
- తరలింపు ప్రక్రియతో నిరాశ్రయులవుతున్న స్థానికులు
- రాష్ట్ర ప్రభుత్వంపై నిరసనకారుల ఆగ్రహం

గువహతి : గువహతిలో అక్కడి ప్రభుత్వం చేపట్టిన స్థానికుల తరలింపు ప్రక్రియ(ఎవిక్షన్ డ్రైవ్) వివాదాస్పదమ వుతున్నది. అక్కడి స్థానికులను ఆందోలనకు గురి చేస్తు న్నది. ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా ఇద్దరు మహిళలు అర్ధ నగ్నంగా నిరసన తెలిపారు. దీంతో ప్రభుత్వ డ్రైవ్‌పై ప్రతి పక్ష నాయకులు, సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. దశాబ్దాల క్రితం, వ్యవసాయం, చేపల వేటలో నిమ గ్నమై ఉన్న పర్యావరణపరంగా సున్నితమైన చిత్తడి నేలకి సమీపంలో ఉన్న భూమిపై కొంతమంది వ్యక్తులు స్థిరపడ టం ప్రారంభించారు. కాలక్రమేణా, జనాభా పెరిగింది. పర్యావరణ-సున్నితమైన చిత్తడి నేలను మరింత నాశనం చేయకుండా నిరోధించడానికి అసోం ప్రభుత్వం ఒక చట్టా న్ని రూపొందించింది. అయితే, చట్టం అమలులోకి రాక ముందే రాష్ట్ర ప్రభుత్వం అక్కడ నివసిస్తున్న వారితో సహా ప్రజలను ఖాళీ చేయించడం ప్రారంభించింది. దీంతో ఇక్కడి ప్రజలు నిరాశ్రయుల య్యారు. వారు తమ భవిష్యత్తుపై ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. అసోం రాజధాని గువహతి లోని సిల్సాకో బీల్ (సరస్సు) ప్రాంతంలోని వేలాది మంది ప్రజల దీనగాథ ఇది. పోలీసులు, సీఆర్పీఎఫ్ సహాయంతో సెప్టెంబర్ 1 నుంచి 2 వరకు జరిగిన తాజా భారీ తొలగింపు డ్రైవ్‌ను నివాసితులు గట్టిగా నిరసించారు. సెప్టెంబరు 1న ఇద్దరు మహిళా నిరసనకారులు అర్ధనగ్నంగా నిరసన తెలపటంతో.. పోలీసులు వారి పట్ల కఠినంగా వ్యవహరిం చారు. దీంతో ఇక్కడి పరిస్థితులు అధ్వాన్నంగా మారాయని స్థానికులు తెలిపారు. తమ ఇండ్లను రక్షించుకోవటానికి వారు ఇలా చేశారనీ, ప్రభుత్వ చర్యతో తాము నిరాశ్రయు లమవుతామని నిరసనకారుడొకరు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా పోలీసులతో బలవంతంగా జరిపించే ఈ తరలింపు ప్రక్రియను మానుకో వాలని ప్రతి పక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలు రాష్ట్ర బీజేపీ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సత్తా చాటాలని..!

- టైటిల్ వేటలో ప్రణయ్, లక్ష్యసేన్
- ఆఖరు నిమిషంలో సింధు దూరం

నేటి నుంచి చైనా ఓపెన్ సూపర్ సిరీస్


పతకం పట్టాలి! : వెటరన్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్

నవతెలంగాణ-చాంగ్జౌ

ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల ముంగిట భారత షట్లర్లు సత్తా చాటేందుకు చూస్తున్నారు. నేటి నుంచి ఆరంభం కానున్న చైనా ఓపెన్ సూపర్ సిరీస్ 1000 టోర్నీలో భారత్ నుంచి హెచ్.ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ సహా సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు టైటిల్ వేటలో నిలిచారు. రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్, అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకుంది. ఇటీవల వరుస టోర్నీల్లో నిరాశ పరుస్తున్న పి.వి సింధు.. ఆసియా క్రీడలపై ఫోకస్ పెట్టేందుకు చైనా ఓపెన్‌కు దూరమైంది. సింధు దూరం కావటంతో.. మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచీ పోటీ కరువైంది.

జోరు సాగేనా..

ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో కాంస్య పతకం సాధించిన హెచ్.ఎస్ ప్రణయ్.. భారత టైటిల్ వేటకు నాయకత్వం వహిస్తున్నాడు. ఈ సీజన్లో నిలకడగా రాణిస్తున్న ప్రణయ్.. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో కండ్లుచెదిరే ప్రదర్శన చేశాడు. వరల్డ్ నం.1, ఒలింపిక్ చాంపియన్ విక్టర్ అక్సెల్సన్ (డెన్మార్క్)పై సంచలన విజయంతో వరల్డ్ చాంపియన్‌షిప్స్ పతకం సొంతం చేసుకున్నాడు. ఆ పతక ప్రదర్శనతో కెరీర్ అత్యుత్తమ నం.6 ర్యాంక్ సాధించిన ప్రణయ్.. చైనా ఓపెన్‌లో కఠిన సవాల్ ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాడు. తొలి రౌండ్లో మలేషియా ఆటగాడు యాంగ్‌తో పోటీపడనున్న ప్రణయ్.. రెండో రౌండ్లో వరల్డ్ నం.4, మూడో సీడ్ కునాల్‌విట్‌తో తలపడనున్నాడు. క్వార్టర్స్‌లో వరల్డ్ నం.9 జొనాథన్ క్రిస్టీ.. సెమీస్‌లో మళ్లీ వరల్డ్ నం.1 విక్టర్ అక్సెల్సన్‌లు ప్రణయ్‌కు ఎదురు పడనున్నారు. యువ షట్లర్, కామన్‌వెల్త్ గేమ్స్ చాంపియన్, వరల్డ్ చాంపియన్‌షిప్స్ పతక విజేత లక్ష్యసేన్ సైతం టైటిల్ రేసులో నిలిచాడు. మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ.. లక్ష్యసేన్ ప్రదర్శనలో నిలకడ లోపించింది. ఆసియా క్రీడల్లో అదరగొట్టేందుకు ఎదురు చూస్తున్న లక్ష్యసేన్.. తొలుత చైనా ఓపెన్‌లో చెలరేగేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. తొలి రౌండ్లో ఆండర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్), రెండో రౌండ్లో నాల్గో సీడ్ కీన్ యోవ్ (సింగపూర్), క్వార్టర్స్‌లో విక్టర్ అక్సెల్సన్‌లు లక్ష్యసేన్‌కు సవాల్‌గా నిలుస్తున్నారు. మరో ఆటగాడు ప్రియాన్షు రజావత్ సైతం మెన్స్ సింగిల్స్ బరిలో నిలిచాడు. తొలి రౌండ్లో ఇండోనేషియా ఆటగాడితో రజావత్ పోటీపడనున్నాడు.

పురుషుల డబుల్స్‌లో తెలుగు తేజం సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి టైటిల్ ఫేవరేట్‌గా ఆడుతోంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో క్వార్టర్స్‌లో నిష్క్రమించి పతకం చేజార్చుకున్న సాత్విక్, చిరాగ్‌లు చైనా ఓపెన్‌లో రెండో సీడ్‌గా బరిలోకి దిగుతున్నారు. ఎం.ఆర్ అర్జున్, ధ్రువ్ కపిల జోడీ తొలి రౌండ్లో జపాన్ షట్లర్లను ఎదుర్కొనుంది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి, ట్రెసా జాలిలకు కఠిన డ్రా ఎదురైంది. తొలి రౌండ్లోనే టాప్ సీడ్, చైనా జంట చెన్, జియలతో ఆడనుంది. చైనా ఓపెన్ సూపర్ సిరీస్ నేటి నుంచి ఆరంభం.


ఫామ్ సాధించాలని.. : యువ షట్లర్ లక్ష్యసేన్

ఓపెనర్లే కొట్టారు

- 145 పరుగులను ఊదేసిన రోహిత్, గిల్
- నేపాల్‌పై విజయంతో సూపర్ 4కు భారత్
- నేపాల్ 230/10, భారత్ 147/0

పసికూనపై పంజా. 145 పరుగుల లక్ష్యాన్ని టీమ్ ఇండియా అలవోకగా ఛేదించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (00), శుభ్‌మన్ గిల్ (00) అజేయ అర్థ సెంచరీల మోత మోగించారు. నేపాల్‌పై టీమ్ ఇండియా 10 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం నమోదు చేసింది. తొలుత నేపాల్ 230 పరుగులకు కుప్పకూలగా.. వర్షం అంతరాయంతో డక్‌వర్త్ లూయిస్ పద్దతి ప్రకారం భారత్ లక్ష్యాన్ని 23 ఓవర్లలో 145 పరుగులుగా నిర్దేశించారు. నేపాల్‌పై విజయంతో భారత్ సూపర్ 4 దశలోకి ప్రవేశించింది.



నవతెలంగాణ-పల్లెకల్

నేపాల్‌పై టీమ్ ఇండియా పంజా విసిరింది. ఓపెనర్లు అజేయ అర్థ సెంచరీలతో చెలరేగిన మ్యాచ్‌లో భారత్ పది వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (74 నాటౌట్, 59 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (67 నాటౌట్, 62 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) కదం తొక్కగా.. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం నిర్దేశించిన 145 పరుగుల లక్ష్యాన్ని భారత్ 20.1 ఓవర్లలోనే ఊదేసింది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ 48.2 ఓవర్లలో 230 పరుగులకు కుప్పకూలింది. ఆసిఫ్ షేక్ (58, 97 బంతుల్లో 8 ఫోర్లు), సోంపాల్ (48, 56 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (3/61), రవీంద్ర జడేజా (3/40) మూడేసి వికెట్లు పడగొట్టారు.

అలవోకగా..

ఛేదనలో భారత్ 17/0తో ఉండగా వర్షం అంతరాయం కలిగించింది. ఎడతెరిపి లేని వర్షంతో ఓవర్లను కుదించాల్సి వచ్చింది. 23 ఓవర్లలో 145 పరుగులను లక్ష్యంగా నిర్దేశించారు. సవరించిన లక్ష్య ఛేదనలో భారత ఓపెనర్లు చెలరేగారు. రోహిత్ శర్మ శుభ్‌మన్ గిల్ బౌండరీల వర్షం కురిపించారు. ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 39 బంతుల్లో రోహిత్ అర్థ సెంచరీ సాధించగా.. ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 47 బంతుల్లో గిల్ ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. మరో 17 బంతులు మిగిలి ఉండగానే భారత్ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

బొరా నేపాల్..!

టాస్ నెగ్గిన టీమ్ ఇండియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పాక్‌తో వర్షార్పణమైన మ్యాచ్‌లో భారత బౌలర్లకు అవకాశం చిక్కలేదు. దీంతో నేపాల్‌పై తొలుత బౌలింగ్ చేయాలని నిర్ణయించారు. కొత్త బంతితో పేసర్లు మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్‌లు అవకాశాలు సృష్టించినా.. ఫీల్డర్లు నిరాశపరిచారు. తొలి ఐదు ఓవర్లలోనే ఏకంగా మూడు క్యాచులు నేలపాలయ్యాయి. అందివచ్చిన జీవనదానాలతో నేపాల్ ఓపెనర్లు కదం తొక్కారు. ఆసిఫ్ షేక్ (58), కుశాల్ (38) తొలి వికెట్‌కు 9.5 ఓవర్లలోనే 65 పరుగులు జోడించారు. అసిఫ్ ఓ ఎండ్‌లో నిలిచినా.. భీమ్ (7), రోహిత్ (5), కుశాల్ ఎం (2) వికెట్ నిలుపుకోలేదు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు గుల్షాన్ (23), దీపేంద్ర సింగ్ (29)లు ఆకట్టుకున్నారు. టెయిలెండర్ సోంపాల్ కామి (48) మెరవటంతో నేపాల్ 230 పరుగుల మంచి స్కోరు నమోదు చేసింది. భారత బౌలర్లను ఎదుర్కొని 100 పరుగులైనా చేస్తుందా? అనే అనుమానాలు చవిచూసిన నేపాల్ ఏకంగా 48.2 ఓవర్ల పాటు వికెట్లను కాపాడుకుని 230 పరుగులు చేసింది. నేపాల్ బ్యాటర్ల మెరుపులతో మైదానంలో ఆ దేశ అభిమానులు సందడి చేశారు.

17 ఏండ్ల అనంతరం..

- పాక్‌లో అడుగుపెట్టిన బీసీసీఐ ఆఫీస్ బేరర్లు
- రోజర్ బిన్ని, రాజీవ్ శుక్లాకు ఘన స్వాగతం

అమృత్‌సర్ : భారత్, పాకిస్థాన్ క్రికెట్ ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక మలుపు. 17 ఏండ్ల సుదీర్ఘ విరామానికి తెరదించుతూ బారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఉన్నతాధికారులు పాకిస్థాన్ గడ్డపై కాలుమోపారు. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్ని, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాలు రెండు రోజుల పర్యటన నిమిత్తం పాకిస్థాన్‌కు చేరుకున్నారు. ఆసియా కప్ ఆతిథ్య దేశంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆహ్వానం మన్నించిన బీసీసీఐ సోమవారం అటారీ-వాఘా సరిహద్దు దాటేసి పాకిస్థాన్‌కు చేరుకున్నారు. బీసీసీఐ ఆఫీస్ బేరర్లకు పీసీబీ ఘన స్వాగతం పలికింది.



అటారీ-వాఘా సరిహద్దు నుంచి పాక్‌లో అడుగుపెడుతున్న రోజర్ బిన్ని, రాజీవ్ శుక్లా

విందు భేటీ

భారత జట్టు చివరగా 2008 ఆసియా కప్ కోసం పాక్‌లో పర్యటించగా.. చివరగా ద్వైపాక్షిక సిరీస్ కోసం 2006లో పర్యటించింది. ఆ తర్వాత ఇరు దేశాల నడుమ ద్వైపాక్షిక సంబంధాలు క్షీణించటం, పాకిస్థాన్ పర్యటన సందర్భంగా శ్రీలంక క్రికెట్ బస్సుపై ఉగ్రవాదుల దాడితో భద్రతా కారణాల రీత్యా టీమ్ ఇండియా పొరుగు దేశానికి వెళ్లటం లేదు. ఆసియా కప్ కోసం పాక్‌లో పర్యటనకు నిరాకరించిన బీసీసీఐ.. విందు భేటికి మాత్రం సుముఖత వ్యక్తం చేసింది. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ గవర్నర్ ఆతిథ్యం ఇవ్వనున్న విందుకు రోజర్ బిన్ని, రాజీవ్ శుక్లాలు హాజరు కానున్నారు. 2004లో చారిత్రక 'ఫ్రెండిషిప్ సిరీస్' పర్యటన బృందంలో సైతం రాజీవ్ శుక్లా భాగం కావటం విశేషం. 'ఆసియా కప్ ఆతిథ్య దేశం పాకిస్థాన్. బీసీసీఐ బృందం పాక్‌లో పర్యటించటం పూర్తిగా క్రికెట్‌కు పరిమితం. రాజకీయాలతో ముడిపెట్టవద్దు. బంగ్లాదేశ్, అఫ్గనిస్థాన్, పాకిస్థాన్ క్రికెట్ బోర్డుల ప్రతినిధులు సహా బీసీసీఐ తరఫున మేమిద్దరం పంజాబ్ ప్రావిన్స్ గవర్నర్ విందుకు హాజరు కానున్నాం' అని రాజీవ్ శుక్లా తెలిపారు.

కాంస్యం ఖాయం


- సెమీస్‌లో మెన్స్ జట్టు
- టేబుల్ టెన్నిస్ ఆసియా చాంపియన్‌షిప్స్


జి సతియన్

పియాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా)

టేబుల్ టెన్నిస్ ఆసియా చాంపియన్ షిప్స్‌లో భారత పురుషుల జట్టు పతకం ఖాయం చేసుకుంది. సోమవారం జరిగిన మెన్స్ టీమ్ క్వార్టర్‌ఫైనల్లో టీమ్ ఇండియా 3-0తో సింగపూర్‌పై గెలుపొందింది. మెన్స్ జట్టు విభాగంలో సెమీఫైనల్లోకి ప్రవేశించిన భారత్.. కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకుంది. టీమ్ ఈవెంట్ తొలి మ్యాచ్‌లో వెటరన్ అచంట శరత్ కమల్ అదరగొట్టాడు. 11-1, 10-12, 11-8, 11-13, 14-12తో ఐజాక్ క్వెక్‌పై ఐదు గేముల్లో అద్భుత విజయం సాధించాడు. టైబ్రేకర్‌కు దారితీసిన పోరులో 41 ఏండ్ల శరత్ కమల్ పైచేయి సాధించాడు. మరో సింగిల్స్‌లో జ్ఞానశేఖరన్ సతియన్ సైతం మెరుపు విజయం నమోదు చేశాడు. 11-6, 11-8, 12-10తో కోయెన్ పాంగ్‌పై వరుస గేముల్లో గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో యువ ప్యాడ్లర్ హర్మీత్ దేశాయ్ 11-9, 11-4, 11-6తో జెయు క్లారెన్స్‌పై ఏకపక్ష విజయం నమోదు చేశాడు. దీంతో భారత్ 3-0తో సింగపూర్‌ను చిత్తు చేసింది. మూడో సీడ్ టీమ్ ఇండియా నేడు సెమీఫైనల్లో ఇరాన్, చైనీస్ తైపీ క్వార్టర్‌ఫైనల్ విజేతతో సెమీఫైనల్లో తలపడనుంది. గత ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత మెన్స్ జట్టు కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే. ఇక, మహిళల జట్టు క్వార్టర్‌ఫైనల్లో అమ్మాయిల నిరాశపరిచారు. జపాన్‌తో క్వార్టర్స్‌లో భారత్ 0-3తో తేలిపోయింది. వరల్డ్ నం.8 మిమ 11-7, 15-13, 11-8తో అహిక ముఖర్జీపై గెలుపొందగా.. వరల్డ్ నం.36 మనిక బత్ర 7-11, 9-11, 11-9, 3-11తో వరల్డ్ నం.7 హినా హయత చేతిలో ఓడింది. మరో మ్యాచ్‌లో సుతీర్థ ముఖర్జీ 11-7, 4-11, 6-11, 5-11తో పరాజయం పాలైంది. 5-8 స్థానాల కోసం నేడు జరిగే క్లాసిఫికేషన్ మ్యాచుల్లో భారత మహిళల జట్టు ఆడనుంది.

డెవిల్ కోసం 80 భారీ సెట్స్


కళ్యాణ్ రామ్

నందమూరి కళ్యాణ్ రామ్ టైటిల్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'డెవిల్'. బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్ అనేది ట్యాగ్ లైన్. స్వాతంత్ర్యానికి ముందు కథాంశంతో రూపొందుతున్న ఈ పీరియాడిక్ మూవీ కోసం 1940 బ్యాక్ డ్రాప్‌లో మేకర్స్ ఏకంగా 80 అద్భుతమైన భారీ సెట్స్ వేయటం విశేషం. ఈ సందర్భంగా ఆర్ట్ డైరెక్టర్ గాంధీ మాట్లాడుతూ,"బ్రిటీష్ పరిపాలనలో మన దేశం ఉన్న సమయానికి చెందిన సెట్స్ వేయటం ఛాలెంజింగ్‌గా అనిపించింది. తమిళనాడు, కర్ణాటక, కేరళ, రాజస్థాన్ వంటి పలు ప్రాంతాల నుంచి సెట్స్‌కి కావాల్సిన సామాగ్రిని తెప్పించాం. నిర్మాత అభిషేక్ నామా సపోర్ట్ లేకుండా ఈ రేంజ్‌లో భారీ సెట్స్ వేసి సినిమాని రిచ్‌గా తెరకెక్కించటం సాధ్యమయ్యేది కాదు. 1940 మద్రాస్ ప్రాంతంలోని ఆంధ్రా క్లబ్, బ్రిటీష్ కాలానికి తగ్గట్లు 10 వింటేజ్ సైకిల్స్, 1 వింటేజ్ కారు, బ్రిటీష్ కవర్ డిజైన్‌తో ఉన్న 500 పుస్తకాలు, 1940 కాలానికి చెందిన కార్గో షిప్, 36 అడుగుల ఎత్తైన లైట్ హౌస్ సెట్ ఇలా దాదాపు 80 భారీ సెట్స్‌ను రూపొందించాం. వీటి కోసం 9 ట్రక్కుల కలపతో పాటు వెయ్యి టన్నులకు పైగా ఐరన్, ఫైబర్, 10వేల చదరపు అడుగుల వింటేజ్ వాల్ పేపర్‌ను ఉపయోగించాం' అని తెలిపారు.

ఆర్ట్ డైరెక్టర్ గాంధీ

నవచిత్రం


ఆద్యంతం వినోదభరితం


నేహాశెట్టి, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'రూల్స్ రంజన్'. రత్నం కృష్ణ దర్శకుడు. నిర్మాత ఏ.ఎం.రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రింకు కుక్రెజ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'ఇంట్రడక్షన్ ఆఫ్ రూల్స్ రంజాన్' పేరుతో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందులోని నాలుగో పాటని ప్రదర్శించారు. అలాగే ఈ సినిమాని ఈనెల 28న విడుదల చేస్తున్నట్లు ఏ.ఎం.రత్నం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'వినోదాత్మక సినిమాలకి విజయావకాశాలు ఎక్కువ ఉంటాయి. ఇప్పటికే సినిమా చూశాను. కుటుంబమంతా కలిసి చూడగలిగేలా ఉన్న ఈ చిత్రం ఖచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'ఈ కథ వినేటప్పుడు రెండు గంటల పాటు నవ్వుతూనే ఉన్నాను. థియేటర్లలో చూసేటప్పుడు మీరు కూడా అలాగే నవ్వుకుంటారనే నమ్మకం ఉంది' అని హీరో కిరణ్ అబ్బవరం చెప్పారు. నాయిక నేహా శెట్టి మాట్లాడుతూ, "డీజే టిల్లు'లో రాధిక పాత్ర తర్వాత, ఈ సినిమాలో నేను పోషించిన సనా పాత్ర ప్రేక్షకులను అంతలా మెప్పిస్తుంది'అని తెలిపారు. 'మీ ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి థియేటర్లకు వెళ్లి ఆనందించదగ్గ చిత్రమిది' అని దర్శకుడు రత్నం కృష్ణ అన్నారు.

నిర్మాతలు దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి మాట్లాడుతూ, 'కృష్ణ కథ చెప్పినప్పుడే బ్లాక్ బస్టర్‌ని అందిస్తానని నమ్మకం కలిగించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకొంటూ చిత్రాన్ని ఎంతో అందంగా మలిచారు' అని చెప్పారు.

వెండితెరపై కాళోజీ జీవితం


మూల విరాట్

తెలంగాణకు చెందిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణ రావు జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. జైనీ క్రియేషన్స్ పతాకంపై విజయలక్ష్మీ జైనీ నిర్మాణంలో దర్శకుడు ప్రభాకర్ జైనీ తెరకెక్కిస్తున్నారు. ఇందులో కాళోజీగా మూలవిరాట్, ఆయన భార్యగా పద్మ కొడుకుగా రాజ్‌కుమార్, కోడలుగా స్వప్న తదితరులు నటిస్తున్నారు.

ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని సెన్సార్‌కు వెళ్ళబోతున్న సందర్భంగా ఇందులోని పాటలను మీడియాకు ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో దర్శకుడు మాట్లాడుతూ, 'మా సినిమాలోని గొప్ప ఔన్నత్యాన్ని గుర్తించి నిర్మాత రామసత్యనారాయణ రిలీజ్ చేస్తామని చెప్పడం మాకు కొండత ధైర్యాన్ని ఇచ్చింది. కాళోజీ జీవితం ఒక అనంత ప్రయాణం. అందుకే, కాళోజీ ఔన్నత్యాన్ని కాళోజీ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే కొన్ని సన్నివేశాలను మాత్రమే ఉదాహరణగా తీసుకుని...ఆయా సంఘటనలను సృష్టించుకుని, స్క్రీన్ ప్లే రాసుకున్నాను. ఇది రెగ్యులర్ సినిమా కాదు... ఒక జీవితం! ఈ సినిమాను కాళోజీ జీవించిన, ఆయన తిరిగిన ప్రదేశాల్లో చిత్రీకరణ చేశాం' అని తెలిపారు. 'పాటల మాదిరిగానే సినిమా కూడా బిగ్ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదలకు థియేటర్స్ ఇప్పించే బాధ్యతని తీసుకున్నాను' అని నిర్మాత టి.రామసత్యనారాయణ అన్నారు.

యూనిక్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


నవీన్ పోలిశెట్టి, మహేష్‌బాబు

నవీన్ పొలిశెట్టి, అనుష్క శెట్టి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై మహేష్ బాబు.పి దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఈ నెల 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వరల్డ్ వైడ్‌గా ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

ఈ నేపథ్యంలో మూవీ టీమ్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పాత్రికేయు లతో ఈ చిత్ర టికెట్ బుకింగ్స్ అనౌన్స్‌మెంట్ చేయించారు. ఈ సందర్భంగా హీరో నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ, 'ట్రైలర్‌ను ప్రేక్షకులు రిసీవ్ చేసుకున్న తీరు చూస్తుంటే మాకు కాన్ఫిడెన్స్ పెరిగింది. మేము సినిమాలో చెప్ప బోతున్న పాయింట్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందని అనిపించింది. కృష్ణాష్టమి రోజు మా మూవీ రిలీజ్ అవుతుంది, కృష్ణుడు ఎలా అల్లరి చేస్తాడో, ఈ సినిమా కూడా అంతే అల్లరిగా ఉంటుంది' అని అన్నారు.

'రీసెంట్‌గా వేసిన కొన్ని షోస్‌కు రెస్పాన్స్ చాలా బాగుంది. మా ట్రైలర్‌లో చూసింది 30% అనుకుంటే సినిమాలో 70 % ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. మూవీ అంతా ఒక బ్యూటిఫుల్ జర్నీలా అనిపిస్తుంది' అని దర్శకుడు తెలిపారు.

ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ


యశ్వంత్, త్రిప్తి శంకర్

హ్యాపీ లివింగ్ ఎంటర్టైన్మెంట్, సహస్ర మూవీస్ పతాకాలపై నిర్మాతలు శ్రీనుబాబు పుల్లేటి, సత్తిబాబు మోటూరి నిర్మిస్తున్న అందమైన ప్రేమ కథా చిత్రం 'ఓయ్ ఇడియట్'. న్యూ ఏజ్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో యశ్వంత్ యజ్ఞవరుపు, త్రిప్తి శంకర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. వెంకట్ కడలి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'ఇదొక ఫీల్ గుడ్ లవ్ స్టోరీ. ఈ టీనేజ్ లవ్ స్టోరీని దర్శకుడు స్క్రీన్ మీద ఆహ్లాదకరంగా చూపించారు. మంచి సంగీతం కుదిరింది. యశ్వంత్ యజ్ఞవరుపు, త్రిప్తి శంకర్ వారి పాత్రలలో చక్కగా నటించారు. పోస్ట్ ప్రొడక్షన్ పూర్తయ్యింది. అతి త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం. ఈ సినిమా పెద్ద విజయం సాధించి మా అందరికి మంచి పేరు తెచ్చి పెడుతుందని ఆశిస్తున్నాం' అని అన్నారు.

సరికొత్తగా సిరిమల్లె పువ్వా.. పాట


తన్వీ వేగి

హ్రితిక్ శౌర్య హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'ఓటు'. 'చాలా విలువైనది' అనేది ట్యాగ్ లైన్. ఫ్లిక్ నైన్ స్టూడియోస్ నిర్మాణంలో రవి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు ఈ చిత్రంలోని 'సిరిమల్లె పువ్వా..' పాటని లాంచ్ చేశారు. ఈ పాట కోసం 'పదహారేళ్ళ వయసు' సినిమాలోని ఎవర్ గ్రీన్ మెలోడి 'సిరిమల్లె పువ్వా..'ని సంగీత దర్శకుడు అగస్త్య రీమిక్స్ చేశారు. 'ఒరిజినల్ పాటలోని మాధుర్యాన్ని మరింతగా పెంచుతూ సింగర్ సునీత మెస్మరైజింగ్‌గా ఆలపించారు. వేటూరి సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ పాటలో విజువల్స్ ప్లజంట్‌గా ఉన్నాయి. నాయిక తన్వీ నేగి అందంగా కనిపించింది' అని చిత్ర బృందం తెలిపింది.

ఓ యువకుడి పోరాటం..


విరాట్ కర్ణ

డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల ప్రస్తుతం న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్ 'పెదకాపు-1'ని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంతో విరాట్ కర్ణ హీరోగా పరిచయం అవుతున్నారు. ప్రగతి శ్రీవాస్తవ హీరోయిన్. ఈ చిత్రాన్ని ఈనెల 29న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ సోమవారం అనౌన్స్ చేశారు. 'అణచివేత, ఘర్షణల నేపథ్యంలో రూపొందిన చిత్రం. ఒక సామాన్యుడి నుండి ఇద్దరు శక్తివంతమైన వ్యక్తులకు వ్యతిరేకంగా కథానాయకుడు చేసే పోరాటం ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుంది' అని మేకర్స్ చెప్పారు

సబ్ రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు తెలిపిన జైపాల్‌రెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

ఇటీవల బదిలీపై వచ్చి శామీర్ పేట్ సబ్ రిజిస్ట్రార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన గోదాదేవిని సోమవారం తూం కుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షు లు తలగామ జగన్ పాల్గొన్నారు.

8

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మేడ్చల్-ఉప్పల్

మంగళవారం | సెప్టెంబర్ 05. 2023 | www.navatelangana.com

జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాం

- భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని, జమిలి ఎన్నికల నిర్వహణ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని భారత లోక్ దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఇప్పటికే దేశంలోని అనేక పార్టీలు, రాష్ట్రాలు జమిలి ఎన్నికలపై వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. జమిలి విధానంతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి ఆటకం ఏర్పడుతుందని, అధ్యక్ష తరహా ఎన్నికల కోసం బీజేపీ ప్రయత్ని స్తుందని ఆయన ఆరోపించారు. జమిలి ఎన్నికలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.అన్ని రాజకీయ పార్టీలు జమిలి ఎన్నిక లను వ్యతిరేకించాలని ఆయన సూచించారు.

ఆత్మీయ సమేళనంతో ఆనందం : హెచ్ఎం



నవతెలంగాణ-శామీర్‌పేట

ఉరుకుల పరుగుల జీవితంలో ఆత్మీయ సమ్మేళనాలు ఆనందం, సంతోషాన్ని కలిగిస్తాయని తూంకుంట మున్సిపాలిటీ దేవర్‌యంజల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వరూపారాణి అన్నారు. 1993-94విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం అపూర్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సమ్మేళనానికి ఆనాడు విద్యాబోధన చేసిన గురువులతో పాటు 80మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలకు లక్షా యాభై వేలు విలువ చేసే ఫర్నీచర్ అందజేశారు. తోటి సహాధ్యాయిలు రాజేష్, వీరస్వామి, మల్లేష్ మరణించడంతో వారి కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, బాపురెడ్డి, విజయ్ కుమార్, యశోద, వసంత కుమారి, లీలావతి, మల్లారెడ్డి, హనుమంతరావు, నర్సింహ రెడ్డి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు స్వరూపా రాణి, 1994 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకుల విధానాలు.. ప్రజలకు శాపాలు



- ఫిర్జాదిగూడ సమస్యలపై మండిపడిన తుంగతుర్తి రవి
- ఎస్ఎన్‌డీపీ పనులకు మోక్షం ఎప్పుడో?

నవతెలంగాంణ-బోడుప్పల్

ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పాలకులు అనుసరిస్తున్న విధానాలతో నగర ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఫిర్జాదగూడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. సోమవారం కురిసిన తేలకపాటి వర్షానికే నగరంలోని అనేక రోడ్లు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎన్‌డీపీ నేటికీ పూర్తి కాకపోవడంతోనే నేడు ఈ దుస్థితి వచ్చిందన్నారు. వర్షాలు పడినప్పుడుల్లా ఇలాంటి సమస్యలు ఎదురౌతున్నాయని వాపోయారు. సమస్యను పరిష్కారించాల్సిన పాలకులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహిరస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల్ నుంచి నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పూర్తి కాకపోవడంతో రోడ్లన్నీ గుంతలమయం కావడంతో నడవాడానికి వీలుగా లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కారించాలని కోరారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అన్నారు. ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఈ వారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ప్రజల వద్ద నుంచి 135 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి హరిప్రియ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చే ఆర్జీలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్జీదారులకు స్పష్టమైన సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనే వంట..!



నవతెలంగాణ-సిటీబ్యూరో

మధ్యాహ్న భోజన కార్మికులను అనేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇప్పటికే బిల్లులు రాక, గౌరవ వేతనం అందక ఇబ్బందులు పడుతుంటే.. వంట గదుల్లేకపోవడం మరో సమస్య ఎదురైంది. ఇప్పుడు అసలే వర్షాకాలం కావడంతో సమస్య జఠిలమైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని చాలా పాఠశాలల్లో వంట గదుల్లేక చెట్ల కింద వంట చేస్తున్నారు. సోమవారం కురిసిన వర్షానికి మేడ్చల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ స్కూల్‌లో బయట వంట చేస్తుండగా వర్షం రావడంతో ఆ ప్రాంగణమంతా నీటి నిండిపోయింది. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడ్డారు.

పేదలందరికీ 'డబుల్' ఇండ్లు ఇవ్వాలి : బీజేపీ



నవతెలంగాణ-మేడ్చల్

అర్హులైన పేద ప్రజలందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని బీజేపీ మేడ్చల్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రంరెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్‌లోని మంత్రి మల్లారెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. విషయం తెలుసుకున్న పోలీసులు బీజేపీ నాయకులను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్, నాయకులు రాఘవరెడ్డి, మహేష్, పద్మారావు, ఆంజనేయులు, బాలకృష్ణ, ప్రవీణ్, రాజేష్ పటేల్, సుధాకర్ గౌడ్, బాల్ రెడ్డి, తిరుమలేష్, చంద్రశేఖర్ రెడ్డి, సురేష్ రెడ్డి, హరిబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలన్నీ పకడ్బందీగా అమలు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలన్నీ ప్రభుత్వ సూచనల ప్రకారం పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఈ విషయంలో జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో ముందుకెళ్తున్నామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, లక్ష్యాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రుణమాఫీ, కారుణ్య నియామకాలు, ఆసరా ఫించన్లు, ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) 59 రెగ్యులరైజేషన్స్, గృహలక్ష్మి, వర్షాలు తదితర అంశాలపై సమీక్షించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. అన్నదాతకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం రూ.లక్ష లోపు పంట రుణాల మాఫీ చేస్తోందని, రుణమాఫీ వర్తింపజేసిన రైతులకు సైతం తిరిగి కొత్తగా పంట రుణాలను మంజూరు చేయాలని మంత్రి టి.హరీశ్‌రావు సూచించారు. ఈ నెలాఖరులోపు నూటికి నూరు శాతం కొత్త రుణాలు మంజూరయ్యేలా చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి ఆసరా పెన్షన్లు, కారుణ్య నియామకాలు తదితర కార్యక్రమాల ప్రగతిని జిల్లాల వారీగా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల ప్రకారం జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. దీనికిగాను జిల్లా స్థాయి అధికారులతో ముందస్తుగానే ప్రణాళిక రూపొందించుకుని పకడ్బందీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రుణమాఫీని ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టినట్టు తెలిపారు. జిల్లాలో కారుణ్య నియామకాలకు కౌన్సిలింగ్ నిర్వహించి వారికి నియామకపత్రాలను అందజేసినట్టు తెలిపారు. అర్హులైన వారికి ఆసరా పింఛన్లను పారదర్శకంగా ఎంపిక చేసినట్టు తెలిపారు. జీ.వో 59 కింద ఇప్పటికే నోటీసులు అందుకున్నవారి నుంచి రెగ్యులరైజేషన్‌కు నిర్ణయించిన మొత్తాన్ని జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) 59 కింద విలువైన భూములకు (హై వాల్యూ ల్యాండ్) సంబంధించిన 4,900 అప్లికేషన్స్ వచ్చాయని, వాటిని వేగవంతం చేస్తామని, ఈ విషయంలో అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) 59 ప్రక్రియను వారంలో పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో గృహలక్ష్మీ పథకం కింద ఇప్పటి వరకు ఐదు నియోజకవర్గాల నుంచి 17వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అర్హులైన వారికి వర్తించేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు చెప్పారు. జిల్లాలో నియోజకవర్గానికి మూడు వేలు చొప్పున ఈ శనివారం వరకు గృహలక్ష్మీ పథకం ప్రక్రియను పూర్తి చేసి లబ్దిదారులకు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో అందించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఆర్డీవోలు, తహశీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఫోరం ఎన్నికలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్స్, అండ్ హెల్పర్స్ ఫోరమ్ ఎన్నికలు జరిగాయి. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మెన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు బి.రవి ప్రకాష్ దిశానిర్దేశంతో సోమవారం జీడిమెట్లలోని సరోజినీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఫోరమ్ ఎన్నికలు నిర్వహించారు. కేంద్ర సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు పాలుబాయ్ ఈశ్వర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షురాలుగా కె.సుజాత, కార్యదర్శిగా జమున, కోశాధికారిణిగా పి.పద్మలత, ఉపాధ్యక్షురాలుగా నాగరాణి, సంయుక్త కార్యదర్శిగా వి.రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, శిరీష ప్రచార కార్యదర్శిగా అరుంధతి, కార్యనిర్వాహక సభ్యులుగా శకుంతల, బి.సుజాత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు శశికాంత్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి భరత్, డబ్ల్యూడీసీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు బిక్షపమ్మ, కన్వీనర్ నిర్మల, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా ఈసీ సభ్యుడు శ్రీచంద్, కుత్బుల్లాపూర్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు నజీమా, జ్యోతి, మల్కాజిగిరి యూనిట్ కార్యదర్శి అండ్ కోశాధికారి రామ్ చందర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలి



- ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్

నవతెలంగాణ-మేడ్చల్

ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని ఎస్‌యూఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాహుల్ యాదవ్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ ప్రకటించాలని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాహుల్ యాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం విద్యా వ్యవస్థ మీద పూర్తి అశ్రద్ధగా వ్యవహరిస్తూ ఎంతో మంది అభ్యర్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతుందని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం కళ్ళు తెరచి మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరారు. ప్రమోషన్లు, ఖాళీలను భర్తీ చేసి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఖాళీలను వెంటనే ప్రకటించాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను ప్రయివేటుకి ధీటుగా బలోపేతం చేయాలని తెలిపారు. స్టూడెంట్ రేషియో ప్రకారం కాకుండా సబ్జెక్ట్ రేషియో ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. భర్తీ చేయని పక్షంలో నిరుద్యోగులు, విద్యార్థులు కేసీఆర్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేడ్చల్ ఎన్ఎస్‌యూఐ నాయకులు శ్రీధర్, రాకేష్, సాయి మనీష్, సాయి, శశి, విజయ్, వివేక్, కౌశిక్, నవకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి రూ.35 కోట్ల నిధులు కేటాయింపు

- కౌన్సిల్‌లో ఏకగ్రీవ తీర్మానాలు



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ నగర పాలక సంస్థను అభివృద్ధి చేయాడానికి రూ.35 కోట్ల నిధులు మంజూరు చేశామని కార్పొరేషన్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. అభివృద్ధికి సభ్యులందరూ ఐక్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. సోమవారం మేయర్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోడుప్పల్ అభివృద్ధి కోసం 15 అంశాలతో కూడిన ఏజెండాలపై చర్చించి సమావేశంలో ఏకగ్రీవ తీర్మానానికి అమోదం తెలిపారని అన్నారు. ఈ తీర్మానాలల్లో సీసీ, బీటీ రోడ్ల కోరకు రూ.22.65కోట్లు, భూగర్భ డ్రయినేజీ కోసం రూ.4.73 కోట్లు, నగరంలోని పలు పార్కుల పరిరక్షణ కోసం రూ.90 లక్షలు, గ్రీనరీ అభివృద్ధి కోసం రూ.3.18 కోట్లు, హై మాస్ట్ లైటింగ్ ఏర్పాట్లు ఇతర నిర్వహణకు రూ.4.04 కోట్లు కేటాయించామని తెలిపారు. అదే విధంగా బోడుప్పల్ ప్రధాన చెరువులను, బోడుప్పల్ ప్రధాన మాస్టర్ ప్లాన్ రోడ్డులకు అభివద్ధి చేయుటకు రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ చేయుటకు అనువైన ఏజన్సీని నియామకం కోసం తీర్మానాలను అమోదించినట్లు తెలిపారు. అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలల చిన్న చిన్న రిపైర్లకు, ఆత్మ నిర్భర్ వార్డులలో (10,17) శాస్త్రీయ పద్ధతిలో చెత్త సేకరణకు అవసరమైన చర్యలకు, పారిశుధ్య విభాగంలో వాహనాల నిర్వహణకు తీర్మానం అమోదించామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ జి.వేణు గోపాల్ రెడ్డి ,డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ మంజులత, మున్సిపల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'ఎంఎల్‌ఆర్ఐటీ'లో ఓరియంటేషన్ డే





నవతెలంగాణ-సిటీబ్యూరో

దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఓరియంటేషన్ డే కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కాలేజీలో ప్రవేశం పొందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలేజీ సెక్రెటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల 2005లో ప్రారంభమైందని తెలిపారు. మొదటి నుంచీ ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తూ ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికీ క్యాంపస్ ప్లేస్ మెంట్స్ కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 15వేలకు పై చిలుకు విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఎంపికైనట్టు తెలిపారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని తాము నిల బెట్టుకున్నామన్నారు. వివిధ మల్టీ నేషనల్ కంపెనీలతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుని తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య, నియామకాలు సాధిస్తున్నామని తెలిపారు. రూ.5 లక్షల నుంచి రూ.58 లక్షల వార్షిక వేతనాలతో తమ కాలేజీ విద్యార్థులు ప్రాంగణ నియామకాలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, డైరెక్టర్ అనుశ్రేయారెడ్డి, కోశాధికారి మర్రి మామతారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమ్స్ వైద్యులకు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొన్నేండ్లుగా పెండింగ్‌లో ఉన్న సీనియర్ ప్రొఫెసర్ పోస్టులకు ఎట్టకేలకు పదోన్నతులు లభించాయి. పంజాగుట్ట నిమ్స్‌లో 15 మంది ప్రొఫెసర్లకు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది.

పదోన్నతులు ఇలా..

డైరెక్టర్ బీరప్ప (గ్యాస్ట్రో సర్జన్), మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ (హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్), కార్డియాలజీ విభాగం నుంచి సాయి సతీష్, జనరల్ మెడిసిన్ నుంచి వై.సత్య నారాయణ రాజు, రేడియాలజీ నుంచి జోష్నారాణి, రుమటాలజీ విభాగం లిజా రాజశేఖర్, జనరల్ మెడిసిన్ నుంచి నాగేశ్వరరావు, ఆర్థోపెడిక్ నుంచి చంద్రశేఖర్, ప్లాస్టిక్ సర్జరీ నుంచి శ్రీకాంత్, అనస్థీషియా విభాగం నుంచి పద్మజ, బయో కెమిస్ట్రీ నుంచి సాయిబాబా, యూరాలజీ నుంచి రాంరెడ్డి, మైక్రో బయాలజీ నుంచి విజయ ధర్మ తేజ, నెఫ్రాలజీ నుంచి భూషణ్ రాజు, క్లినికల్ ఫార్మా నుంచి ఉషారాణి పదోన్నతి పొందారు.



హెండా ఎలివేట్ వాహనాన్ని క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ చింతమడక సాయిరాం జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్టింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు సేఫ్టీ గురించి వివరించారు.
-నవతెలంగాణ-సిటీబ్యూరో

నేడు ఉత్తమ టీచర్లకు సన్మానం

- మేడ్చల్-మల్కాజిగిరి డీఈవో విజయకుమారి



డీఈవో విజయ కుమారి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను నేడు సన్మానించనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయ కుమారి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 64 మందిని (అన్ని కేటగిరీల్లో) ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి అవార్డు సాధించిన ఉపాధ్యాయులు, అన్ని సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని డీఈవో కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా శశికుమార్ ఎంపిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం యాద్గర్‌పల్లి ఎంపీపీఎస్‌లో పని చేస్తున్న ఎం.శశికుమార్ (ఎస్‌జీటీ) ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. నేడు కలెక్టరేట్‌లో జరుగనున్న కార్యక్రమంలో భాగంగా శశికుమార్‌ను సన్మానించి, అవార్డును అందజేయనున్నారు.

మహిళ అదృశ్యం



నవతెలంగాణ-జవహర్‌నగర్

మొబైల్ పాడైదంటూ దానిని బాగు చేయించుకోడానికి ఇంటి నుంచి వెళ్లిన మహిళ తిరిగి రాలేదు. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలంలోని అక్కారం గ్రామానికి చెందిన మాదరబోయిన రమేశ్ తుర్కపలి గ్రామానికి చెందిన కవితను 16 సంవత్సవరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వారు ఇద్దరు పిల్లలతో కలిసి 8 నెలల క్రితం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బీజేఆర్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈనెల 3న మొబైల్ పాడవడంతో బాలాజీనగర్‌లోని మొబైల్ రిపేర్ షాప్ దగ్గరకు వెళ్లింది. అక్కడ మొబైల్ విషయంలో భార్యాభర్తలకు వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడి నుంచి బయటకు వెళ్లిన కవిత తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త రమేష్ అన్ని చోట్ల వెతికాడు. భార్య కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారాం తెలిపారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు



నవతెలంగాణ-దుండిగల్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సోమవారం శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం'



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యేను వారి నివాసం వద్ద కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ, అనుబంధ సంఘాల డిమాండ్
- సెప్టెంబర్ 11 నుంచి అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ నిరవధిక సమ్మెకు సిద్ధం
- కుత్బుల్లాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారినికి వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-బాలానగర్

అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లేని యెడల సమ్మె నిర్వహిస్తామని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయు అనుబంధ యూనియన్ కన్వీనర్ ఆర్. వసంత, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ఐసీడీఎస్ కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు సీడీపీఓ హెఫ్సిబా సీఐటీయూ అండ్ అంగన్వాడీ టీచర్స్ జేఏసీ ల నిరవధిక సమ్మె నోటీసును సోమవారం విడుదల చేశారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని ఎప్సీబాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేలమంది అంగన్వాడి ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరిలో మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే ఎక్కువమంది ఉన్నారన్నారు. గత 40 సంవ త్సరాలకు పైగా ఐసీడీఎస్ లో పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలులేవని, రాష్ట్ర ప్రభుత్వం నేటికీ కల్పించడం లేదని వాపో యారు. దీనివల్ల అంగన్వాడి ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని, అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఆగస్టు 18న అంగన్వాడి సంఘాలతో మంత్రి సత్యవతి రాథోడ్ జాయింట్ సమావేశం నిర్వహించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ కమిషనర్ ఇతర సిబ్బంది కూడా పాల్గొన్నారన్నారు. అంగన్వాడి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల అంశాలపై నిర్దిష్టమైన హామీలు ఇచ్చి మిగిలిన అంశాలపై పరిశీలించి పరిష్కారం చేస్తామని మంత్రి తెలియజేశారు కానీ ఆగస్టు 25న మంత్రి ఇచ్చిన హామీలకు భిన్నంగా అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు ఒక లక్ష హెల్పర్లు, మినీ టీచర్లకు రూ.50 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ రిటర్మెంట్ బెనిఫిట్స్ అతి తక్కువ నిర్ణయించి వేతనాల పెంపు ఇతర సమస్యల పైన ప్రభుత్వం స్పందించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తిలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు రాబోతున్న సమయంలో అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయకుండా ఆలస్యం చేయడం వల్ల అంగన్వాడి ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ ,ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత సౌకర్యం కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు పది లక్షలు హెల్పర్లకు రూ. 5 లక్షలు చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్ గా నిర్ణయించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.10 లక్షలు చెల్లించాలని, ఐసీడీఎస్ కు బడ్జెట్ పెంచి బలోపేతం చేసి పక్క భవనాలు మౌలిక వసతులు కల్పించాలని, అంగన్వాడి ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలని, అంగన్వాడి ఉద్యోగులకు మట్టి ఖర్చులకు రూ.50 చెల్లించాలని, అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించే కార్యక్రమాలకు ఇచ్చే డబ్బులు రూ.250 నుంచి రూ.2వేలకు పెంచాలనే డిమాండ్ లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ఎన్నికలకు వెళ్లాలని సీఐటీయూ కోరుతోందని తెలిపారు. లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



- కాంట్రాక్ట్ అధ్యాపకులు
- జేఎన్టీయూహెచ్‌లో నిరసన

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1445 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను (బడ్జెటెడ్ , సెల్ఫ్ ఫైనాన్స్) వెంటనే ఎటువంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని సోమవారం జేఎన్టీయూహెచ్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 224 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు జేఎన్టీయూహెచ్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణంలో పెన్ డౌన్, చాక్ డౌన్ నిర్వహించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేఎన్టీయూ హెచ్ జిల్లాకొక ఇంజనీరింగ్ కాలేజీ పెడుతుండటం మరి ఇప్పటికే ఉన్న హైదరాబాద్, జగిత్యాల, మంథని కాలేజీలకు తోడుగా గత సంవత్సరం సిరిసిల్ల, వనపర్తిలో కాలేజీలు, అలాగే ఈ సంవత్సరం ఖమ్మం, మహబూబాబాద్ లో కాలేజీలు, వచ్చే సంవత్సరం ఆదిలాబాద్ లో ఇంజనీరింగ్ కాలేజీలను బోధన సిబ్బంది లేక విద్యార్థులు ఎంతో అవస్థ పడుతున్నారన్నారు. దాదాపు 500 పైగా ఆచార్యుల ఖాళీలు ఉన్న జేఎన్టీయూహెచ్ లో ..224 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు అన్ని యుజీసి, ఎఐసీటీఈ నిబంధనల ప్రకారం అర్హతలు కలిగి ఉండి, దాదాపు 15 నుంచి 20 సంవత్సరాలుగ టీచింగ్ చేస్తూ..రెగ్యులర్ రిక్రూట్మెంట్ కంటే కూడా ఇంకా ఎక్కువ పద్ధతిలో నియమితులు కాబడిన.. తమ 224 మందిని రెగ్యులరైజ్ చేయడం వల్ల అటు జేఎన్టీయూ హెచ్ అనుబంధ కాలేజీల్లో విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అందుతుందన్నారు. కాలేజీలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని, బోధన సిబ్బంది కొరత కూడా తీరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తమకు రెగ్యులరైజ్ చేసే అంశం మీద ప్రకటన చేస్తుందని ఆశిస్తున్నామని లేనిపక్షంలో అన్ని యూనివర్సిటీలతో పాటుగా రాబోయే రోజుల్లో నిరవధిక సమ్మెకు కూడా దిగుతామని తెలిపారు.

కబ్జా ఇండ్లను కూల్చరు.. పట్టాలు ఉన్నవి మాత్రం కూలుస్తారా..?

- ప్రజావాణిలో అధికారులను ప్రశ్నించిన సీపీఐ కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

స్వయంగా మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ ప్రధాన కార్యదర్శి గాజులరామరంలో అక్రమంగా వెలిసిన 2500 ఇండ్లను కూల్చివెయ్యమంటే కూల్చేయని అధికారులు, నేడు జీఓ 59 లో దరఖాస్తు చేసుకున్న వారికి గతంలో ఇచ్చిన పట్టాలు ఉన్నప్పటికీ, వారు గత 15 సంవత్సరాలుగా టాక్స్ చెల్లిస్తున్నపటికీ డబ్బులు కట్టలేదని అధికారులు కూల్చేవేస్తామని బెదిరించడం, కూల్చివేయడం ఏ చట్టప్రకారం ఉందని మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్ అధికారులను నిలదీశారు. వెంటనే కూల్చివేయ్యాడాలని ఆపేసి ప్రజలకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే సర్వే నంబర్‌లో ఉన్న ఇండ్లకు ఒకే విధంగా రుసుం విధించాలి కానీ ఒక్కొక్కరికి వేరు వేరుగా రూ. 10 లక్షల వ్యత్యాసం ఉండటం చూస్తుంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారో తెలుస్తున్నదని అన్నారు. రేకులు ఉన్న గృహాలకు రూ. 19 లక్షలు వేసి,2 అంతస్తుల బిల్డింగ్ ఉన్నవాటికి రూ. 3 లక్షలు వెయ్యడం ఏంటని.. అధికారులు నిద్రపోయి పనిచేశారా అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్, ఇప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నవాటిని కూల్చివేస్తామని కూల్చివేయడం తుగ్లక్ చర్య అని మండిపడ్డారు. ఇదే అధికారులు తమ కండ్లముందు వందల ఎకరాలు కబ్జా అవుతుంటే మాత్రం పట్టించుకోకుండా ఉండటం, సాక్షాత్తు మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి గాజులరామరం సర్వే నెంబర్ 326,329,342,308 లలో వెలిసిన అక్రమ నిర్మాణాలు ఎందుకు కూల్చివేయ్యడం లేదని.. ముందు ఆ అక్రమ కట్టడాలను కూల్చివేయ్యాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఎన్నికల్లో అందరికీ పట్టాలు ఇప్పిస్తామని,రెండు పడకల గదులు ఇప్పిస్తామని చెప్పి ఇప్పుడు వారు కష్టాల్లో ఉంటే మాత్రం పట్టించుకోవట్లేదని ప్రజాప్రతినిధులు తమ పదవులు కాపాడుకోవడం కోసం,డబ్బులు సంపాదించుకోవడంలో మునిగిపోయారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్, మండల కార్యవర్గ సభ్యులు వి.శ్రీనివాస్, ప్రభాకర్, ఇమామ్, గట్టయ్య, జగన్, చంద్రమోహన్, ప్రకాష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం

- ఎమ్మెల్యే కె.పి వివేకానంద్
- 105వ రోజుకు చేరిన ఎమ్మెల్యే ప్రగతి యాత్ర



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

132 జీడిమెట్ల డివిజన్, కొంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని రంగారెడ్డి బండ, జొన్న బండలో సోమవారం ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ కొంపల్లి మున్సిపల్ చైర్మెన్ సన్నా శ్రీశైలం యాదవ్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన రోడ్లు, డ్రయినేజీ వంటి అభివృద్ధి పనులు పరిశీలించారు. అదే విధంగా సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాగా అక్కడక్కడా నెలకొన్న భూగర్భ డ్రయినేజీ, అంతర్గత రోడ్లు, కరెంటు పోల్స్, తీగలు మార్చాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. అక్కడే ఉన్న అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కాలనీ అభివృద్దే తమ ధ్యేయం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ తమ బస్తి అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను రానున్న ఎన్నికలలో ముచ్చటగా మూడవ సారి భారి మెజారిటీతో ఎమ్మెల్యేగా గెల్పించుకుంటాం అని.. బీఆర్ఎస్ పార్టీకే తమ పూర్తి మద్దతు.. సీఎం కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా గెల్పించుకుంటాం అని ప్రకటిస్తూ బస్తీ వాసులు ఏకగ్రీవ తీర్మానం చేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకుటు కుంట సిద్దిరాములు, సంపత్ మాధవ్ రెడ్డి, గుమ్మడి మధుసూదన్ రాజు, మఖ్సూద్ అలీ, కాలే నగేష్, అనిల్, గణేష్, మహిళా నాయకులూ ఇందిరా రెడ్డి, బస్తీ వాసులు రామిరెడ్డి, లక్ష్మయ్య, ముంతాజ్ బీ, రుక్కమ్మ, యూసఫ్, సురేష్, భారతమ్మ, శ్రీను, వెంకటయ్య, బాలయ్య, బాలమణి బస్తీవాసులు తదితరుల పాల్గొన్నారు.

భూగర్భ డ్రయినేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



129 డివిజన్ సూరా రం పరిధిలోని నెహ్రూ నగర్‌లో రూ.48 లక్షల వ్యయంతో నూతనంగా చేపడుతున్న భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మంత్రి కేటీఆర్ సహకారంతో గడిచిన ఏండ్లలో నియోజకవర్గంలో అనేక అభివద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మెన్ సన్నాశ్రీశైలం యాదవ్, మాజీ కౌన్సిలర్ బొద్దు వెంకటేశ్వర్ రావు,మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్రా అశోక్, జనరల్ సెక్రటరీ సిద్దిక్, సీనియర్ నాయకులు మఖ్సూద్ అలీ, ఫిరోజ్, ప్రభుదాస్, బీఆర్ఎస్ బస్తీ ప్రెసిడెంట్ గండయ్య, అఖిల్, నగేష్, దశరథ్, కిరణ్, దాసు, సాజిద్, ప్రశాంత్, సురేష్, శివాజీ, మహిళా నాయకురాలు అరుణ, భాగ్య లక్ష్మి, ధన లక్ష్మి, విద్య రాణి, సరస్వతి, ద్రౌపది, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



బీసీ ఐక్యవేదిక పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గం బీసీల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 11న ఆంజనేయ నగర్ రోడ్ నెంబర్ 5లోని సీతారామకల్యాణ మండపంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విద్యానగర్‌లోని బీసీ కార్యాలయంలో, రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ ఐక్యవేదిక కూకట్‌పల్లి నియోజకవర్గ కన్వీనర్ బాశెట్టి నరసింహారావు, కో కన్వీనర్ యంజాల పద్మయ్య, గున్నాల వినోద్ కుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం, తెలంగాణ బీసీ వికాస్ సమితి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తేళ్ల హరికష్ణ, కూకట్ పల్లి డివిజన్ అధ్యక్షులు సి పండిత్ రావు చారి, బీసీ వికాస్ సమితి రాష్ట్ర నాయకులు ఆకుల బాలకష్ణ, తెలంగాణ యూత్ ఫోర్స్ అధ్యక్షులు బింగి రాములు, మున్నూరు కాపు సంఘం కూకట్ పల్లి యూత్ జాయింట్ సెక్రెటరీ పుట్టిగారి శివ కుమార్ తదితరులు కలిసి ఆవిష్కరించారు.

నల్ల పోచమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక



- ఎమ్మెల్యే గాంధీ,కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్‌లను కలిసిన నూతన కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని ఫేస్ 2లోని శ్రీ నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సమావేశమై నూతన కమిటీని పున: నియమించుకున్నారు. అధ్యక్షులుగా పోలోజు భగవంత చారి, ఉపాధ్యక్షులుగా రమణాచారి, ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డితో కలిపి 15 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు భగవంత చారి మాట్లాడుతూ కమిటీ సభ్యులం కలిసి కట్టుగా పని చేసి ఆలయ అభివృద్ధికి పాటుపడతామన్నారు. కమిటీలో కార్యదర్శిగా ఈశ్వరుజు శైలిష్, కోశాధికారిగా బి.రవి, కమిటీ సభ్యులుగా మ్యాదరం ప్రముఖా చారి, రాములు, గోవిందుల కిరణ్, కందుకూరి శ్రీవన్, శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా. సత్యవతి, అనురాధ, సలహాదారులుగా సాంబయ్య సత్యనారాయణ, కనకాచారి రఘువంశి లను ఎన్నుకున్నారు.

అల్లాపూర్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచాం



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- అల్లాపూర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అల్లాపూర్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచామని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని తులసి నగర్ , శ్రీ వివేకానంద నగర్, లక్ష్మీ నగర్ లలో కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్ తో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ప్రజలు పూలతో, శాలువాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లాపూర్ డివిజన్‌ను గతంలో పరిపాలించిన పార్టీలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడ వదిలేసారన్నారు. తొమ్మి దిన్నరేండ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో చేసినటువంటి అభివృద్ధి మీ కండ్ల ముందు ఉందని అన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఈసారి ఎమ్మెల్యే ను ని హ్యాట్రిక్ విజయంతో భారీ మెజారిటీ ఇచ్చి మనం గెలిపించుకుందాం అని అన్నారు. మన డివిజన్ ను మరింత అభివృద్ధి పరుచుకుందాం అని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బయటకు వచ్చి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి : కూకట్‌పల్లిలో పశు వైద్యశాల అస్తవ్యస్తంగా ఉండేదని దాన్ని గుర్తించి వెంటనే పునరుద్దరణ చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. సోమవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే కూకట్‌పల్లిలో రూ. 70 లక్షలతో నిర్మించిన నూతన పశువైద్యశాలను ప్రారంభించారు. అలాగే మొదటి అంతస్తులో వ్యాయామశాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధికి ఎక్కడా నిధులు కొరత లేకుండా పనులు పూర్తి చేస్తూ వస్తున్నామని, ఇప్పటికీ నియోజకవర్గంలో 6000 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. గతంలో ఎన్నడూ లేని అభివది, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఇక్కడ పశు వైద్యశాల ఎంతో అస్తవ్యస్తంగా ఉండేదని దాన్ని గుర్తించి వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సంతోష్, సెక్రటరీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఈ.పీ.ఎస్. 95 చట్టానికి సవరణలు చేయాలి



నవతెలంగాణ-దుండిగల్

దేశ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఈ. పీ. ఎస్. 95 పెన్షన్ దారులకు కనీసం పెన్షన్ ప్రస్తుతం ఉన్న వెయ్యి రూపాయలను రు. 9000కు పెంచాలనీ, దానిపై కరువు భత్యం చెల్లించాలని, పెన్షన్ దారులకు ఆరోగ్య రక్షణ కల్పించాలని 'టాప్రా' మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి టి. బాలగంగాధరరావు డిమాండ్ చేశారు. కూకట్ పల్లి 'టాప్రా' వారి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతినగర్ విభాగం ఈపీఎస్ అధ్యక్షులు జి .వెంకటరాజం అధ్యక్షతన ప్రగతి నగర్ లోని ఎన్.టీ.ఆర్. పార్క్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా టి. బాలగంగాధరరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కనీస పెన్షన్ పెంచడానికి, దానిపై కరువు భత్యం చెల్లించడానికి ఏవైనా చట్టపరమైన అవరోధాలు ఉంటే ఈ పీ. ఎస్. 95 చట్టానికి అవసరమైన సవరణలు చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. 'టాప్రా' కూకట్ పల్లి ఏరియా అధ్యక్షుడు ఎల్. దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో తమకు కనీస పెన్షన్ ను రు. 9000 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన పార్టీ కే ఓటు వేయాలని గత జూన్ 27 వ తేదీన మహారాష్ట్ర లోని అకోలా సమీపంలో జరిగిన అల్ ఇండియా కో ఆర్డినేషన్ సమావేశంలో తీర్మానం చేసినట్టు తెలిపారు. 'టాప్రా' మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ అకోలా లో జరిగిన సమావేశపు తీర్మానానికి అనుగుణంగా "జాగో ఈ.పీ.ఎస్. పెన్షనర్ జాగో" - "నో హైయ్యర్ పెన్షన్- నో ఓట్" (ఈ.పీ.ఎస్. పెన్షన్ దారుడా మేలుకో -అధిక పెన్షన్ చెల్లించక పోతే ఓటు వేసేది లేదు) అనే స్టిక్కర్ ను ఆవిష్కరించారు. కార్యదర్శి శంకర్ రావు, కోశాధికారి ఎన్. కృష్ణయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే. రామ లక్ష్మణ రెడ్డి, ప్రచార కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పెన్షనర్స్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే దేశం, రాష్ట్రం సుభిక్షం



- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పున్నారెడ్డి
- బీజేపీ, బీఆర్ఎస్‌ల నుంచి కాంగ్రెస్‌లో చేరికలు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని బీజేపీ ,బీఆర్ఎస్ పాలనపై ప్రజలకు పూర్తిగా విశ్వాసం పోయిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చింతల్, కుత్బుల్లాపూర్ వివిధ ప్రాంతాలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు సుమారు 200 మంది కుటుంబాలు చింతల్ డివిజన్(ఎ) బ్లాక్ ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, ,డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కమల ఆధ్వర్యంలో టీపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుందని.. సుస్థిర పాలన కాంగ్రెస్ కే సాధ్యమని అన్నారు. అవినీతి అరాచకాలు చేస్తున్న కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రంలో రాహుల్ గాంధీ ,రాష్ట్రంలో రేవంత్ రెడ్డిలు చేస్తున్న పోరాటానికి ఆకర్షితులై కాంగ్రెస్ విధి విధానాలు నచ్చి పార్టీ లో చేరుతున్నారన్నారు. 2024లో దేశంలో రాష్ట్రంలో అనేక మార్పులు వస్తాయని బీజేపీ, బీఆర్ఎస్ లు నామరూపాలు లేకుండా పోవడం ఖాయమన్నారు. ఆయా పార్టీలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవం తులను చేయాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని అందుకు కార్యకర్తలు సమిష్టి కషి చేయాలన్నారు. అదే విధంగా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రవేశపట్టబోయే సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో భారీగా చేరికలు జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా మహిళా అధ్య క్షురాలు రాచనోళ్ల లక్ష్మి, కాంగ్రెస్ చింతల్ డివిజన్ ఇన్‌చార్జ్ ఫలావూర్ రెహమాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లాల్ మహమ్మద్, దండే రాజు, సూరారం డివిజన్ యువ నాయకులు మండవ శివకుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలు, బేకరీ గడ్డ కాంగ్రెస్ అధ్యక్షులు గఫర్, హనుమంతు, రమేష్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు .



సూరారం 129 డివిజన్‌కు చెందిన యువ నాయకుడు పోరెడ్డి కార్తీక్ రెడ్డి తన పుట్టినరోజు సందర్బంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పో రెడ్డి కార్తీక్ రెడ్డి కి నర్సారెడ్డి భూపతిరెడ్డి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | సెప్టెంబర్ 05, 2023 | www.navatelangana.com

లాస్య నందితకు మద్దతు ప్రకటించిన మాజీ సీనియర్ ఉపాధ్యక్షుడు గౌరీ శంకర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితను మాజీ సీనియర్ ఉపాధ్యక్షుడు పి.గౌరీశంకర్ మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్లు సోమవారం కలిసి వారి మద్దతును తెలిపారు. వారు కార్ఖానాలోని లాస్య నందిత క్యాంపు కార్యాలయానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు అనంతరం వారి, సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న బాటలో లాస్యనందిత కూడా ప్రజలందరికీ అండగా నిలుస్తారని గౌరీశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు నివేదిత, పనస సంతోష్, భాస్కర్ ముదిరాజ్, సదానంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ టీచర్ ప్రో.మృణాళినికి సత్కారం



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం చేత ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ప్రొఫెసర్ టి.మృణాళిగా ఎంపికయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో కళశాల బిఎడ్ కళాశాల అధ్యాపకుల బృందం ఘనంగా వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృణాళిని చేసిన సేవల్ని ఆదర్శంగా తీసు కొని విద్యా కళాశాల ప్రతిష్టను మరింత పెంచేందుకు అందరూ కృషి చేస్తామని అధ్యాపకులు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథ్ కే.మూర్తి, డాక్టర్ డి.సునీత, డాక్టర్ జే.లలిత, డాక్టర్ బి.సుజాత, డాక్టర్ జి.దుర్గేష డాక్టర్ పి శంకర్, డా. మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సెల్ ఫోన్ దొంగలు అరెస్ట్

● రూ. ఏడు లక్షల విలువచేసే 19 ఖరీదైన సెల్‌ఫోన్లు స్వాధీనం



నవతెలంగాణ-కంటోన్మెంట్

రద్దీగా ఉన్న ఉన్న ప్రదేశాలను ఎంచుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యులు గల ముఠాలో ఇద్దరు యువకులు బోయినపల్లి పోలీసులు అరెస్ట్ చేసి వారివద్ద నుంచి ఏడు లక్షల విలువ చేసే 19సెల్ ఫోన్లు, ఒక ఆటో రిక్షాను స్వాధీనం చేసుకున్న ఘటన డివిజన్ పరిధిలో చేటు చేసుకుంది. ఈ మేరకు నార్త్‌జోన్ అదనపు డీసీబీ బి.మధుసూధన్‌రావు, బేగంపేట డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ వి.వి.ఎస్.రామలింగరాజు, బోయినపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీ నారాయణరెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వి.సదర్ నాయక్ క్రైం సిబ్బందితో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పాతబస్తీకి చెందిన ఏడుగురు యువకులు ఆటో లో ప్రయాణికుల మాదిరిగానే నమ్మిస్తారని, ఆటో ఎక్కించుకున్న ప్రయాణికుడిని లక్ష్యంగా చేసుకుని దృష్టి మరల్చి సెల్‌ఫోన్‌లను దొంగిలిస్తారన్నారు. వీరు రిజిస్ట్రేషన్ లేని ఆటోను దొంగ తనాలకు వినియోగిస్తూ ముఠా సభ్యులే ప్రయాణికులుగా నమ్మిస్తూ అమా యక ప్రయాణికుల వద్ద విలువైన వస్తువులను అపహరిస్తారన్నారు. ఆదివారం బోయినపల్లి నుండి కొంపల్లి వరకు ఆటోలో ఎక్కిం చుకొని దొంగతనం చేస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులను బోయినపల్లి పోలీ సులు అరెస్టు చేయగా మరోముగ్గురు రిమాండ్‌లో ఉ న్నట్లు బేగంపేట ఏసీపిరామలింగరాజు పేర్కొన్నారు. సోమవారం బాధిత ప్రయాణికుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి ఇద్దరు నిందితులను పట్టుకుని విచారించగా వివరాలన్నీ బయటకి వచ్చాయని ముఠాలో ఉన్న నిందితులపై పలు పోలీస్ స్టేషన్లో కేసులు ఉన్నాయన్నారు

విదేశాలలో విద్యను అభ్యసించే స్థాయికి విద్యార్థులను తీర్చిదిద్దుతాం

● మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విదేశాలలో విద్యను అభ్యసించే స్థాయికి తీర్చిదిద్దే విధంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమా టోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ లు తెలిపారు. సోమవారం సనత్‌నగర్‌లోని అశోక కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలలో మనబస్తీ-మన బడి కార్యక్రమం క్రింద రూ.2.22 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను, బన్సీలాల్ పేట లోని ప్రభుత్వ పాఠశాలలో 1.84 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న 16 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను, ఎంఎల్‌సీ నిధులు 25 లక్షల రూపాయలు, ఏసీడీపీ నిధులు రూ.7.70 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన 3అదనపు తరగతి గదులను ప్రారంభించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, టీఎస్‌ఈడ బ్ల్యుఐడీసీ ఛైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, విద్యాశాఖ కమిషనర్ దేవసేన లతో కలిసి ప్రారంభించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యార్థుల తల్లి దండ్రులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. పేద విద్యార్థులు అధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో మనబస్తీ-మన బడి కార్యక్రమంతో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నట్లు, అదేవిధంగా గురుకుల పాఠశాలలను కూడా ఏర్పాటు చేసి ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసిందని వివరించారు. మంచి వాతావరణంలో విద్యను అందిస్తే భవిష్యత్‌లో ఈ విద్యార్థులు ఎన్నోఅద్భుతాలు సృష్టిస్తారనే అపారమైన సమ్మకం ఉన్నదని చెప్పారు. తమ పిల్లలు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత వారి చదువు పై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి కోరారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశాలకు తప్పనిసరిగా హాజరై సమస్యలు ఉంటే తెలియజేయాలని అన్నారు.

హైస్కూల్ గా మేకలమండి స్కూల్

: పేద ప్రజలు అధికంగా నివసించే బన్సీలాల్ పేట డివిజన్ లోని మేకల మండిలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం నుండి ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేయనున్నట్లు విద్యా శాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. సోమవారం మేకల మండి పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానికమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఈ పాఠశాల ను 2011 సంవత్సరంలో ప్రాథమిక పాఠశాల గా ప్రారంభించడం జరిగిందని, 2020 సంవత్సరంలో ప్రాథమికో న్నత పాఠశాల గా అప్ గ్రేడ్ చేయించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యాధికారి రోహిణి, పాఠశాల ప్రదానోపాధ్యాయుడు మల్లి ఖార్జున్, కార్పొరేటర్ హేమలత, పద్మారావు నగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ లు అత్తిలి అరుణ గౌడ్, కిరణ్మయి, పాఠశాల కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నర్సింగ్ రావు, రాజు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన 'రెడ్డి సంఘం'



నవతెలంగాణ-ఓయూ

మల్లాపూర్ రెడ్డిసంఘం సభ్యులు సోమవారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతెశోభన్‌రెడ్డిను తార్నాకలోని తమ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లాపూర్ చౌరస్తా వద్ద శ్రీ రాజాబహదూర్ వెంకటరమణరెడ్డి విగ్రహాన్ని ప్రతిష్టించబోతున్న సందర్భంగా డిప్యూటీ మేయర్‌ని ధన్యావాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ శ్రీరా జాబహదూర్‌వెంకటరామిరెడ్డి నిజాం ప్రభుత్వ హ యాంలో కొత్వాల్‌గా సేవలు అందించిన మహనీయుని విగ్రహం ప్రతిష్టాపన చేయడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ రెడ్డి సంఘం సభ్యులు అధ్యక్షుడు కే ధర్మరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సిరెడ్డి, పద్మా రెడ్డి, నరేందర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి



నవతెలంగాణ-ఓయూ

జమిలీ ఎన్నికల అంటే ప్రతిపక్షాలు ఉలిక్కి పడుతున్నాయని ఓబీసీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పలు బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టడానికి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. జమిలీ ఎన్నికల మీద విమర్శలు చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తమిళనాడు సీఎం కొడుకు తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని వ్యాఖ్యలు చేస్తే నోరు విప్పకపోవడం శోచనీయమన్నారు. సోమవారం సికింద్రాబాద్ నియోజకవర్గంలో మేకల కీర్తి హర్ష కిరణ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ సెంటర్ ప్రారంభోత్సవం, అర్హులైన శిక్షణ పొందిన వారికి కుట్టుమిషన్‌లను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె. లక్ష్మణ్ హాజరయ్యారు, ప్రధాని మోడీ ప్రభుత్వంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని మహిళలకు చట్ట సభల్లో సముచితస్థానం కల్పించారన్నారు. తెలంగాణలో అధికారం రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రచమల్ల కృష్ణమూర్తి, ఆదమ్ విజయ్ కుమార్, కనకట్ల హరి,కందటి నాగేశ్వర్ రెడ్డి, కన్నాభిరామ్, శ్యాంసుందర్, బిక్షపతి యాదవ్, ఆకుల శ్రీనివాస్, ఆకారం రమేష్ ముదిరాజ్,డివిజన్ అధ్యక్షులు హనుమంతు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సహకారమైన వేళా!

● గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌కు చెందిన లబ్దిదారులు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరై సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మికవిభాగఅధ్యక్షుడు మోతెశోభన్‌రెడ్డిలను తార్నాకలోని తమ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ సర్కార్ డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పారదర్శకంగా పంపిణీ చేయడం జరిగిందని, మొదటి విడత పంపిణీలో లాటరీ ద్వారా ఎంపిక కానీ వారికి పలు దపాలలో పంపిణీ చేసే కార్యక్రమంలో అర్హులైన అందరికీ తప్పకుండా పొందుతారన్నారు. పేదల ఇంటి కష్టాలను నుంచి విముక్తి కలిగించి సొంతింటి కలను నెరవేర్చినందుకు వారు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం హెచ్‌సీడీసీ నూతన డైరెక్టర్‌గా ప్రొ.రంజని సోమవారం ఓయూసీఎఫ్ ఆర్డీలోని తన కార్యాల యంలో డైరెక్టర్‌గా ప్రొ.స్టీవెన్‌సన్ నుండి బాధ్యతలు స్వీకరించారు. పలువురు అధ్యాపకులు ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలి యజేశారు. సెంటర్ అభివృద్ధి కోసం ఇప్పటి వరకు కృషి చేసిన ప్రొ.స్టీవెన్‌సన్ స్ఫూర్తితో ముందుకు వెళ్లనునట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పి.మురళీధర్ రెడ్డి, డా.కిరణ్, అనురాధ, రోహిత్‌లు పాల్గొన్నారు.

లబ్దిదారులను కలిసిన లాస్య నాందిత

నవతెలంగాణ-కంటోన్మెంట్

రసూల్‌పుర మారేడపల్లి డబు ల్ బెడ్ రూం ఇండ్ల పట్టాలు పొందినలబ్దిదారులు సోమ వారం కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితను మర్యాదపూర్వకంగా కలిశారు. లబ్దిదారులు మాట్లా డుతూ తమకు డబుల్ బెడ్ రూంలు ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న చొరవతోనే తమ సొంతింటి కల సాకారమైందని లబ్దిదారులు వెల్ల డించారు. లాస్యనందితను కలిసిన వారిలో లబ్దిదారులైన రమాదేవి, గంజి శాంతి, జక్కూరు సీతమ్మ, గౌతమి, జానకి, సమ్మక్క, స్వాతి, ఏసుమణి ఉన్నారు.

హై బిజ్ ఫుడ్ అవార్డ్స్-2023 అందజేత



నవతెలంగాణ-బంజారాహిల్స్

హై బిజ్‌ఫుడ్ అవార్డ్స్-2023లో అవార్డులను సోమవారం అందజేశారు. దీనిలో భాగంగా బెస్ట్ షవర్మా ఆఫ్ ది ఇయర్ అవార్డు గెల్చుకున్న అల్‌తాజా ప్రతినిధులు అంజర్, హైమండ్, సురభి పురాణిక్‌లు హెబ్బా పటేల్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఫుడ్ మేకింగ్ వ్యాపార ధోరణిలో చూడనేలేదని, ఇదో బాధ్యతాయుతమైన ఛాలెంజింగ్ తీసుకొని సేవ దృక్పథంతో ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు.

రోడ్డుపై మట్టిని తొలగించిన ట్రాఫిక్ పోలీస్ అధికారులు

నవతెలంగాణ-బంజారాహిల్స్



కె.బి.ఆర్ పార్క్ ప్రధాన రహదారి జూబ్లీ చెక్ పోస్టులో జూబ్లీహిల్స్‌లో అకాల వర్షానికి రోడుపై భారీ గా మట్టి కొ ట్టుకు వచ్చి రహదారులపై నిలిచిపోవడం వల్ల వాహన చోదకులు ఇబ్బందులకు గురయినట్లు తెలి పారు. అదే సమయంలో ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్న సమయంలో రోడ్డుపై ఉన్న మట్టి శుభ్రం చేసి రహదారిని క్లీన్‌గా చేసి ప్రమాదాలకు గురి కాకుండా చేసినట్లు తెలిపారు. ప్రజలకు పోలీసులపై నమ్మకాన్ని కల్పిస్తూ వారి ప్రాణాలకు భరోసాగా ఉంటామని వారి పనులను పూర్తి చేశారు.

పార్కు గోడ కూలి ఇల్లు ధ్వంసం

జీహెచ్‌ఎంసీ అధికారుల అలసత్వం

అటుగా చూడని వైనం.. సహాయ చర్యలు చేపట్టిన పోలీసులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

అకాల వర్షానికి పార్కు గోడకూలి ఓ ఇల్లు ధ్వంసమైన సంఘటన బంజరాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థాని కులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లోని గౌరీశంకం నగర్‌లో ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి బస్తీకిలో ఉన్న పార్కు ప్రహరీగోడ నాని ఇల్లుపై పడింది. దీంతో ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. ఈ సంఘటనలో ప్రాణా నష్టం ఏమీ జరగలేదు. కొంత మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సంఘటనను పరిశీలించారు. గోడ కూలిన సంఘటనలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఎవరూ అటువైపుగా రాకపోవడం, సహాయక చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తపరించారు. సహాయక చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ, బీఆర్ఎస్ అధికారులకు కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి ఫోన్ ద్వారా సమాచారం తెలియజేసినట్లు తెలిపారు.

మేరామిట్టి-మేరా దేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్



నవ-తెలంగాణ కంటోన్మెంట్

భారతదేశానికి ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు ఢిల్లీలో స్మారకం కట్టడానికి సోమవారం మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతమంది దీపికా నరేష్ సాంబ మూర్తి నగర్‌లో మేరామిట్టి-మేరా దేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఇంటింటి నుండి కరిగించిన మట్టిని మట్టిని అసెంబ్లీ, జిల్లా, రాష్ట్ర వారీగా ఢిల్లీకి పంపి ప్రజల్లో దేశభక్తిని చాటేవరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరి గిందని తెలిపారు. రేపటినుండి బూతు వారీగా బూత్ అధ్యక్షులు వారివారి బూతులో డోర్‌డోర్ మట్టి సేకరిస్తారన్నారు. ఈ కార్యక్ర మంలో అందరూ భాగస్వాములు కావాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీమంచి ఆలోచన ప్రవేశపెట్టారని వివరించారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు..



● ఎమ్మెల్యే దానం నాగేందర్

నవతెలంగాణ-బంజారాహిల్స్

పేద విద్యార్థులకు సోమవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సోమాజిగూడ డివిజన్ బి.యస్.మక్త హారిగెట్ లైబ్రరీ వద్ద స్కూల్ బుక్స్, బ్యాగ్స్ స్థానిక కార్పొరేటర్ జి.హెచ్.యం.సి స్టాండింగ్ కమిటీ మెంబర్ వనం సంగీత శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని, మనబస్తి-మనబడి కార్యక్రమంల ప్రతి ఒక్క పేవిద్యార్థికి విద్య అందేలా చూడాలని, ప్రభుత్వం అందిస్తున్న సువర్ణ అవకాశం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఇంగ్రీజ క్లబ్ సికింద్రాబాద్ వారు పాఠశాల ఉపాధ్యాయుల బృందం, స్థానిక బి.ఆర్.యస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రౌడీ షీటర్స్ వారి పద్ధతి మార్చుకోవాలి

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో రౌడీషీటర్ల తమ పద్ధతులు మార్చుకొని, మంచిగా మారాలని సోమవారం బోరబండ పోలీసులు తెలిపారు. సోమవారం బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని 15 మంది రౌడీషీటర్లను సత్ప్రవర్తన నిమిత్తం ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుచగా, వారికి ఒక్కొక్కరికి 50 వేల జరిగిమానా, వ్యక్తిగత పూచికత్తు నిబంధన విధించి ఒక సంవత్సరం కాలానికి వీరిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. వీరందరినీ వారెంట్ కానిస్టేబుల్స్ బాలకృష్ణ, కరుణాకర్‌లు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట సకాలంలో హాజరు పరచారు. రానున్న గణేష్ నవరాత్రి, మిలాద్ ఉన్ నబి పండుగలను ఉద్దేశించి, రౌడీషీటర్లందరినీ సత్ప్రవర్తన నిమిత్తం బైండోవర్ చేస్తున్నామని, అదేవిధంగా బోరబండ పరిధిలో వివిధ నేరాలలో ఉన్న ట్రబుల్ మాంగర్స్ వ్యక్తులను కూడా ఇదే మాదిరిగా బైండోవర్ చేస్తామని బోరబండ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ తెలియజేశారు.

లిఫ్ట్ గుంతలో పడి యువకుడు మృతి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

శ్రీరామ్‌నగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న భవనం లిఫ్టు గుంటలో ప్రమాదవశాత్తు పడి యువకుడు మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా బోరబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాలు ప్రకారం సోమవారం ఉదయం 11 గంటలకు గుర్తు తెలియని యువకుడు శ్రీరామ్‌నగర్‌లోని కొత్తగా నిర్మిస్తు న్న సత్యనారాయణ ఇంటి లిఫ్టు గుంట నీటిలో పడి మృతి చెందినట్లు, స్థానికులు పోలీసులకు సమాచారం తెలిపారు. అనంతరం ఎస్సై సర్దార్ జమాల్, సిబ్బంది యువకుని శవం బయటకు తీయగానే , స్థానిక అబీబ్ ఫాతిమా నగర్‌లో నివాసముండే నసీమ సుల్తానా కుమారుడు షౌకత్ అలీగా పోలీసులు గుర్తిం చారు. మృతుడు 2వ తేదీన ఉదయం 3గంటల సమయంలో మసీదుకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని అతని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని పంచా నామా నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టర్ ఆధారంగా ప్రమాదవశాత్తు చనిపోయాడా, లేక ఎవరైనా హత్య చేసి చంపేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని బోర బండ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ తెలిపారు.


ప్రొ.టి.నవనిత రావు సంతాప సభ


● పాల్గొన్న మాజీ వీసీ,పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొ.టి. ననవితరావు సంతాప సభను ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీ, పూర్వ విద్యార్థులు పాల్గొని మాట్లాడుతూ నవినతరావుతో తమకు ఉన్న అనుబంధలు అయిన చేసిన కృషి సంస్కరణలతో పాటుగా ఓయూ భూముల సంరక్షణ విషయంలో అయిన కృషి ని ప్రశంసించారు. ఓయూలో నియామకాలు ఇక ఓయూ ప్రతిష్టాత్మక ను పెంపొందించినట్లు పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజ్యసభసభ సభ్యుడు డా.లక్ష్మణ్, ఓయూ వీసీ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారా యణ, తెలుగు యూనివర్సిటీ వీసీ కిషన్‌రావు, మాజీ వీసీలు సులేమన్ సిద్ధిఖీ, సత్యనారాయణ, ప్రొ.రామ చంద్రము, గోపీ కృష్ణ రావు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆయన సేవాలను కొనియాడారు.

ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన ఓయూ అధ్యాపకులు







నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం ఓయూ నుండి నలుగురు అధ్యాపకులను ఉత్తమ టీచర్స్‌గా ఎంపిక చేసిం ది.ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండిప్రొ.గణ ేష్,ప్రొ.హాయవదన,ప్రొ.మృణాళిని, ప్రొ.శ్రీనివాసులు ఉన్నారు.

ప్రొ.చింత గణేష్ (సోషియాలజీ): ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రస్తుతనికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవాలు అందిస్తున్న ప్రొ.చింత గణేష్ గతంలో సివిల్ సర్వీసెస్ సెంటర్ డెరైక్టర్‌గా, ఈక్వల్ అపర్చునిటీ సెల్ డెరైక్టర్‌గా, టీఎస్ సెట్‌కో ఆర్డినేటర్‌గా, ఆడిషినల్ కంట్రోలర్‌గా, దూరవిద్య కేంద్రం డెరైక్టర్‌గా, సోషియాలజీ విభాగంహెడ్‌గా, బిఓఎస్‌గా విశేష సేవాలు అందజేశారు.

ప్రొ.జె.హాయదన (టెక్స్ టైల్ టెక్నాలజీ): ప్రొ.హాయవదన టెక్నాలజీ కళశాల టెక్స్ టైల్ టెక్నాలజీ విభాగంలో సేవాలు అందజేస్తు న్నారు. ప్రస్తుతం కళశాల వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఇటీవలే సీనియర్ ప్రొఫెసర్ ఐయ్యారు. హెడ్‌గా, బిఓఎస్‌గా, డీన్‌గా సేవాలు అందజేశారు. విభాగం అభివృద్ధిలో విశేష కృషి చేశారు. సోమవారం విభాగం అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

ప్రొ.టి.మృణాళిని(ఎడ్యుకేషన్): ఓయూ ఎడ్యుకేషన్ కళశాల ఎడ్యుకేషన్ హెడ్‌గా పనిచేస్తున్న ప్రొ.తాళ్ల. మృణాళిని గతంలో విభాగం హెడ్, బిఓఎస్‌గా, ఈ యం ఆర్ సి డెరైక్టర్ గా, కళాశాల ప్రిన్సిపాల్ గా, డీన్ , మరియు పలు వర్సిటీలకు డీన్ గా సేవాలు అందజేశారు.

ప్రొ.సి.శ్రీనివాసులు (జువాలజీ), : ఓయూ సైన్సు కళశాల జూవాలజీ ప్రొఫెసర్ సి.శ్రీనివాసులు ఉత్తమ అధ్యాపకుడిగా నియా మకమయ్యారు. ప్రస్తుతం ఓయూ గ్రీన్ బెల్ట్ డెరైక్టర్‌గా, సెంటర్ ఫర్ బయోడైవర్సిటి డెరైక్టర్‌గా పని చేస్తున్నారు. గతంలో రుసా, ఐ క్యూఎసి కో ఆర్డినేటర్‌గా, టిహబ్ ఓయూ కో ఆర్డినేటర్‌గా , పిఆర్‌ఓగా

గుర్తు తెలియని మృతదేహాల స్వాధీనం

నవతెలంగాణ-బేగంపేట్

గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చోటు చేసుకున్నది. చిలకలగూడ ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీ ఆస్పత్రి ఎమర్జెన్సీవార్డు, మెడికల్ కాలేజీ మైదానం వద్ద ఈ నెల 3వ తేదీన వేర్వేరుగా ఇరువురు వ్యక్తులు అపస్మారక స్థితిలో పడిన్నట్లు సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. సమాచారం అందుకున్న అవుట్‌పోస్ట్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఇరువురిని అత్యవసర విభాగానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

మృతదేహాలను గాంధీ మార్చురీలో భద్రపరిచారు. సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, మృతుల సంబంధీకులు, బంధువులు గుర్తించి చిలకలగూడ పోలీసులకు నేరుగా లేదా ఫోన్ నంబరు 040 27853597కు సమాచారం అందించాలని ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపారు.

ఏదులాబాద్ గ్రామ పంచాయతీలో అవకతవకలు

- గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రెటరీపై వేటు
- ఆదేశాలు జారీ చేసిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అభిషేక్ అగస్త్య

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామ పంచాయతీలో అవకతకవలు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఇందుకు కారణమైన సర్పంచ్, పంచాయతీ సెక్రెటరీపై వేటు పడింది. సర్పంచ్‌ను తాత్కాలికంగా పదవి నుంచి తప్పించగా, పంచాయతీ సెక్రెటరీని విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్ణీత కాలంలో గ్రామ సభలు నిర్వహించనందున, పంచాయతీ సెక్రెటరీ డి.ఉషపై అజమాయిషీ ప్రదర్శించినందుకుగాను ఏదులాబాద్ సర్పంచ్ కాలేరు సురేష్‌ను తొలగించి, ఉప సర్పంచ్ ఉప్పు లింగేశ్వర్‌రావును తాత్కాలిక సర్పంచ్‌గా నియమిస్తూ అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలు జారీ చేశారు. ఏదులాబాద్‌లో నకిలీ రషీదు బిల్లులతో జరిగిన ఆర్థిక అవకతవకలు, రూ.17,25,502 డబ్బును పంచాయతీ ఖాతాలో జమచేయనందున పంచాయతీ రాజ్ చట్టం ద్వారా సెక్రెటరీ టి.ఉషను విధుల నుంచి తొలగించారు.

ఎం.ఎం.టీ.ఎస్ రైల్ సర్వీసుల రద్దు వెనుక మూసివేసే కుట్ర

- రూ.900ల కోట్లతో ప్రారంభించిన ఫేజ్-2పై నిర్లక్ష్యం
- ఫేజ్-2,ఫేజ్-1 రూట్లలో రైళ్లను సక్రమంగా నడపడం లేదు
- వంద రోజుల్లో 60 రోజులు రద్దు
- ఎంఎంటీఎస్ అభివృద్ధి చేయకుంటే ఆందోళన తప్పదు
- సీపీఐ(ఎం) సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి

ఎం.శ్రీనివాస్ హెచ్చరిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంఎంటీఎస్ ఫేజ్-2ను అత్యంత అర్భాటంగా ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించారు. కానీ రైళ్లను సక్రమంగా నడపడం లేదని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎం.ఎం.టీ.ఎస్ రైల్ సర్వీసుల రద్దు వెనుక మూసివేసే కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేతుల మీదుగా ఎంఎంటీఎస్ ఫేజ్-2ను ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించారని గుర్తు చేశారు. ఫేజ్-2 నిర్మాణానికి దాదాపు రూ. 900ల కోట్లు ఖర్చు చేశారు కానీ రైళ్లను సరిగా నడపడం లేదన్నారు. ముఖ్యంగా సమయపాలన పాటించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎంఎంటీఎస్ వ్యవస్థ పట్ల ఏమాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫేజ్-2 తోపాటు ఫేజ్-1 రూట్లలో సైతం రైళ్లను సక్రమంగా నడపడం లేదన్నారు. నగరంలో సామాన్య ప్రజానీకం అతి చౌక టికెట్‌తో ప్రయాణించే ఎంఎంటీఎస్ రైళ్లను నిరంతరం రద్దు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ ఈ రైళ్లను అందుబాటులో లేకుండా చేస్తోందన్నారు. గత వంద రోజుల్లో 60 రోజులపాటు ఎంఎంటీఎస్ సర్వీస్‌లను రద్దు చేశారన్నారు. ఈ నెల 6 నుంచి 10 వరకు రద్దు చేస్తున్నట్టు తాజాగా ప్రకటించారని తెలిపారు. రైలు సర్వీసులు నిరంతరం రద్దు కావడం, ఆలస్యంగా నడవడంతో ఎంఎంటీఎస్ రైల్ ప్రయాణంపై ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రయాణ సాధనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఎంఎంటీఎస్ రైళ్లను నిరంతరం రద్దు చేయడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వెనక ఎంఎంటీఎస్ వ్యవస్థను మూసి వేయడమో లేక ప్రయివేటీకరించడానికి ప్రభుత్వం కుట్ర చేస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. నగరంలో ప్రజా రవాణాను ఖరీదుగా మార్చడం కానీ, ప్రజలకు అందుబాటులో లేకుండా చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ఎంఎంటీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ చర్యలను సీపీఐ(ఎం) నగర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎంఎంటీఎస్ అభివృద్ధికి చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

ఓటరు జాబితా కోసం రాజకీయ పార్టీలు సహకారం అందించాలి

- ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన నేపథ్యంలో తప్పులు లేకుండా స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ కోరారు. ఓటరు జాబితాలో తప్పుల సవరణపై జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులు, జీహెచ్ఎంసీ ఎన్నికల సంబంధించిన నోడల్ అధికారులతో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితాపై తెలియజేసిన అభ్యంతరాలను పోలింగ్ బూత్‌ల మార్పుల పై పరిశీలించి లిఖిత పూర్వకంగా సమాధానం అందజేయాలని ఆర్.ఓలు, ఈ.ఆర్.ఓలను ఆదేశించారు. సెకండ్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు క్యాంపెయిన్‌లో ప్రత్యేకంగా »BLO Appμ అందుబాటులో ఉందని తెలియజేశారు. ఎవరైనా బీఎల్ఓలు విధులు సక్రమంగా నిర్వహించని చో వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ జిల్లాలో 15 నియోజకవర్గాల్లో వివిధ రకాల తప్పులు లేదా సవరణలు ఉన్న 4.61 లక్షల ఓటర్లకు సంబంధించిన ఫారం-8 ద్వారా తీసుకోవాల్సి ఉండగా ఇప్పటి వరకు 4,20,499 దరఖాస్తులు సేకరించినట్లు మిగిలిన, 41,269 మంది కలెక్ట్ చేయాల్సి ఉందని అందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపెయిన్ సందర్భంగా 12,147 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారంగా నియోజకవర్గ స్థాయిలో ప్రతి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇ.ఆర్.ఓ అధ్యక్షతన ఆర్.ఓలతోపాటు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరుగుతుందని అన్నారు. ప్రతి బుధవారం జరిగే సమావేశంలో అజెండా అంశాలతో జరగడంలేదని పార్టీల ప్రతినిధులు కమిషనర్ కు తెలపడంతో డ్రాఫ్ట్ అజెండా తయారు చేసి, దాని ప్రకారం సమావేశం జరుగుతుందని వివరించారు. నియోజకవర్గ కేంద్రంలో జరిగే సమావేశంలో మినిట్స్ తప్పని సరిగా హాజరైన ప్రతినిధులకు పంపించాలని సమావేశానికి హాజరైన ఆర్ఓలను ఈఆర్ఓలను ఆదేశించారు. గత నెల 26 ,27 తేదీల్లో సెప్టెంబర్ 2,3 తేదీల్లో జరిగిన ప్రత్యేక సమ్మరీ రివిజన్ క్యాంపెయిన్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినందున మరో రెండు తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాటు చేయాలని ఆల్ పార్టీల ప్రతినిధులు జిల్లా ఎన్నికల అధికారిని కోరారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి నివేదిక అందిస్తామని, అక్కడి నుండి అనుమతి వచ్చిన తార్వత నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. ఓటరు అవగాహనకు జీహెచ్ఎంసీ పరిధిలోని 10 లక్షల మంది ఆస్తిపన్ను దారులకు మొబైల్ ఫోన్ మెసేజ్‌లు వెళ్లాయన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో ఆడియో ద్వారా ప్రచారంతో పాటు స్వచ్ఛ ఆటో టిప్పర్ల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ శంకరయ్య, జోనల్ కమిషనర్లు వెంకటేష్ దెత్రె, వెంకన్న, రిటర్నింగ్ అధికారులు, ఇతర నోడల్ అధికారులు, కార్వాన్ శాసన సభ్యులు కౌసర్ మోయినుద్దీన్, ఏ ఐ ఎం ఐ ఎం పార్టీ తరుపున పాల్గొన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధులు సునీల్, నందీష్ కుమార్, భారతీయ జనతా పార్టీ ప్రతినిధులు పొన్న వెంకటరమణ, అజయ్ కుమార్, కె.పవన్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు డి.సుధాకర్, ఠాకూర్ రాకేష్, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రతినిధి ఎం.శ్రీనివాస రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు నిరంజన్, రాజేష్ కుమార్, బి.ఆర్.ఎస్ పార్టీ ప్రతినిధులు డి.కొండారెడ్డి, ఎ.కార్తీక్ రెడ్డి, ఏ.ఐ.ఎం.ఐ.ఎం పార్టీ ప్రతినిధి సయ్యద్ ముస్తాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ శక్తులకు అధికారం దక్కాలి

నవతెలంగాణ-ముషీరాబాద్

దేశంలో సామాజిక న్యాయ శక్తులకు అధికారం దక్కినప్పుడే సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమాన వాటా దక్కుతోందని ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ ఐ, తిరుమలి అన్నారు. ఈ మేరకు సామాజిక న్యాయం కోరుకునే శక్తులన్నీ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక తెలం గాణ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాల నాయకులు సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో ప్రొఫెసర్ ఐ.తిరుమలి మాట్లాడుతూ ఈ దేశంలో రాజ్యాంగం ద్వారా పొందుపర్చిన అంశాలను పాలకులు అమలు చేయాల్సి ఉండగా, రాజ్యాంగంలో పొందుపర్చిన కీలకమైన అంశాల ఆధారంగా పాలించాల్సిన విధానాలను పాలకులు విస్మరిస్తున్నారని ధ్వజమెత్తారు. సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ ప్రొఫెసర్ మురళి మనోహర్, నాయకులు బొంగు ప్రసాద్, బిఎంసి అధ్యక్షులు అంగోల్ లక్ష్మణ్, బివింది జాతీయ ఉపాధ్యక్షులు డాన్ రాం నాయక్, చామకూర రాజు, బిని పోలిటికల్ ఫ్రంట్ నాయకులు దేవళ్ల సమత, వెంకట్ యాదవ్ కేవి గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి స్థానాన్ని దళితుడికి కేటాయించాలి

ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాజకీయ పార్టీలు ముఖ్యమంత్రి స్థానాన్ని దళి తుడికి కేటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి ధర్మ సమాజ పార్టీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమా వేశంజరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శులు దుర్గాప్రసాద్, లక్ష్మణ్ ,అబ్దుల్ రెహమాన్, హాజరై మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీ దేశంలో 93 శాతం జనాభా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలకు నాయకత్వం అప్పజెప్పాలి అని అన్నారు. ప్రభుత్వంలో ముఖ్యమంత్రి స్థానాన్ని దళితుడికే కేటాయించాలి.ఈ సమావేశంలో రాఘవేంద్ర ముదిరాజ్‌లి, కార్యదర్శి వినోద్ యాదవ్ రాష్ట్రకార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు లింగస్వామి మహారాజ్‌లి, సైదులు మహారాజ్, కృష్ణ మహారాజ్, ఉదయ్ మహారాజ్. మల్లేష్ మహారాజ్. రాజీవ్ మహారాజ్, మస్తాన్, హనుమంత్ మహారాజ్, రాజేష్ మహారాజ్, శివ మహారాజ్, నాయకులు పాల్గొన్నారు.

వర్షంలో ఓంటి కాలిపై ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఆందోళన

ఐదో రోజుకు చేరిన ఉద్యోగుల సమ్మె



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రభుత్వ హయంలో ఎన్‌హెచ్‌ఎం స్కీం యూహెచ్‌సీలో పనిచేస్తున్న అకౌంటెంట్స్ పీహెచ్‌సీ డీఈఓ పీహెచ్‌ఎం సపోర్టింగ్ సిబ్బంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోఠి డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్ ఆవరణలో సోమవారం వర్షంలో ఓంటి కాలిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు రోజులుగా ఎన్‌హెచ్ ఎంస్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, సమన పనికి సమాన వేతనం (రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ పే వర్తింపజేయాలి) ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఉద్యోగులకు హెల్త్‌కార్డులు జారీ చేయాలని చేయాలని, ఇన్సూరెన్స్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. 510 జీఓలో విలీనం చేయాలన్నారు. డిమాండ్లు నెంవేరే వరకు ఆందోళన సమ్మె కొనసాగుతుంద, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొని తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. బాలసుబ్రహ్మణ్యం. శ్రీమణి, శ్రీలక్ష్మి. భార్గవి, లోకేష్, ప్రకాష్, బాల్‌రెడ్డి, లోకేష్ సురేష్ హనుమంతు, మధు శిరీష నరసింహులు సునీల్, పల్లవి, మాధవి, లావణ్య భారతి, గౌరీ, చంద్రకళ, అనసూయ, రమేష్, హైదరా బాద్ మేడ్చల్ రంగారెడ్డి జిల్లాల ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

'5న చలో లేబర్ ఆఫీస్'

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత మోటార్ సైకిళ్లు ఇవ్వాలని





నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

భవన నిర్మాణ కార్మికులకు 2022 సంవత్సరంలో ఇస్తామని అసెంబ్లీలో చెప్పిన ఉచిత మోటార్ సైకిళ్ల వెంటనే ఇవ్వాలని, తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు తుపాకీ ఆంజనేయులు, కె. జంగయ్య , ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అడ్డా ల వద్ద మౌళిక సదుపాయాలు కల్పించాలని, ఇండ్లు లేని పేదవారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, పనులు లేక ఇబ్బంది పడు తున్న కార్మికులకు పనులు కల్పించాలని, పట్టణ ప్రాంతాల్లో పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలులోకి తెచ్చి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కార్మికులకు పనులు కల్పించి , కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. లేబర్ ఆఫీస్‌లో పేరుకు పోయిన పెండింగ్ క్లెయి మ్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని , 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూపాయలు 10,000/ వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, నిర్మాణ రంగంలో వాడే ముడిసరుకుల దరలు తగ్గించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తు వుల ధరలు నియంత్రించాలని , ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉచిత మోటార్ సైకిళ్ల సాధన కోసం సెప్టెంబర్ 5న జరుగంతున్న చలో లేబర్ ఆఫీస్ కార్యక్రమం జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో సి.బాల్ రాజు, బి.గంగపురి, యం.వెంకటేష్ , యం. రాజు, కోటసత్యనాయణ, నెమ్మది గోపాల్, జి.నారాయణ, కె.హన్మ ంతు , వేముల అంజయ్య , బాగ్యమ్మ, వగ్గు సైదులు, రాములు, ఈర్ల శ్రీను, యం.జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ఆమ్ ఆద్మీ పెద్దపీట

ఆప్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహమూద్ అలీ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలో తమ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కో-కన్వీనర్, న్యాయవాది మహమూద్ అలీ స్పష్టం చేశారు.ఈ మేరకు సోమవారం మహమూద్ అలీ నేతృత్వంలో నగరంలోని పలు నియోజకవర్గాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. త్వరలోనే తమ ప్రచారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని లక్ష ఇళ్లకు చేరుకుంటామని పేర్కొన్నారు.జూబ్లీహిల్స్ ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు.ఆప్ ను ఎందుకు ప్రోత్సహించాలి, ఇతర రాజకీయ పార్టీల మాదిరిగా కాకుండా ఆసుపత్రులలో అనారోగ్యానికి అయ్యే మొత్తం ఖర్చుకు ఆప్ హామీ ఇవ్వగలదన్నారు.ప్రైవేట్ విద్యతో సమానంగా నాణ్యమైన విద్య, ఉపాధి హామీ ఇవ్వబడుతుందని ఆయన హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలోపార్టీ నేతలుఅనమ్ అలీ, ఫర్దీన్ పాల్గొన్నారు.

5వేల పోస్టులే భర్తీ చేస్తామనడం అన్యాయం



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

25వేలకుపైగా టీచర్‌పోస్టులు ఖాళీగా ఉంటే 5వేలు ఎలా భర్తీ చేస్తారని మొత్తం భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జా కృష్ణ, నీలా వెంకటేష్ అధ్యక్షతన ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా జరిగింది ఈ ధర్నాలో ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా 5 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం అని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించడం దారుణమని, ఇది చాలా అన్యాయమ న్నారు. ప్రభుత్వ పాఠశాలలో 25వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పీఆర్సీ కమిటీ రిపోర్టులో పేర్కొంది. తెలంగాణలోని ప్రాథమిక పాఠశాలలో 18వేల టీచర్ పోస్టులు ఖాళీగా యున్నట్లు పార్లమెంటు సాక్షిగా ప్రకటించారని తెలిపారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో 16 వేల పాఠశాలలో ఇంగ్లీష్, మథ్స్, సైన్స్ పాఠాలు చెప్పేవారు లేరు. విద్యార్థులుకు ఈ సబ్జెక్టులో విషయ పరిజ్ఞానం లేక చదువులల్లో వెనుకబడి పోతున్నారు. దీనిలో బేసిక్ విషయ పరిజ్ఞానం లేక జాతీయ పరీక్షలలో పోటీలో ఇంటర్, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర పోటీ పరీక్షలలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పీఆర్సీ రిపోర్టు ప్రకారం రిటైర్మెంట్ వల్ల ఏర్పడ్డ 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వేముల రామకృష్ణ, అనంతయ్య, నందగోపాల్, రాజ్ కుమార్, మోడి రాందేవ్, రాజేందర్ . తదితర నాయకులు పాల్గొన్నారు

శ్రీత్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపల్‌గా

సితార్ విద్వాంసులు శ్రీపాండురంగ ముతాలిక్





నవతెలంగాణ-సుల్తాన్ బజార్

రామ్ కోఠి శ్రీత్యాగరాజ ప్రభుత్వ సంగీత, నృ త్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవలే సితార్ విద్వాం సులు శ్రీ పాండురంగ ముతాలిక్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం రామకోఠిలోని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలోని ఆయన ఛాంబర్‌లో మాట్లా డుతూ తాను 1982లో ఇదే కళాశాలలో గురూజీ శ్రీ బాపూజీ శ్యాంసుందర్ గురు వద్ద విద్యార్థిగా సితార్ సంగీతం నేర్చుకున్నానని, 21ఏండ్ల పాటు భక్తారాం దాస్ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల సికింద్రాబాద్‌లో పని చేశానన్నారు. 2019లో మంథిని మ్యూజిక్ స్కూల్ ప్రిన్సిపల్‌గావిధులు నిర్వహించినట్లు, తానునేర్చుకున్న సంగీత కళాశాలకే ప్రిన్సిపల్‌గారావడం ఆనందం కలిగించిందన్నారు. విద్యార్థులు వివిధ సంగీత కోర్సుల్లో, నృత్యం నేర్చుకోవాలని సూచించారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అధ్యాపక బృందంపూలబోకేతో శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆకట్టుకున్న హార్టీకల్చర్ షో

నెక్లెస్ రోడ్డులో సందర్శనకు వస్తున్న వేల మంది ప్రకృతి ప్రియులు



నవతెలంగాణ-అంబర్‌పేట

నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన ఆలిండియా హార్టికల్చర్, అగ్రికల్చర్‌షో ప్రకృతి ప్రియులను ఆకట్టకుంటోంది. 14వ మెగా నర్సరీ మేళాలో లేటెస్ట్ ట్రెండింగ్‌లో ఉన్న వర్టికల్ గార్డెనింగ్, హైడ్రోపోనిక్ సిస్టమ్, టెర్రస్ గార్డెనింగ్, కిచెన్ గార్డెనింగ్ వంటి లేటెస్ట్ టెక్నాలజీ ఈ షో లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు. దేశవ్యాప్తంగా కోల్కతా, ఢిల్లీ, హర్యానా, ముంబయి, బెంగుళూరు, పూణే, షిర్డీ, కడియం, చెన్నై తెలంగాణ, ఆంధ్రా తదితర నగరాలు, ప్రాంతాల నర్సరీల నుంచి వచ్చిన మొక్కలు, ఉత్పత్తులను 150 స్టాల్స్ ను ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు. రకరకాల పూల మొక్కలు, వివిధ రకాల పండ్ల మొక్కలు గార్డెనింగ్ ఔత్సాహికులను అమితంగా ఆకట్టకుంటున్నాయి. కాంక్రీట్ జంగిల్, బీజీలేఫ్‌లో ఉండే నగర వాసులకు గార్డెనింగ్ హ్యాబీగా చేసుకుంటే మానసిక ఒత్తిడి తగ్గించి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ఉల్లాసాన్ని కలిగిస్తాయని హార్టీకల్చర్ షో ఇంచార్జ్ ఖాలీద్ అహ్మద్ అన్నారు. పీపుల్స్ ప్లాజాలో నిర్వహిస్తున్న నర్సరీ మేళాకు వేలాది మంది సందర్శిస్తున్నారని తెలిపారు.ఈషోలో జాతీయ, అంతర్జాతీయ రకాల నర్సరీమొక్కలను అందుబా టులోకి తీసుకువచ్చామని తెలిపారు. విరబూసే క్రీసెంట్‌మమ్, స్విజర్‌ల్యాండ్, నెదర్లాండ్ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న జర్బెరీ, తులిప్, ఎగ్జెటిక్ పూలు, పండ్ల మొక్కలు, అగ్రికల్చర్, హార్టీకల్చర్‌కు అవసరమైన ఈక్విప్‌మెంట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మట్టి లేకుండా కేవలం నీటిలో పెరిగే వెజ్‌టబుల్స్, ఫ్రూట్, ఫ్లవర్ ప్లాంట్స్, బల్బ్స్ ప్రదర్శించారు. షో మంగళవారం రాత్రి 9గంటల వరకు నగర ప్రజలకు అందుబాటులోకి ఉంటుందని తెలిపారు.

తెలంగాణలో "మాదిగలకు"తీవ్ర అన్యాయం

మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ అన్నారు. సోమవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్టంలో అన్ని రాజకీయ పార్టీలు మాలలకే ప్రాధాన్యత ఇస్తూ, మాదిగల పట్ల వివక్షత చూపిస్తూ రాజకీయంగా తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు డెబ్బై లక్షల పైచిలుకు జనాభా కలిగిన మాదిగ, మాదిగ ఉపకులాలకు కేసీఆర్ పభుత్వంలో గుర్తింపు లేకపోవడం దురదృష్టకరమని, మాలలకు ఇచ్చే గౌరవం, గుర్తింపు మాదిగలకు ఇవ్వకుండా అవమానించేలా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ అంశంతో పాటు సమాకాలిన రాజకీయ పరిస్థితులు, మాదిగలు ఎదురుకొంటున్న పలు సమస్యలపై చట్ట సభలలో సమ న్యాయ సాధనకై అన్ని రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలకు అధిక సీట్లు కేటాయించాలని, లేని పక్షంలో ఆ పార్టీలను ఓడించేందుకు మాదిగలు వెనుకాడరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు బొర్రా సంపూర్ణ, ప్రధాన కార్యదర్శి మాదాసు శోభ, జాతీయ మహిళ కార్యదర్శి మేకల అనిత, గ్రేటర్ హైదరాబాద్ మహిళ అధ్యక్షురాలు అందుగుల శ్రీదేవి, రాధికా, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ వచ్చేలోపు అభివృద్ధి పనులు పూర్తి కావాలి

అధికారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమీక్ష



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులతో అంబర్ పేట నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేపట్టాలో వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వివిధ బస్తీలు, కాలనీల్లో పాదయాత్ర చేసిన సమ యంలో ప్రజలు దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారులతో చర్చించి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచిం చారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపు పనులన్నీ పూర్తి చేయాలని చెప్పారు.ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఈఈ పేరిరాజు, డీఈ ప్రవీణ్, డీఈ రఘు, వాటర్ వర్క్స్ డీజీఎం సన్యాసి రావు, విష్ణువర్ధన్, ఏఈలు, వర్క్ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం అవసరం




ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

మానవుని సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. నియోజక వర్గంలోని కవాడిగూడ డివిజన్ ఇందిరా పార్క్‌లో 27లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్ పనులను, దోమలగూడలో 17లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఇందిరాపార్క్ అతిపెద్ద పార్క్ అని, ఇక్కడ వాకర్స్ పెద్ద సంఖ్యలో వస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి టాయి లెట్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్కులో వ్యాయామ సామాగ్రి శిధిలావ్యవస్థలో చేరడంతో అత్యధిక నిధులు కేటాయించి అత్యాధునిక వ్యాయామ సామాగ్రి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని, సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జైసింహ, స్థానిక డివిజన్ కార్యదర్శి సా యి కృష్ణ, రామచందర్, లక్ష్మీ గణపతి దేవాలయ చైర్మన్ మచ్చకుర్తి ప్రభాకర్, హనుమాన్ టెంపుల్ చైర్మన్ రాజ శేఖర్ గౌడ్, మహేష్, ప్రభాకర్, సుధాకర్ యాదవ్, రాజే ష్, పాస్పోర్ట్ శీను, రోటరీ యాదగిరి,రమేష్, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైన

అంబర్ పేట ఎస్సై రామ చందర్ రాజు



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్నా రాము చందర్ రాజు జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైనట్లు నిర్వాహకులు దూడపాక శ్రీధర్, సమీక్షకులు వేణుగోపాల్ రావులు సోమవారం తెలిపారు. కవులలో ఉన్న సాహితి ప్రతిభను వెలికి తీసే ప్రయ త్నంలో ఆగస్టు 28న వాట్సాప్ వేదికగా ఆర్యాని సకల కళావేదిక, గౌతమేశ్వర సాహితి కళాసేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా అంబర్‌పేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాముచందర్ రాజు రెండు అంశాల్లో రెండు కవితలు రాశారని, అవి జాతీయ స్థాయిలో పురస్కారానికి ఎంపికయ్యారన్నారు. కరీంనగర్ ఫిలీం భవన్‌లో సెప్టెంబరు 10న ప్రముఖ సాహితీ వేత్తల చేతులు మీదుగా బంగారు పతకం, పురస్కార పత్రం, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ రామచందర్ రాజును ఏసీపీ శ్రీనివాస్ ఇన్‌స్పెక్టర్ డి.అశోక్ తోటి సిబ్బంది అభినందించారు.

లేబర్ కమిషనర్ సమక్షంలో వీఎస్టీ అగ్రిమెంట్



నవతెలంగాణ- ముషీరాబాద్

వజీర్ సుల్తాన్ టుబాకో (వీఎస్టీ)లో ఇటీవల కార్మికుల వేతన సవరణ ఒప్పందం జరిగిన నేపథ్యంలో కార్మిక శాఖ కమిష నర్ శ్యాంసుందర్ రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ మేరకు వివిస్టి ఫంక్షన్ హాల్లో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వివిస్టి యూని జయన్ అధ్యక్షులు వి. శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బలి ప్రభాకర్, కంపెనీ హెచ్ఆర్ అమిత్ అరోరా, వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్, హెచ్ఆర్ ఫైనాన్స్ అనీష్ గుప్తా రామ్లుతో ఒప్పంద పత్రాలను ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కార్మిక శాఖ అధికారుల సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఒకరినొకరు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వివిస్టి యూనియన్ అధ్యక్షులు వి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఎన్ఎన్ఎల్ ప్యానెల్ప 6సార్లు వరుసగా అధ్యక్షుడిగా గెలుపొందడమే కాకుండా, మూడు సార్లు ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బాబి, కోశాధికారి నరేందర్ గౌడ్, డిప్యూటీ సెక్రటరీ రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రెసిడెంట్ కట్కూరి త్రిలోత్తమ లావణ్య



వతెలంగాణ -సుల్తాన్ బజార్

ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఏక్తా నూతన ప్రెసిడెంట్‌గా కట్కూరి త్రిలోత్తమ లావణ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా రాష్ట్ర మెడికల్ బోర్డు జాయింట్ డైరెక్టర్. తెలం గాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ అధ్యక్షురాలు కే.శశిశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. మహిళలు శక్తివంతులని తెలిపారు. మహిళల లా సాధికారత కోసం సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పిన్నింగ్ వేడుక నిర్వహించారు. నూతన కార్య వర్గానికి శుభా కాంక్షలు తెలి య జేశారు. ఈ కార్యక్ర మంలో మిస్సెస్ ఇండియా తెలంగాణ మూడవ రన్నర్ ఆఫ్ పి అరుణ, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఏక్తా ప్రెసిడెంట్ కట్కూరి త్రిలోత్తమ లావణ్య మాజీ అధ్యక్షురాలు గిరిజ సంపత్, కార్యదర్శి మీనాక్షి ఠాకూర్, ఐడబ్ల్యుసి జిల్లా ఏసి లీల చంద్వాని, పీడీసీ మాయ, విజయలక్ష్మి శకావత్, డాక్టర్ స్వర్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఏదో ఒకటి తినాల్సిందే

ఉద్యోగం చేసే ఆడవారు ఇంట్లో, బయటా పని ఒత్తిడితో తమ ఆహారం విషయంలో పెద్దగా శ్రద్ధ పెట్టరు. దాంతో వయసు పెరిగినకొద్దీ అనారోగ్య సమస్యలు చుట్టుముడుతుంటాయి. రోజువారీ తీసుకునే ఆహారం విషయంలో చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే ఆ సమస్యలు రాకుండా చూసుకోవచ్చు అంటున్నారు పోషకాహార నిపుణులు. సాధారణంగా రెండుపూటలా తీసుకునే ఆహారంతో పాటు మధ్యమధ్యలో తప్పనిసరిగా ఏదో ఒకటి తింటుండాలి. అయితే ఆ ఏదో ఒకటి అధిక క్యాలరీలని పెంచేది కాక ఆరోగ్యాన్నీ, శక్తినీ ఇచ్చేది అయితే మంచిది అంటూ కొన్ని సూచనలు చేస్తున్నారు.

➤ సాయంత్రం వేళ ఆకలిగా అనిపించినప్పుడు సలాడ్లు వంటివి తీసుకోవాలి. సలాడ్ల వల్ల శరీరానికి తక్కువ క్యాలరీలు అందుతాయి. ఆకలి తీరుతుంది కూడా. అందులోనూ క్యాబేజీని సలాడ్‌లో కలిపి తీసుకుంటే దీనిలోని 'గ్లాటామైన్' అనే అమినో యాసిడ్ చిన్న పేగు ఆరోగ్యంగా పనిచేసేట్టు చూస్తుంది. డైజేషన్ ఇబ్బందుల వంటివి తగ్గుతాయి.

➤ బాదం, జీడిపప్పు తదితర డ్రై ఫ్రూట్స్ నేరుగా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ సమస్య వుండదు. వీటిలో విటమిన్ 'ఇ'తో పాటు మాంగనీస్, విటమిన్ బి2, ఫాస్పరస్,



మెగ్నీషియం, కాపర్ ఉంటాయి. డ్రై ఫ్రూట్స్‌ని మధ్యాహ్నం వేళ తీసుకుంటే శక్తి లభిస్తుంది.

➤ పల్లీలు కూడా ఆరోగ్యానికి మంచివి. వీటిలో మాంసకృత్తులతో పాటు బి3, కాపర్, మాంగనీస్ వంటి పోషక విలువలు సమృద్ధిగా వుంటాయి. కాబట్టి పల్లీలు వేయించి లేదా ఉడికించి ఓ చిన్న బాక్సులో వేసుకుని ఆకలి అనిపించినప్పుడు నాలుగు గింజలు నోట్లు వేసుకుంటే చాలు ఆకలి తీరుతుంది. ఓపిక వస్తుంది.

➤ ఇక పండ్లు తింటే శరీరంలోకి అనవసర క్యాలరీలు చేరవు. ఆకలి అదుపులో వుంటుంది. అరటిపండుని ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు తీసుకుంటే రోజంతటికీ కావలసిన శక్తి లభించినట్టే. ఎందుకంటే అరటిపండ్లలోని కాల్షియం, ప్రొటీన్లు, ఐరన్‌లతోపాటు కార్బొహైడ్రేట్లు త్వరితగతిన శక్తినిస్తాయి. ఇక ఆపిల్స్‌లోని విటమిన్ 'ఎ', ఐరన్, బొప్పాయిలోని విటమిన్ ఎ, కె, ఇ తదితర పోషకాలు శక్తినివ్వడమే కాకుండా ఆరోగ్యానికీ మేలు చేస్తాయి.

➤ మొలకెత్తిన గింజల్ని ఓ గుప్పెడు నోట్లో వేసుకుంటే చాలు వీటిలో సమృద్ధిగా లభించే మాంసకృత్తులు శరీరానికి శక్తినిస్తాయి. చురుగ్గా వుంచుతాయి.

ఇలా రోజు మొత్తంలో అప్పుడప్పుడు ఏదో ఒకటి నోట్లో వేసుకుంటే ఓపిక లేకపోవడం అన్న సమస్య వుండదు. బరువు పెరుగుతామనే భయమూ వుండదు. చలాకీగా రోజు వారీ పనులు ఏ ఆటంకం లేకుండా చేసుకోవచ్చు.



టీనేజ్‌లో పిల్లలు ఎవరైనా స్వేచ్ఛగా ఉండాలని కోరుకుంటారు. తనకంటూ వ్యక్తిగత సమయం కావాలని తపిస్తారు. తనను తాను నిరూపించుకోవాలని ఉవ్విళ్లూరుతుంటారు. అయితే ఈ వయసులోనే పిల్లలకు సమాజం నుంచి కొన్ని ఒత్తిళ్లు ఎదురవుతాయి. కుటుంబం నుంచి కూడా కొన్ని వ్యతిరేకతలు ఉంటాయి. అలాగే కొందరిలో సవాళ్లను తట్టుకునే సామర్థ్యం ఉండదు. ఇలా కారణమేదైనా యుక్తవయసులోకి ప్రవేశించిన చాలామంది ఒత్తిడి, ఆందోళనలతో సతమతమవుతున్నారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి టీనేజ్‌లో ఎదురయ్యే ఆందోళనలు, వాటికి పరిష్కార మార్గాలేంటో తెలుసుకుందాం...

ఒత్తిడికి గురవుతున్నారా..?

ఆందోళనకు గురయ్యే పిల్లల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారు వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా.. రెండు రకాలుగా దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. అందుకే తల్లిదండ్రులే చొరవ చూపాలి. వాళ్ల ఆందోళనలకు కారణమేంటో తెలుసుకోవాలి. వారి సమస్యలను పరిష్కరించే దిశగా చేయూతనందించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రధాన కారణం

టీనేజ్ పిల్లలు పెద్దవారిలా పరిణతితో ఆలోచించలేరు. వారు ఏది కోరుకుంటే అది జరిగి తీరాల్సిందే అన్న మొండితనం వారిలో కనిపిస్తుంటుంది. ఒకవేళ అది జరగలేదంటే మాత్రం మానసికంగా మరింతగా కుంగిపోతారు. అలాగే తోటి వారితో పోల్చుకునే మనస్తత్వం వీరిలో ఎక్కువగా ఉంటుంది. అందం, ఆహార్యం, చర్మ ఛాయ, శరీర బరువు.. వంటి అంశాల్ని మరింత లోతుగా పరిశీలిస్తూ ఆత్మన్యూనతకు, అభద్రతా భావానికి లోనవుతుంటారు. ఇది క్రమంగా వీరిని కుంగుబాటుకు గురి చేస్తుందంటున్నారు నిపుణులు. ఇలా పోలికే కాదు.. ఎదుటివాళ్లు తమలోని లోపాల్ని ఎత్తిచూపుతూ వేధించినా, హేళన చేసినా వీళ్లు అస్సలు తట్టుకోలేరు. టీనేజ్ దశలో చాలామంది కుంగుబాటుకు లోనవడానికి ఇదే ప్రధాన కారణం అంటున్నాయి పలు అధ్యయనాలు.

ఆకర్షణలకు లోనవడం

తెలిసీ తెలియని ఈ వయసులో ప్రేమలో పడడం, ఆకర్షణకు లోనవడం, టీనేజ్ ప్రెగ్నెన్సీ.. ఇవి కూడా వారిని మానసికంగా కుంగదీస్తాయి. తద్వారా ఇతర లక్ష్యాలపై మనసు పెట్టకుండా అడ్డుకుంటాయి. ఈ దశలో కొంతమంది అమ్మాయిలు ప్రేమ పేరుతో మోసపోవడం, లైంగిక దాడికి గురవడం.. ఈ విషయం ఇంట్లో తెలిస్తే తల్లిదండ్రులు ఏమంటారోనన్న భయమే వారిని మానసికంగా దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు.

ఊబిలో కూరుకోకముందే

సోషల్ మీడియా మితంగా వాడితే ఎంత ఉపయోగకరమో.. అతిగా వాడితే అంతే అనర్థం. ముఖ్యంగా టీనేజ్ పిల్లలు సామాజిక మాధ్యమాలను ఎక్కువగా ఉపయోగిస్తూ.. వారు పెట్టే పోస్టులకు ఆశించిన కామెంట్లు, లైకులు రాకపోవడం వల్ల కూడా డిప్రెషన్‌కి లోనవుతున్నారని పలు అధ్యయనాలు రుజువు చేశాయి. అలాగే శారీరకంగా, మానసికంగా ఎదిగే ఈ యుక్త వయసులో ఒత్తిడి, ఆందోళనలకు గురవడం వల్ల దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే వారు ఈ ఊబిలోకి కూరుకుపోకముందే తల్లిదండ్రులు పిల్లల్లోని డిప్రెషన్‌ను పసిగట్టాలని అంటున్నారు.

ఓటమిని తట్టుకోలేక...

యుక్త వయసులోకి ప్రవేశించిన వారి శరీరంలో పలు మార్పులు చోటుచేసుకోవడం, హార్మోన్ల స్థాయిల్లో హెచ్చుతగ్గులు.. వంటివి కూడా వారిలో మానసిక సమస్యలకు కారణమవుతున్నాయి. కొంతమంది చిన్నతనం నుంచే చదువు, కెరీర్, ఇతర భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో ఉంటారు. అయితే ఒక్కోసారి మనం అనుకున్న స్థాయిలో రాణించలేకపోవచ్చు. అలాంటప్పుడు ఓటమిని తట్టుకోలేక మానసిక కుంగుబాటుకు లోనయ్యే వారూ లేకపోలేదంటున్నారు నిపుణులు.



ఇలా తెలుసుకోవచ్చు..?

కొంత మంది పిల్లలు ఉన్నట్టుండి అకారణంగా ఏడుస్తుంటారు. అలాగే నలుగురితో కలవకుండా ఎప్పుడూ ఒంటరిగా, ఏదో ఆలోచిస్తుంటారు. వారి మాటల్లో వైరాగ్యం, నిరాశానిస్పృహలు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తాయి. చిన్న విషయాలకే కోపం, చిరాకు తెచ్చుకుంటుంటారు. ఎదుటివారిపై అకారణంగా అరుస్తుంటారు. ఎక్కువగా నిద్రపోవడం, లేదంటే నిద్రలేమి కూడా ఈ లక్షణాలే. అలాగే సరిగా తినకపోవడం, చదువులో మెరుగ్గా రాణించకపోవడం, విచక్షణ, ఆలోచనా శక్తి కోల్పోయి తమకు తామే హాని చేసుకుంటుంటారు. ఇలాంటి ప్రతికూల ఆలోచనలు తీవ్రమైతే.. ఒక్కోసారి ఆత్మహత్య ప్రయత్నాలకు కూడా వెనకాడకపోవచ్చు.. కాబట్టి టీనేజ్ పిల్లల్ని ఎప్పుడూ ఓ కంట కనిపెట్టడం ఉత్తమం అంటున్నారు నిపుణులు.



భరోసా ఇవ్వండి

డిప్రెషన్‌లో కూరుకుపోయిన పిల్లల్ని అందులో నుంచి బయటికి తీసుకురావడానికి తల్లిదండ్రులే చొరవ చూపాలంటున్నారు నిపుణులు. పిల్లలదే తప్పైనా సరే వారిని మందలించడం, కోప్పడడం, అసహ్యించుకోవడం లాంటివి చేయకుండా వారిని దగ్గరికి తీసుకోవాలి. పొరపాటు ఎలా జరిగిందో తెలుసుకొని దానికి పరిష్కారం వెతికే దిశగా ఆలోచిస్తే పిల్లలకి ఎంతో ఊరటగా ఉంటుంది. పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉంటే ఇలాంటి సమస్యలు చాలావరకు తలెత్తవంటున్నారు నిపుణులు. అందుకే ఇప్పటికైనా మించిపోయింది లేదు.. మీరు మీ పనుల్లో ఎంత బిజీగా ఉన్నా.. మీ పిల్లల కోసం తగినంత సమయం కేటాయించండి. అన్ని విషయాలు పంచుకోవడం, తెలుసుకోవడం చాలా మంచిది. టీనేజ్ వయసుకొచ్చిన అమ్మాయిల్లో జరిగే శారీరక మార్పుల గురించి తల్లులు ముందే వారికి అర్థమయ్యేలా చెప్తే.. వారు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా జాగ్రత్తపడచ్చు. కొన్ని రకాల థెరపీలు కూడా ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తాయంటున్నారు నిపుణులు. కాబట్టి వారి సలహా మేరకు ప్రారంభంలోనే చికిత్స చేయిస్తే పిల్లలు త్వరగా మళ్లీ గాడిలో పడతారు.

పాత్రికేయులపై కేసులు రాజ్యాంగ విరుద్ధం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ఎడిటర్స్ గిల్డ్ (ఈజీఐ) తరపున పర్యటించిన ప్రతినిధి బృందంపై పోలీసులు కేసులు నమోదు చేయడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈజీఐ అధ్యక్షురాలు సీమా ముస్తఫా, పాత్రికేయులు సీమా గుహ, భరత్ భూషణ్, సంజయ్ కపూర్‌తో కూడిన ప్రతినిధి బృందంపై మణిపూర్ పోలీసులు ఐపీసీలోని వివిధ సెక్షన్లు, ఐటీ చట్టంలోని సెక్షన్ 66-ఏ కింద కేసులు నమోదు చేశారు. మణిపూర్ హింసపై స్థానిక మీడియాలో వచ్చిన వార్తలు ఏకపక్షంగా ఉన్నాయని, ఇంటర్‌నెట్‌పై చాలా కాలం పాటు నిషేధం విధించడంతో పాత్రికేయులు సమతూకమైన అభిప్రాయానికి రావడం కష్టమైందని ఈజీఐ ప్రతినిధి బృందం అభిప్రాయపడింది. కాగా ఈజీఐ బృందం రాష్ట్రంలో మరిన్ని ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఆరోపించారు.

ఎడిటర్స్ గిల్డ్‌పై కేసు

(మొదటిపేజీ తరువాయి)

నిజ నిర్ధారణ బృందంపై సోమవారం మణిపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టంలోని 66ఏ కింద ఈజీఐపై ఎఫ్ఐఆర్ నమోదైంది. గత మూడు నెలలకు పైగా మణిపూర్‌లో రెండు కమ్యూనిటీల మధ్య నెలకొన్న ఘర్షణలపై ఈజీఐ మీడియా నివేదికను విడుదల చేసింది. మణిపూర్‌లో మరిన్ని హింసాత్మక పరిస్థితులకు దారితీసేలా ఈ నివేదిక ఉందంటూ... ఈజీఐపై కేసు నమోదు చేయాల్సిందిగా మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ పోలీసులను ఆదేశించారు. మరోవైపు ఐటీ చట్టంలోని 66ఏను 2015లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సెక్షన్ కింద పౌరులను హింసించడాన్ని నిలిపివేయాలని అన్ని రాష్ట్రాల పోలీసులను హెచ్చరించింది. అయితే మణిపూర్ పోలీసులు ఈ ఆదేశాలను బేఖాతరు చేయడం గమనార్హం.

మీడియా స్వేచ్ఛను, ఎడిటోరియల్స్ నాయకత్వ ప్రమాణాలను పెంపొందించేందుకు 1978లో నెలకొల్పబడిన ఈజీఐ మణిపూర్ హింసాకాండపై ఆదివారం ఓ నివేదికను విడుదల చేసింది. బీరేన్‌సింగ్ ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తున్నదనీ, ఇంఫాల్‌లో మీడియా మొత్తం మెయితీ కమ్యూనిటీకి అనుకూలంగా మారిందని పేర్కొంది. మణిపూర్ పోలీసులు, కమాండో విభాగాలు కూడా పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయని నివేదిక తెలిపింది. బహిరంగంగా మెయితీ పక్షం వహించడంతో పాటు ఇంఫాల్ శివార్లలోని కుకీ గ్రామాలపై దాడికి దిగాయని వెల్లడించింది. నేడు పరిపాలన కూడా జాతుల వారీగా విభజించబడిందని పేర్కొంది.

అమెరికా, ఐరోపాలను కుదిపేస్తున్న సమ్మెలు

(మొదటిపేజీ తరువాయి)

మారడం, మరోవైపు కంపెనీ లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీలకు, అలాగే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం వీధుల్లోకి వస్తోంది. ఈ క్రమంలో కార్మికవర్గం కొన్ని విజయాలు సాధించింది. ఒప్పందాలు కుదిరాయి. అమెరికా కార్మిక శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2022లో 23సార్లు సమ్మెలు చోటు చేసుకున్నాయి. 2009లో కేవలం అయిదు సార్లు సమ్మె జరగ్గా, గతేడాది అది 23కి పెరిగింది.

యూరప్‌లో స్తంభించిన రవాణా

యూరప్‌లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. సమ్మెలు, పని నిలుపుదల కారణంగా వందలాది విమానాలు నిలిచిపోయాయి. రైళ్లు, ప్రభుత్వ రవాణా స్తంభించిపోయింది. కొత్త పెన్షన్ పథకం, రిటైర్‌మెంట్ వయసు పెంచాలన్న ఫ్రాన్స్ ప్రభుత్వ ప్రతిపాదనలను నిరసిస్తూ అక్కడ తీవ్ర స్థాయిలో ఆందోళనలు జరిగాయి. భద్రత, ఇతర రంగాల కార్మికులు తమ కార్యకలాపాలను నిలుపుచేయడంతో జర్మనీలోని బెర్లిన్, ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయాల్లో విమాన సర్వీసులు రద్దయ్యాయి. తక్కువ వేతనాల పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బ్రిటన్‌లో రైల్వే కార్మికులు మూడుసార్లు సమ్మెకు దిగారు. కొన్ని యురోపియన్ దేశాల్లో వాకౌట్లు, సమ్మెలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. నయా ఉదారవాద విధానాల అమలు తీవ్రం కావడంతో పడుతున్న భారాలు, యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికవర్గం భారీ ఎత్తున ఆందోళనలకు దిగుతోందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

నేడు గురుపూజోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమానికి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఎ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరించనున్న ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డితోపాటు విశిష్ట అతిథులుగా శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు గౌరవ అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2023కు 126 మందిని ప్రభుత్వం ఎంపిక చేసింది. వారికి గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం వారికి అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా వారిని సన్మానించడంతోపాటు రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం, శాలువా, బంగారుపూత పూసిన రజతపతకాన్ని అందజేస్తారు.

ఉపాధ్యాయులకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణను, జ్ఞానాన్ని పెంపొందించి లక్ష్యం పట్ల స్పష్టమైన అవగాహనను కలిగించి వారిని కార్యసాధకులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ'అనే సూక్తి తల్లిదండ్రుల తర్వాత గురువుకున్న ప్రాధాన్యతను తెలియజేస్తుందని వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల సంక్షేమానికి, అభివృద్ధికి సమర్థవంతమైన కార్యాచరణను అమలు చేస్తున్నదని తెలిపారు. గురుకుల విద్యలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ రేపటితరాన్ని తీర్చిదిద్దడంలో ముందంజలో ఉందని వివరించారు. గుణాత్మక విద్యను అందిస్తూ చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణ సత్ఫలితాలను ఇస్తున్నదని తెలిపారు. తాము చేపట్టిన ఈ విధానాలతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చదువుల్లోనూ, క్రీడల్లోనూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని ప్రపంచానికి చాటుతున్నారని పేర్కొన్నారు. విద్యారంగ ప్రగతి పట్ల ప్రభుత్వానికున్న అంకితభావానికి, చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని వివరించారు.

విద్యార్థులకు భవిష్యత్‌నిచ్చేది గురువు : మంత్రి సబిత

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ విద్యా శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు జన్మనిస్తే వారికి భవిష్యత్ నిచ్చేది గురువు అని మంత్రి పేర్కొన్నారు. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయులు గురుతర బాధ్యతను నిర్వహిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. విద్య ద్వారానే మానవ వనరులు అభివృద్ధి చెందుతాయనీ, మానవ వనరుల ద్వారానే బంగారు తెలంగాణ సాధించొచ్చనే గొప్ప లక్ష్యంతో సీఎం కేసీఆర్ రాష్ట్రంలో విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యధిక గురుకులాలు పెట్టి, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయని మంత్రి తెలిపారు.

హస్తం జాబితా ఎప్పుడొస్తదో..?

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో సైతం హస్తం పార్టీకి సాంప్రదాయక ఓటు బ్యాంకు బలంగా ఉంది. దీనికితోడు బలమైన అభ్యర్థులను బరిలోకి దించితే అది కాంగ్రెస్‌కు మరింతగా కలిసొచ్చే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే కారు కంచుకోటల్లో సైతం ఆ పార్టీకి ఇబ్బందులు ఎదురు కావొచ్చన్నది వారి వాదన. ఈ కారణంతోనే గులాబీ పార్టీ నుంచి తొలి జాబితాలో చోటు దక్కించుకున్న అభ్యర్థులు... ఇప్పుడు కాంగ్రెస్ జాబితా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

సీఎం కేసీఆర్ చరిష్మా, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకుతోడు హస్తం పార్టీ తరపున బలహీన అభ్యర్థులు బరిలోకి దిగితే.. తమ గెలుపు సులవవుతుందని వారి ఆశ. అలాగాక బలమైన అభ్యర్థులు ప్రత్యర్థులుగా ఉంటే మాత్రం తమతోపాటు ప్రభుత్వానికి కూడా గండం తప్పదని ఆందోళన చెందుతున్నారు. అందువల్ల అనేక స్థానాల్లో కాంగ్రెస్ నిలబెట్టే అభ్యర్థులపైన్నే బీఆర్ఎస్ నేతల భవితవ్యం ఆధారపడి ఉందని చెప్పక తప్పదు.

మళ్లీ ముసురు

(మొదటిపేజీ తరువాయి)

వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడన ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ అలర్టులు జారీ చేసింది. తొమ్మిది జిల్లాలకు ఆరెంజ్, 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల నిజామాబాద్ జిల్లాల్లో ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతోంది. సింగూరులోకి భారీగా వరద వస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షం కురిసింది. హిమాయత్‌సాగర్, హుసేన్ సాగర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ నందివాగు ప్రాజెక్టు నిండుతోంది. మోమిన్‌పేట మండలం క్యాసారం వెళ్లే దారిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి భారీగా వరద నీరు చేరింది. తాండూర్ డిపోకు చెందిన బస్సు సంగారెడ్డి నుంచి తాండూర్ వెళ్తున్న క్రమంలో ఈ బ్రిడ్జి వద్దకు రాగానే బస్సు వరదలో చిక్కుకుపోయింది. దీంతో ప్రయాణికులు కేకలు వేశారు. స్థానికులు గమనించి వారిని రక్షించారు. మండలంలో పలుచోట్ల ఇండ్లు కూలిపోయాయి. వికారాబాద్ మండల కేంద్రం నుంచి పులిమద్ది గ్రామానికి వెళ్లే దారిలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీ మొత్తం నీరు వచ్చి చేరడంతో సుమారు మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.

వ్యవసాయ పనుల కోసం వెళ్లిన రైతన్న కామారెడ్డి జిల్లా గాంధారి మండలం మాతు సంగెం, పేట్ సంగెం గ్రామాల మధ్య వాగు ఉధృతిలో చిక్కుకుపోయారు. రెండు గ్రామాల మధ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి. ఈ క్రమంలో మాతు సంగెం గ్రామానికి చెందిన రైతు గౌరీ సంగయ్య వాగు ప్రవాహంలో చిక్కుకుపోయారు. సంగయ్యను కాపాడేందుకు స్థానికులు యత్నించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే జాజల సురేందర్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆలీ సాగర్ నుంచి తెప్పించిన బోటు సహాయంతో సంగయ్యను బయటకు తీసుకొచ్చారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. అర్ధరాత్రి మొదలై.. తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. కాలువలకు, ప్రాజెక్టులకు వరద ఉధృతి నెలకొంది. పలుచోట్ల పంటపొలాలు నీటమునిగాయి. లింగంపేట్‌లో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు అవతల ముగ్గురు రైతులు చిక్కుకోగా.. పోలీసులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

నిజామాబాద్ నగరంలోని చంద్రశేఖర్‌కాలనీ, బైపాస్, పాములబస్తీ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమైయ్యాయి. ఇండ్లల్లోకి నీరు వచ్చి చేరింది. బోధన్ టౌన్‌లో లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లు జలమయమైయ్యాయి. సదాశివనగర్‌లో వరద ఉధృతికి పొలాలు కొట్టుకుపోగా.. ఇసుక మేటలు వేసింది. లింగంపేట్ మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో పెద్దవాగు ఉధృతంగా పొంగిపొర్లింది. నాగారం శివారులో వాగుపై బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ఎస్సారెస్పీకి, నిజాంసాగర్‌కు వరద

ఎస్సారెస్పీకి, నిజాంసాగర్ ప్రాజెక్టులకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల నుంచి 30 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా రెండు గేట్లు ఎత్తి 5 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అదే విధంగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు 36 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. ఐదు గేట్లు ఎత్తి దిగువన మంజీరాకు 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో కురుస్తున్న వానలు రైతులకు ఎంతో మేలు చేశాయి. కొన్ని ప్రాంతాల్లో చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సోంపేట గ్రామ శివారులోని సింగూరు పెద్ద కాలువ తెగిపోయింది. నీరంతా గ్రామ పెద్ద చెరువులోకి చేరుతోంది. ఝరాసంగం మండలంలో 53.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. న్యాల్‌కల్ మండలం మెటల్‌కుంట - బసంతపూర్ వెళ్లే రోడ్డు వంతెన పైనుంచి వర్షం నీరు పారుతోంది. బసంత్‌పూర్, కల్‌బేమల్ గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి. సిద్దిపేట జిల్లా గజ్వేల్, నంగునూరు మండలాల్లో వర్షం పడింది.

16న హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం జరగనుంది. అదే రోజు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. ఇప్పటికే ఆ గ్రౌండ్‌ను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సోమవారం పరిశీలించింది. వేదికపై ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకగాంధీతోపాటు పలువురు సీనియర్ నేతలు కూర్చొనున్నారు. తెలంగాణలో అమలు చేయబోయే ఐదు కీలకమైన హామీలను బహిరంగ సభలో ప్రకటించడం ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం పూరించనుంది. సెప్టెంబర్ 17న తెలంగాణ రాష్ట్ర విలీన దినోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో ఈ సభకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. అందుకే భారీ సంఖ్యలో జన సమీకరణ చేయాలని పార్టీ నాయకులను ఏఐసీసీ ఆదేశాల్చినట్టు తెలిసింది.

బీజేపీ పతనం ప్రారంభమైంది : రేవంత్‌రెడ్డి

దేశంలో బీజేపీ పతనం ప్రారంభమైందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లో జరగనున్న సీడబ్ల్యూసీలో ఇండియా కూటమి గెలుపొందడానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనుందని తెలిపారు. సీడబ్ల్యూసీ సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వహించాలంటూ ఏఐసీసీకి లేఖ రాసినట్టు తెలిపారు. దానికి ఒప్పుకుని నిర్ణయం తీసుకున్నందుకు వారికి రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. రజాకార్ల చేతిలో ఖర్గే కుటుంబం చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 60 ఏండ్ల తెలంగాణ ప్రజల కలను నిజం చేసిన కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా తెలంగాణకు ఎంతో ముఖ్యమైందన్నారు.

కీలక కమిటీని ప్రకటించిన కాంగ్రెస్..

(మొదటిపేజీ తరువాయి)

మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డికి చోటు దక్కింది. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ కమిటీని ఏర్పాటు చేశారని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం తెలిపారు. ఖర్గేతో పాటు పార్టీ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అంబికా సోనీ, అధిర్ రంజన్ చౌదరి తదితరులకు చోటు దక్కింది. కమిటీలో మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అంబికా సోనీ, అధిర్ రంజన్ చౌదరి, సల్మాన్ ఖుర్షీద్, మధుసూదన్ మిస్త్రీ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీఎస్ సింగ్ డియో, కేజే జార్జ్, ప్రీతమ్ సింగ్, మొహమ్మద్ జవెద్, అమీ యజ్ఞిక్, పీఎల్ పునియా, ఓంకార్ మార్కమ్, కేసీ వేణుగోపాల్.

ఎస్సీ గురుకులాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం.. తాజాగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న 567 మంది కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గురుకులాల్లో కాంట్రాక్టు ఉపాధ్యాయులకు రెగ్యులర్ ఉపాధ్యాయులతోపాటు పీఆర్సీని అమలు చేయడంతోపాటు, 12 నెలల పూర్తి వేతనాన్ని చెల్లిస్తున్నది. ప్రభుత్వం నిర్ణయంపై కాంట్రాక్టు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎవరెన్ని ట్రిక్కులు చేసినా బీఆర్ఎస్‌దే హ్యాట్రిక్

(మొదటిపేజీ తరువాయి)

తీసుకు వస్తుందన్నారు. దక్షిణ భారతదేశంపై బీజేపీ చూస్తున్న చిన్న చూపునకు ఈ ప్రాంత ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడమే కాకుండా దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. కర్నాటకలోనే కాకుండా దక్షిణ భారతదేశంలో బీజేపీ పూర్తిగా వాష్ అవుట్ అవుతుందని చెప్పారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఆరూరి రమేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెప్టెంబర్ 5 ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశామని హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నారాయణగూడ కేశవ మెమోరియల్ పాఠశాలలోని సర్దార్ పటేల్ హాల్లో మధ్యాహ్నం 2గంటలకు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలో 81 మంది బెస్ట్ టీచర్స్‌గా ఎంపికయ్యారని, వీరి సన్మాన కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని డీఈవో కోరారు.

ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులు

- భవిష్యత్తు నిర్మాతలు.. సమాజ నిర్మాణంలో వీరిదే కీలకపాత్ర
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులు.. భవిష్యత్తు నిర్మాతలు.. సమాజ నిర్మాణంలో వీరిదే కీలక పాత్ర. అందుకే పెద్దలు మాతృ దేవోభవ.. పితృ దేవోభవ.. ఆచార్య దేవోభవ.. అంటూ తల్లిదండ్రుల తర్వాత మహోన్నత స్థానాన్ని గురువుకు ఇచ్చారు. విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో మనం సన్మార్గంలో నడవడంలో వారి పాత్ర కీలకం. భవిష్యత్‌లో ఏ స్థాయిలో ఉన్నా ఉపాధ్యాయులను గుర్తు చేసుకోవాలి. ఈ క్రమంలో భారత మాజీ రాష్ట్రపతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆయన ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన మహనీయుడు. ఈ ఏడాది ఆ వేడుకల రోజు రానే వచ్చింది. నేడు ఉపాధ్యాయ దినోత్సవం.



ఉపాధ్యాయులు కృషి వెలకట్టలేనిది..

పాఠశాలల్లో విద్యార్థుల తప్పులు సరిచేస్తూ వారిని సన్మార్గంలో నడిచేలా ప్రోత్సహించడంలో ఉపాధ్యాయుల కృషి అంతా ఇంతా కాదు. క్లాసులో అల్లరి చేస్తున్నా ఎంతో ఓపికగా పిల్లల్ని కూర్చోబెట్టి చదువు చెబుతారు. తప్పు చేస్తే తప్పు అని చెప్పి, భవిష్యత్తులో మళ్లీ చేయవద్దని చెప్పే దయా గుణం గురువులది. అంతటి గొప్ప మనసున్న టీచర్లను ఏటా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించి, ఆశీర్వాదం తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్ గడువు 30 వరకు పొడిగింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉన్నత పాఠశాలల విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా ప్రోత్సహించేందుకు కేంద్ర సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఏటా దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ ఉన్నత పాఠశాలలో 6-10వ తరగతిలో ఎంపికైన విద్యార్థులను ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ పథకం పేరుతో రూ.10 వేలు అందిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరం ఆగస్టు 31 వరకు 1007 నామినేషన్స్ నమోదు అయ్యాయని జిల్లా విద్యాశాఖధికారిణి ఆర్.రోహిణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ 2023-24 నామినేషన్స్ నమోదు చెయ్యని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ ఉన్నత పాఠశాలల నుంచి 5 నామినేషన్స్ నమోదు చేసుకోవాలని, ఇందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఐవోఎస్‌లు, జిల్లా సైన్స్ అధికారి సి. ధర్మేందర్ రావ్ బాధ్యత తీసుకొని ఈనెల 30లోపు అధిక సంఖ్యలో నామినేషన్లు నమోదు అయ్యేలా చూడాలని డీఈవో ఆదేశించారు.

ఫిర్యాదులను అధికారులు పరిష్కరించాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గం చూపాలని, ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను కలెక్టర్ చదివి వినిపించారు. వాటిని సత్వరమే పరిష్కరిం చాలన్నారు. వివిధ మండల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో జీవో నంబర్ 58, 59, గృహ లక్ష్మి పథకాలపై పురోగతిపై ఆరా తీశారు. ఏ.ఓ సునీల్, జిల్లా ప్రణాళిక అధికారి సురేందర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి యాదయ్య, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'మనబస్తీ-మనబడి' ఒక నూతన నాంది

- విద్యార్థుల సర్వతోముకాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి
- టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయ లోకానికి శుభాకాంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో మనబస్తీ-మనబడి కార్యక్రమం ద్వారా విద్యా విధానంలో ఒక నూతన నాంది పలికారు. ఉపాధ్యాయ లోకం విద్యార్థుల శ్రేయస్సు లక్ష్యంగా తమ కర్తవ్యం నిర్వహణలో నిరంతరం కృషి చేస్తున్నారు. విద్యార్థుల సర్వతోముకాభివృద్ధికి ఉపాధ్యాయులు ఎల్లవేళలా ముందుం టున్నారు. విద్యార్థుల అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రం లోని యావత్తు ఉపాధ్యాయ లోకం కృషి చేస్తున్నది. చంద్రయాన్-3లోనూ తెలుగు వారు పాల్గొనడం మనకు గర్వకారణం. రాబోయే కాలంలో అనేక మంది విద్యార్థులు ఇలాంటి గొప్ప కార్యాలలో పాల్గొనడానికి ఉపాధ్యాయులు వారి వంతు ప్రయ త్నం చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం తోడ్పాటు కూడా ఎంతో అవసరం. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని, జిల్లాలోని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు.

విద్యార్థుల హృదయాన్ని గెలిచిన 'మేరీ'



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, ముఖ్యంగా పేద పిల్లలకు ఇంగ్లీషులో పట్టుత్వం రావడానికి ఎంతో కృషి చేస్తున్న టి.హృదయమేరి 2000 డీఎస్సీ ద్వారా జీయూపీఎస్ రహీంపురాలో చేరారు. అక్కడ సుమారు 9 ఏండ్లు తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ, అహర్నిశలు విద్యార్థులు అన్నివిధాల అభివృద్ధికి పాటు పడ్డారు. అలాగే పాఠశాలలో ఉన్న హాస్టల్ విద్యార్థులకు తినుబండారాలు, బట్టలు వీలైన తన సహాయాన్ని చేసేవారు. పిల్లలు కూడా తనని ఎంతగానో అభిమానిం చేవారు. తర్వాత జీపీఎస్ ఆజాంపురలో రెండేండ్లు విద్యార్థులకు ఇంగ్లీష్ బోధించడమే కాకుండా ఇన్‌చార్జి హెచ్‌ఎంగా కూడా బాధ్యతలు చేపట్టారు. తర్వా త జీపీఎస్ సబ్జీమండిలో నాలుగేండ్లు విద్యార్థులకు బోధించి విద్యార్థులను సహా య ఉపాధ్యాయులతో కలిసి విహారయాత్రలకు వెళ్లడం వంటి ప్రత్యేక కార్యక్ర మాలు చేపట్టారు. జీపీఎస్ డీఎస్ నగర్‌లో 2015లో చేరి ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ.. ఏక ఉపాధ్యాయురాలుగా అన్ని పనులు చేయడమే కాకుం డా విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. తర్వాత జీపీఎస్ మాదన్న పేటలో ఒక సంవత్సరం పాటు పనిచేసిన ఆమె 2019లో జీపీఎస్ కాలాడేరాకి వచ్చి ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. కాలాడేరా ప్రధానో పాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి నాయకత్వంలో ఉపాధ్యాయుల సహకా రంతో విద్యార్థులకు అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి ఎంపికైన శు భసందర్భంగా ఆమెకు పాఠశాల హెచ్‌ఎం మందడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఆహార సంక్షోభం తప్పదా?

- అనుకూలించని వాతావరణం
- అతివృష్టి, అనావృష్టితో అన్నదాత కుదేలు
- తోడవుతున్న ఎల్‌నినో ప్రభావం



న్యూఢిల్లీ : దేశంలో ఆహార సంక్షోభం తప్పేలా లేదు. అననుకూల వాతావరణ పరిస్థితులే దీనికి కారణం. తొలకరి వర్షాలు పడిన తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. ఆగస్టు నెల మొత్తం 'కరువు' పరిస్థితిని గుర్తుకు తెచ్చింది. ఏ ప్రాంతంలోనూ వర్షాలు సరిగా పడలేదు. భూములు నెర్రెలు బారాయి. పంటలు ఎండిపోయాయి. రైతులు ఆశతో ఆకాశం వైపు ఎదురు చూసినా నిరాశే మిగిలింది. 1901వ సంవత్సరం తర్వాత ఆగస్టు నెలలో ఇంతటి తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొనడం దేశంలో ఇదే తొలిసారి. ప్రస్తుతం దేశంలో ఎల్‌నినో ప్రభావం నడుస్తోంది. అందుకే రుతుపవనాలు ప్రవేశించినా సరైన వర్షం పడలేదు. రాబోయే రోజులలో కరువు పరిస్థితులు ఏర్పడతాయని, ఆహార భద్రతా సమస్యలు ఉత్పన్నమవుతాయని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్ట్ నెలలో దేశంలో సాధారణం కంటే 36% తక్కువగా వర్షపాతం నమోదైంది. దక్షిణ ప్రాంతంలో అయితే సగటు వర్షపాతంలో 60% లోటు కన్పించింది.

ఓ వైపు ఆనందం...మరోవైపు ఆందోళన

సెప్టెంబర్ నెల ఆశాజనకంగానే ప్రారంభమైంది. అనేక రాష్ట్రాలలో విస్తారంగా వానలు కురుస్తున్నాయి. రైతులు సంబర పడుతున్నారు. ఈ నెలలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ కూడా తీపి కబురు చెబుతోంది. అయితే బియ్యం ఎగుమతులపై నిషేధం, కూరగాయలు, ఇతర ఆహార ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాలు వంటి అంశాలు ప్రతికూల ప్రభావం చూపుతాయి. అందుకే ఆహార భద్రతా సంక్షోభం ఏర్పడుతుందేమోనని పాలకులు సైతం భయపడుతున్నారు.

ఒకవేళ సెప్టెంబర్‌లో కూడా వర్షాలు సరిగా పడకపోతే వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమవుతాయి. ఖరీఫ్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రబీ సీజన్ పరిస్థితి ఏమిటన్నది మరింత ఆందోళన కలిగిస్తోంది. ఎందుకంటే గత రెండు సీజన్లలో రబీ పంటల సాగు, దిగుబడి సగటు కంటే తక్కువగానే ఉన్నాయి. మరోవైపు దేశంలో ఆహార నిల్వలు అడుగంటుతున్నాయి. దీంతో పాలకులు, రైతులు రుతుపవనాల సీజన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

సానుకూలత ఏది?

ఏదేమైనా దేశం ఆహార సంక్షోభం వైపు పయనిస్తోందన్న మాట మాత్రం వాస్తవం. చాలా కాలం నుండి దేశంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవు. రుతుపవనాలు సానుకూలంగా లేకపోవడం, వరదలు, తుపానులు వంటి ప్రతికూలతలు ఎదురవడం దీనికి కారణం. దీనికితోడు 2020లో పంటలపై మిడతలు దాడి చేయడంతో రైతులకు భారీగా నష్టం వచ్చింది. గత మూడు దశాబ్దాల కాలంలో ఇంత పెద్ద ఎత్తున మిడతల దాడి ఎన్నడూ జరగలేదు. 2021లో దేశంలోని ఆరు రాష్ట్రాలలో వర్షపాతం సగటు కంటే తక్కువగా నమోదు కాగా 12 రాష్ట్రాలలో అధిక వర్షపాతం నమోదైంది. దేశంలోని 703 జిల్లాలలో 40% జిల్లాలలో మాత్రమే సగటు వర్షపాతం నమోదైంది. 2015-21 మధ్యకాలంలో వరదలు, అధిక వర్షాల కారణంగా 33.9 మిలియన్ హెక్టార్లలోనూ, కరువు పరిస్థితుల కారణంగా 35 మిలియన్ హెక్టార్లలోనూ పంటలకు నష్టం వాటిల్లింది.2022 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం దిగుబడి 6% తగ్గింది. ఉత్తర భారతదేశంలో రబీ గోధుమ పంట దిగుబడి 13.5% తగ్గిపోయింది. దీంతో ప్రభుత్వం గోధుమ ఎగుమతులపై నిషేధం విధించింది. 2020-21తో పోలిస్తే 2021-22లో వ్యవసాయ రంగంలో అభివృద్ధి మందగించిందని, వాతావరణ మార్పులే దీనికి కారణమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో అంగీకరించారు కూడా. 2022-23 రబీ సీజన్‌లో సైతం పరిస్థితిలో మార్పు లేదు. దేశంలోని పలు ప్రాంతాలలో సకాలంలో వర్షాలు పడలేదు. ఆ తర్వాత బైపర్‌జాయ్ తుఫాను వచ్చి పంటలను సర్వనాశనం చేసింది. ఇప్పుడేమో టమాటా నుండి ఉల్లి వరకూ కూరగాయల ధరలు పెరిగి అధిక ద్రవ్యోల్బణానికి కారణమవుతోంది. చివరికి పశుగ్రాసం ధరలు కూడా పెరుగుతున్నాయి.

నల్లజాతి గర్భిణి కాల్చివేత

- అమెరికా పోలీసుల దురహంకారం

వాషింగ్టన్ : నల్లజాతి వారిపై తెల్ల పోలీసుల దురహంకార చర్యలకు తాజాగా మరో వ్యక్తి బలయ్యారు. దొంగతనానికి పాల్పడ్డారని అనుమానించిన కేసులో గర్భవతి అయిన 21ఏళ్ల నల్లజాతి మహిళను ఓహియో పోలీసులు కాల్చి చంపారు. గత నెల 24న ఈ ఘటన జరిగింది. తకియా యంగ్‌గా బాధితురాలిని గుర్తించారు. కారులో నుండి బయటకు వచ్చేందుకు ఆ యువతి తిరస్కరించడంతో ఒక పోలీసు అధికారి ఆమెపై కాల్పులు జరిపినట్లు ఓహియో పోలీసులు విడుదల చేసిన వీడియోలో కనిపిస్తోంది. ఆమె చౌర్యానికి పాల్పడిందని ఆ పోలీసు అధికారి అనుమానించాడని, ఇంటరాగేషన్ కోసం కారు నుంచి ఆమెను బయటకు రావాల్సిందిగా కోరాడని కొన్ని మీడియా వార్తలు పేర్కొన్నాయి. నల్ల సీడాన్ కారులో కూర్చున్న ఆ యువతిని బయటకు రావాల్సిందిగా పోలీసు అధికారి పదే పదే పట్టుబట్టడం బ్లెండన్ టౌన్‌షిప్ పోలీసు విభాగం విడుదల చేసిన వీడియోలో కనిపిస్తోంది. ఆమె బయటకు రావడానికి తిరస్కరించింది.

దాంతో వారిమధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. 'నువ్వు దొంగతనం చేశావు, ఇక్కడ నుంచి వెళ్లలేవు' అని ఆ పోలీసు అధికారి పేర్కొనగా, నేను దొంగతనం చేయలేదంటూ ఆ యువతి తిరస్కరించింది. ఈలోగా పోలీసు అధికారుల్లో ఒకరు కారును ఆపి, తన తుపాకిని తీసి ఆమెను బయటకు రావాల్సిందిగా బెదిరించాడు. ఆ యువతి కారు స్టార్ట్ చేయడానికి ప్రయత్నించగానే వెంటనే ఆ అధికారి కాల్పులు జరిపాడు.

ఆ వెంటనే కారు ముందుకు దూసుకెళ్లి కిరాణా దుకాణం గోడను కొట్టుకుని ఆగిపోయింది. నవంబరులో ఆమె బిడ్డకు జన్మనివ్వనుంది. అధికారాన్ని దుర్వినియోగం చేసి తకియాయంగ్‌ను చంపేశారంటూ ఆమె కుటుంబ సభ్యులు విమర్శించారు. మొత్తం వీడియోను చూస్తే పోలీసు అధికారుల మితిమీరిన వ్యవహార శైలి కనిపిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



'రెరా'లో రిజిస్టర్ అవ్వండి

- మరో మూడు సంస్థలకు నోటీసులు
- చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రియల్ ఎస్టేట్ యాజమాన్యాలు తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్స్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్‌రెరా)లో తప్పనిసరిగా రిజిస్టర్ అవ్వాలని ఆ సంస్థ చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ చట్టంలోని నిబంధనలు ఉల్లంఘించిన మరో మూడు ప్రాజెక్టులకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. 15 రోజుల్లో ఈ నోటీసులకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందనీ, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

షాద్‌నగర్ సమీపంలోని చెరుకుపల్లి, కొందుర్గ్‌లో స్వర్గసీమ శాండిల్ ఉడ్ ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్, స్వర్గసీమ సుకేతన పేరుతో నివాస ప్లాట్లు విక్రయించే వెంచర్లు చేపట్టి, రెరా రిజిస్ట్రేషన్ లేకుండా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టడంపై షోకాజు నోటీసు జారీ చేశామని తెలిపారు.

మాదాపూర్‌లోని సాలార్ పురియా సత్వా నాలెడ్జ్ పార్కులో కార్యాలయాన్ని కలిగి ఉన్న జేఎల్‌ఎల్ నిర్మాణ సంస్థ రెరా రిజిస్ట్రేషన్ పొందకుండా రియల్ ఎస్టేట్ వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనీ, ఆ సంస్థకూ నోటీసులు ఇచ్చామన్నారు. మహేశ్వరం, తుక్కాపూర్ గ్రామం, శ్రీనగర్ ప్రాంతాల్లో ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ 14 ప్రాంతంలో కాంస్టెల్లా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు రెరా రిజిస్ట్రేషన్ కలిగి ఉండీ, తమ ప్రకటనల్లో ఆ రిజిస్ట్రేషన్ నెంబర్‌ను చూపకుండా ప్రచారం చేస్తున్నందున వారికి కూడా షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ లేదా 8 అంతకు మించి విస్తీర్ణంలో నిర్మించే అపార్ట్‌మెంట్లకు రెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. సామాన్యుల కష్టార్జితానికి, వారి సొంత ఇంటి కలలకు 'రెరా' భద్రతనిస్తుందని తెలిపారు.

మహిళలు, బాలల రక్షణపై సంయుక్త కార్యాచరణ

- మహిళా భద్రతా విభాగం, బీబీఏల మధ్య ఒప్పందం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో మహిళలు, బాలలపై లైంగికదాడులు జరగకుండా చూసేందుకు పకడ్బందీగా సంయుక్త కార్యచరణను రూపొందించి అమలు చేయాలని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం, బచ్‌పన్ బచావో ఆందోళన్(బీబీఏ) సంస్థలు నిర్ణయించాయి. ఈ మేరకు ఈ రెండు విభాగాల మధ్య డీజీపీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఒప్పందం కుదిరినట్టు అదనపు డీజీ షికా గోయెల్ తెలిపారు.

ముఖ్యంగా, మహిళలు, బాలికలు మానవ అక్రమ రవాణా చేసేవారి బారిన పడకుండా చూడటంలోనూ, లైంగిక వేధింపులకు గురి కాకుండా చూడటానికి బీబీఏ సంస్థతో కలిసి నిర్ణయిస్తున్న సంయుక్త కార్యచరణ మంచి ఫలితాలనిస్తున్నాయని ఆమె అన్నారు. లైంగికదాడులకు గురవుతున్న మహిళలు, బాలికలను రక్షించటం, వారికి న్యాయస్థానం నుంచి తగిన న్యాయం జరిగేలా చూడటానికి అవసరమైన సహాయాన్ని అందించటం, బాధిత మహిళలకు అవసరమైన ఉద్యోగాలను కల్పించటం, ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సాయం వారికి లభించేలా చూడటం వంటి కార్యకలాపాలను ఈ రెండు విభాగాలు సంయుక్తంగా చేపడుతున్నాయని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటి వరకు దాదాపు 800 మంది బాలికలు, మహిళలను రక్షించటం, వారిలో కొందరిని పునరావాస కేంద్రాలకు తరలించటం, వారిలో కొందరికి జరిగిన అన్యాయానికి కోర్టుల నుంచి న్యాయాన్ని సాధించటం, దాదాపు రూ.28 లక్షలకు పైగా ఆర్థిక సాయాన్ని అందించటం జరిగిందని షికా గోయెల్ తెలిపారు.

ప్రభుత్వ ప్రాజెక్టుగా అదానీ విద్యుత్!

- శ్రీలంక ప్రయత్నాలు

కొలంబో : శ్రీలంకలోని ఉత్తర ప్రావిన్స్‌లో పునర్వినియోగ ఇంధన ప్రాజెక్టును అమలు చేయడానికి అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రెండు ప్రభుత్వాలు భారత్, శ్రీలంకల మధ్య కుదుర్చుకున్న ఒప్పందంగా మార్చాలని శ్రీలంక ఇంధన శాఖ మంత్రి కోరినట్లు శ్రీలంక మీడియా తెలిపింది. మన్నార్‌లో 40కోట్ల అమెరికన్ డాలర్ల విలువైన, 500 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు కోసం అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌తో కుదిరిన ఒప్పందాన్ని రెండు ప్రభుత్వాల మధ్య కుదుర్చుకున్న ఒప్పందంలా మార్చాలని గత నెలలో శ్రీలంక కేబినెట్ కోరిందని కొలంబో నుంచి వెలువడే వార్తాపత్రిక ది సండే టైమ్స్ ఆదివారం పేర్కొంది. ఇటీవల శ్రీలంక విద్యుత్, ఇంధన శాఖ మంత్రి కంచనా విజిశేఖర ఈ మేరకు ఒక మెమొరాండాన్ని రూపొందించారు.

ఇదిలావుండగా, మన్నార్, పూనిరియాన్‌ల్లో పునర్వినియోగ ఇంధన అభివృద్ధి ప్రాజెక్టును అదానీ గ్రూపునకు ఇవ్వాలన్న నిర్ణయంపై కొన్ని వర్గాలు ఆందోళన వ్యక్తం చేసినట్లు ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్ ఫస్ట్ పేర్కొంది. అంతర్జాతీయ జర్నలిస్టుల నెట్‌వర్క్ అయిన ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఒసిసిఆర్‌పి) నిర్వహించిన దర్యాప్తు నేపథ్యంలో అదానీ గ్రూపుపై అంతర్జాతీయ మీడియా పరిశీలన జరుగుతున్న సమయంలోనే ఈ వార్తలు వెలువడ్డాయి.

10 వరకు బీజేపీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేయాలనుకొనే ఆశావహుల నుంచి ఈనెల 10వ తేదీ వరకు నాంపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమైందనీ, దరఖాస్తుల స్వీకరణకు రాష్ట్ర కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మాజీ శాసనమండలి సభ్యులు రంగారెడ్డి, హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ జీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం ఈ దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అనంతరం వీటి స్క్రీనింగ్ కోసం రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పాటు చేస్తామని వివరించారు. స్క్రీనింగ్ చేసిన జాబితాను జాతీయ కమిటీకి పంపుతామన్నారు.

జమిలిపై ఎందుకంత ఉలికిపాటు?

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జమిలి ఎన్నికలంటే రేవంత్ రెడ్డికి ఎందుకంత ఉలికిపాటు... అభద్రతాభావం అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే లక్ష్మణ్ ప్రశ్నించారు. సోమవారంనాడిక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోడీ చరిష్మాను జీర్ణించుకోలేకే కాంగ్రెస్ విషప్రచారం చేస్తున్నదని విమర్శించారు. 1952 నుంచి 1967 వరకు నాలుగుసార్లు జమిలి ఎన్నికలు జరిగాయనీ, అప్పుడెందుకు కాంగ్రెస్ సమర్థించిందని ప్రశ్నించారు. ఆనాడు కాంగ్రెస్ తన ఉనికిని కాపాడుకోవడానికే ఈ పని చేసిందా అని అడిగారు. దక్షిణాది, ఉత్తరాది అంటూ కాంగ్రెస్ ఆనాడు లేని ప్రస్తావనను ఇప్పుడు ఎందుకు చేస్తున్నదని ప్రశ్నించారు. జమిలి ఎన్నికలపై కేంద్రం నియమించిన కమిటీలో ప్రతిపక్ష నాయకుడిగా అధిర్ రంజన్‌కి అవకాశం కల్పిస్తే కాంగ్రెస్ ఎందుకు పారిపోతున్నదని అడిగారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఆ రాష్ట్ర మంత్రి ఉదయనిధి మారన్ సనాతన ధర్మంపై విద్వేషపూరితంగా, అవమానకరంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సనాతన ధర్మం మలేరియా, డెంగ్యూ వంటిదనీ, ఆ ధర్మాన్ని నిర్మూలించాలనీ, నాశనం చేయాలని వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అన్నారు. తమిళనాడు ప్రభుత్వ అధికారిక చిహ్నంలోనే ఆలయం ముద్రణ ఉందనీ, దమ్ముంటే ఆ చిహ్నాన్ని తీసేయాలని సవాల్ విసిరారు. మందిరాలు, ఆలయాల నుంచి వచ్చే ఆదాయంతో ఖజానా నింపుకునే తమిళనాడు ప్రభుత్వం హిందూ ధర్మం గురించి నీచంగా వ్యాఖ్యలు చేయడం దారుణమని విమర్శించారు.

భద్రతా ప్రమాణాలు పాటించండి


ద.మ.రైల్వే జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైళ్ల నిర్వహణలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సోమవారంనాడిక్కడి రైల్ నిలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలోని విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్‌ఎంలు), లాలాగూడ, తిరుపతి చీఫ్ వర్క్ షాప్ మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, సిబ్బందికి ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ ఇవ్వాలని చెప్పారు. తనిఖీలు ముమ్మరం చేయాలనీ, సిమెంట్, ఆహార ధాన్యాలు, బొగ్గు ఇతర వస్తువుల లోడింగ్‌పైనా దృష్టిపెట్టి, భద్రతా చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అలాగే రైళ్ల సగటు వేగాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహతో..

ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య భేటీ



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

మాజీ ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దామోదర రాజనర్సింహతో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య రహస్యంగా భేటీ అయినట్టు వస్తున్న వార్తలతో రాజకీయ సహచరుల్లో చర్చ మొదలైంది. హన్మకొండ జిల్లా నయీంనగర్‌లోని ప్రెసిడెంట్ దాబాలో మాదిగ ఇంటలెక్చువల్స్ సదస్సు సోమవారం జరిగింది. ఈ సదస్సులో పాల్గొనేందుకు దామోదర రాజనర్సింహతో పాటు తాటికొండ రాజయ్య సైతం హోటల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎదురుపడిన వారిద్దరూ మర్యాదపూర్వకంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం హోటల్‌లో రహస్యంగా రాజనర్సింహతో రాజయ్య సుమారు 45 నిమిషాల పాటు భేటీ అయినట్టు తెలుస్తోంది. ఈ ఫోటోలు వైరల్ కావడంతో ఇప్పటికే స్టేషన్‌ఘన్‌పూర్ టిక్కెట్టు ఆశించి భంగపడ్డ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కాంగ్రెస్‌లోకి వెళుతున్నారనే అనుమానాలు రాజకీయ అనుచరులకు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.

'మున్నేరు'కు అడ్డుగోడ

- రూ.692 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల
- నదికి ఇరువైపులా 8.5 కి.మీ పొడవునా ఆర్‌సీసీ వాల్
- 10 మీ. ఎత్తుతో పోలేపల్లి నుంచి ప్రకాశ్‌నగర్ వరకు నిర్మాణం
- మధ్యలో రెండు మీటర్ల ఎత్తుతో మూడు చెక్‌డ్యామ్‌లు!
- 3.5 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఆధారంగా డిజైన్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మున్నేరు వరదల నుంచి ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండల వాసులకు విముక్తి లభించింది. రూ.692.5 కోట్లతో ఆర్‌సీసీ (రెయిన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్) వాల్ నిర్మాణానికి ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. దీని ప్రతులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విలేకరులకు పంపిణీ చేశారు. ఈ వాల్ నిర్మాణం, దీని ప్రత్యేకతల గురించి వివరించారు. వరదలు వచ్చిపోయిన నెలరోజుల వ్యవధిలోనే శాశ్వత పరిష్కారం చూపుతున్నట్టు ప్రకటించారు. బీఆర్‌ఎస్ హయాంలో రెండేండ్ల కిందట ఖమ్మం నగర పాలక సంస్థ ఎన్నికల సందర్భంగా మొదలైన మున్నేరుపై అడ్డుగోడ హామీ ప్రస్థానం అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తున్న వేళైనా నెరవేరుతుండటంపై పరివాహక ప్రాంత వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మొత్తానికి మున్నేరుకు మహర్దశ..

రెండున్నరేండ్ల క్రితం మున్నేరుపై కరకట్ట నిర్మాణానికి రూ.146 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. కానీ అది ఆచరణకు నోచుకోకపోవడంతో జులై 27, 2023 ఖమ్మం మున్నేరు పరివాహక ప్రాంతాన్ని వరద అతలాకుతలం చేసింది. మొత్తంగా నగరంలోని దాదాపు ఆరేడు డివిజన్లు, ఖమ్మం రూరల్ మండలంలో నాలుగు పంచాయతీల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉండటంతో పలువురు నిరాశ్రయులయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వచ్చిన ఈ వరదల పుణ్యమాని.. ప్రభుత్వం ఆగమేఘాల మీద స్పందించింది. కరకట్ట నిర్మించకపోతే జిల్లాలోని రెండు జనరల్ నియోజకవర్గాలు ఖమ్మం, పాలేరు ఫలితాలపై ఆ ప్రభావం ఉంటుందని భావించి వేగంగా నిర్ణయం తీసుకుందన్న ప్రచారం జరుగుతున్నది. కరకట్టకు బదులు ఆర్‌సీసీ వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం తాజాగా రూ.692.5 కోట్లు మంజూరు చేస్తూ విడుదల చేసిన జీవోను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంత్రిగా తన నాలుగేండ్ల ప్రస్థానం సందర్భంగా సోమవారం మీడియాకు రిలీజ్ చేశారు. మరో నెలరోజుల్లో ఆర్‌సీసీ వాల్ పనులు ప్రారంభమవుతాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. 2006లోనూ ఇలాగే వరదలు వచ్చినా ఇంతగా నష్టం వాటిల్లలేదు. ఈసారి భారీ నష్టం ఉండటంతో ప్రభుత్వం స్పందించడంపై మున్నేరు పరివాహక ప్రాంత వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మున్నేరు వరదలు.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై 'నవతెలంగాణ' అనేక కథనాలు రాసింది. ఇందుకుగాను స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

కేసీఆర్ హామీలు పక్కాగా అమలు చేయాలి

- ప్రజలను మభ్యపెట్టేందుకే కొత్త తాయిలాలు
- మొద్దు నిద్ర వీడాలంటూ సీఎంకు హితవు : మహాధర్నాలో బీఆర్‌ఎస్ పాలనపై టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ విమర్శ



నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ పరిపాలన తీరు నేడు ఎద్దు మీద వానపడ్డట్టుగా ఉందని తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నర సంవత్సరాలు దాటినా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా సోమవారం తెలుగుదేశం ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు మహాధర్నా నిర్వహించారు. మధ్యాహ్నం ప్రారంభమైన ధర్నా వర్షం పడుతున్నా కొనసాగింది.రాష్ట్ర నలుమూలల నుంచి ధర్నాకు టీడీపీ శ్రేణులు హాజరయ్యాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ హామీలు పక్కాగా అమలుచేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ప్రజలకు వాగ్దానం చేసిన హామీలను మర్చిపోయి మొద్దు నిద్రలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిపించేందుకే మహాధర్నాను చేపట్టినట్టు చెప్పారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ పాలన ఎలాంటిదో మీడియా చూసిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎవరైనా నాయకులు, కార్యకర్తలపై మీడియాలో అవినీతి, ఆరోపణల వార్తలు వస్తే, వెంటనే విచారణ కమిటీ వేసి నివేదిక ఆధారంగా బాధ్యులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు ఉండేవన్నారు. ఇప్పటిదాకా కట్టని డబల్ బెడ్‌రూం ఇండ్లు, ఇప్పుడు కట్టిస్తానని చెప్పడం సరికాదన్నారు. నాడు లక్షల్లో నిర్మిమన్నారు, కనీసం వేలల్లో కూడా ఇండ్లు కట్టకపోవడం దారుణమని విమర్శించారు. . పేద ప్రజల కోసం కట్టిన ఇండ్లను పంచకుండా, ఎన్నికలకు రెండు నెలల ముందు ఓట్ల కోసం పంచుతున్నారా ? ప్రశ్నించారు. ఎక్కడ చూసినా అభివద్ధి పనులకు శిలాఫలకాలు వేస్తున్నారనీ, కానీ రాష్ట్ర బడ్జెట్ జీరోనేనని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా ప్రజలు నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ హయాంలో బీదలకు పక్కా ఇండ్లు, జనతా వస్త్రాలు, రెండు రూపాయలకు కిలో బియ్యం, సబ్సిడీ విద్యుత్, మహిళలకు ఆస్తి హక్కు, గురుకుల పాఠశాలలు, ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థిక వనరులు పెంచింది తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడేనని, మున్సిపాలిటీల్లో మిగులు బడ్జెట్ ఉండేలా ప్రణాళికలు రూపొందించిన ఘనత ఆయనదేనని అభిప్రాయపడ్డారు. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి టి.జ్యోత్స్న జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీడీపీ ఎప్పుడు అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పోరాడుతున్నదన్నారు. టీడీపీ నాయకుల పార్టీ కాదు, కార్యకర్తల పార్టీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి, పథకాల తెచ్చి నెరవేర్చకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మహాధర్నాలో తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు కాట్రగడ్డ ప్రసూన, సామా భూపాల్ రెడ్డి , మూర్తి, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కిలి ఐలయ్య యాదవ్, గంగాధర్ రావు, ముప్పిడి గోపాల్ ,ఆరీఫ్, జీవీజీ నాయుడు , బండారు వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధికార ప్రతినిధులు సూర్యదేవర లత, రామేశ్వర రావు, శ్రీనివాస్ నాయుడు, బిల్డర్ ప్రవీణ్, ఎస్వీ కష్ణ ప్రసాద్, అనూప్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు యం.బిక్షపతి ముదిరాజ్ , సంధ్య పోగు రాజశేఖర్ ,పుట్టి రాజు,రవీంద్రా చారి, సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు భవనం షకీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీపీసీసీ అత్యవసర సమావేశం

మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈనెల 16,17 తేదీల్లో సీడబ్ల్యూసీ సమావేశాలు హైదరాబాద్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం టీపీసీసీ అత్యవసర విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

గాంధీభవన్‌లో ఫ్లెక్సీ కలకలం

ఎల్బీనగర్ ఫ్లెక్సీల వార్‌కు గాంధీభవన్ వేదికైంది. రెండు వర్గాలతో క్యాడర్ అయోమయానికి గురవుతున్నది. కాంగ్రెస్ పార్టీ పేరుతో గాంధీభవన్ వద్ద 'మధుయాష్కీగౌడ్ ఎల్బీనగర్‌కు రావొద్దు. తిరిగి నిజామాబాద్‌కు పోవాలి' అనే పోస్టర్లు వెలిశాయి. పోస్టర్లు ఏర్పాటుతో రాజకీయ కలకలం రేపుతున్నది. ఈ విషయంపై తనకు ఎలాంటి సంబంధం లేదంటూ ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లో తనకు సర్వేలన్ని అనుకూలంగా ఉన్నాయనీ, ఇలాంటి చిల్లర చేష్టలు తనను ఏమీ చేయలేవని తెలిపారు. ఈ స్థానం నుంచి తనకే ఎక్కువగా గెలుపు అవకాశాలు ఉన్నాయన్నారు. తన గెలుపు కోసం నియోజకవర్గంలో పని చేసుకుంటున్నాననీ, ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో మరోసారి వర్గ విభేదాలు రచ్చకెక్కాయి.

పీఈసీ సభ్యులతో స్క్రీనింగ్ కమిటీ విడివిడిగా భేటీ

తమ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలంటూ కాంగ్రెస్ పార్టీకి దరఖాస్తుల పరిశీలన ముగిసిన నేపథ్యంలో స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించింది. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ (పీఈసీ) సభ్యులతో స్క్రీనింగ్ కమిటీ విడివిడిగా భేటీ అయింది. ఈమేరకు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వి.హనుమంతరావు, జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య తదితరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాత్రం పార్టీ కోసం కష్టపడిన నాయకులకు సముచిత స్థానం కల్పించాలంటూ లేఖ ఇచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేతలకు టికెట్లు ఇవ్వాలని కోరుతూ స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ మురళీధర్‌కు మానవతారాయ్, కొనగాలి మహేష్, బాలలక్ష్మి, విజయ్ వినతిపత్రం సమర్పించారు.

వడ్డెర బస్తీలో ఘనంగా బోనాల వేడుకలు



నవతెలంగాణ- సంతోష్ నగర్

డివిజన్ పరిధిలోని దామోదర్ సంజీవయ్య నగర్ వడ్డెర బస్తీలో సోమవారం ఘనంగా బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు యాకుత్‌పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత అమ్మవారి ఘట్టాల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి'



నవతెలంగాణ -సంతోష్ నగర్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. రాజరాజేశ్వరి నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ శంకుస్థాపన చేసి మాట్లాడారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, కాలనీ సభ్యులు శివ, జమున, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ- ఎల్బీనగర్

ప్రస్తుతం పడుతున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎల్బీనగర్ సర్కిళ్ళ డిప్యూటీ కమిషనర్లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే శానిటేషన్ జవాన్లు కూడా నాలాల వద్ద పని చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా కరెంటు వైర్లకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలను కొట్టేయాలని సూచించారు. అత్యధిక వర్షపాతం ఉన్నందున ప్రజలెవరూ బయటకు రావద్దని కోరారు. ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే డీఆర్ఎఫ్ బృందాలను ప్రతి ప్రాంతంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సమయంలో సమస్యలు చెప్పుకోవడానికి ప్రజలు చేసే ప్రతి ఒక్క ఫోన్ కాల్‌కు స్పందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ సర్కిళ్ళ డిప్యూటీ కమిషనర్లు దశరథ, రవీందర్ రెడ్డి, అరుణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు

- ఎమ్మెల్యే అహ్మద్ బలాల



నవతెలంగాణ- సంతోష్ నగర్

మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని మలక్‌పేట్ నియోజక వర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. డివిజన్ గుడిబౌలి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సాలార్ ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని సోమవారం కార్పొరేటర్ సాలంషాహిద్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఉచిత శిక్షణ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా ఇంచార్జి నజియా, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల దినోత్సవం రేపటి తరానికి మార్గదర్శకం

- ఉప్పల శ్రీనివాసగుప్త



నవతెలంగాణ- నాగోల్

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా జరుపుకుంటున్న ఉపాధ్యాయుల దినోత్సవం రేపటి తరానికి చక్కటి మార్గదర్శకం కావాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాసగుప్త అన్నారు. కేఎస్ ఆర్ సైకిల్ ఈవెంట్స్ ఫౌండర్ నాగరాజ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా సోమవారం సిక్స్ లెంత్ సెంట్రల్ వాటర్ బోర్డు వద్ద తెలంగాణ హిస్టారికల్ రన్ అండ్ సైకిలింగ్ రైడ్‌లో ప్రతిభ కనబర్చిన ఆర్కేనగర్‌లోని సెంట్ అరోనాల్డ్స్ పాఠశాల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై మాట్లాడారు. సమాజాభివృద్ధికి విద్యయే మూలం' అనే మహనీయుల స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గురుకుల విద్య దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశానికే తెలంగాణ విద్య తలమానికంగా నిలబడాలన్నది సీఎం కేసీఆర్ సంకల్పం అని పేర్కొన్నారు. అటువంటి సంకల్పాన్ని నెరవేర్చే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అర్చన దామోదర్ కౌన్సిలర్, పాఠశాల ప్రిన్సిపల్ ఎస్కే హుస్సేన్, ఉపాధ్యాయులు, వందేమాతరం ఫౌండేషన్, ఉప్పల ఫౌండేషన్, సుజనా హోమ్స్, విజయ డెంటల్, యశోద హాస్పిటల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు దేశానికే గర్వకారణం



తెలంగాణ రాష్ట్రంలో చేనేత కార్మిక సోదరులు నేస్తు న్న చేనేత వస్త్రాలు దేశానికే గర్వకారణమని రాష్ట్ర పర్యా టక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస గుప్తా అన్నారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించి..చేనేత కుటుంబాలకు అండగా నిలుద్దాం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేనేత రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. బాధ్యత గల పౌరులందరూ వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు. తద్వారా చేనేత వస్త్రాల కొనుగోళ్లు పెరిగి..నేత కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు.

గెలిచే అవకాశాలు నాకే ఎక్కువ : జక్కిడి



నవతెలంగాణ-హయత్ నగర్

వచ్చే ఎన్నికల్లో ఎల్బీనగర్ నుండి గెలిచే అవకాశాలు తనకే ఎక్కువగా ఉన్నాయని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ పేరుతో గాంధీ భవన్ వద్ద కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మధు యాష్కీ గౌడ్ ఎల్బీనగర్‌కు రావొద్దని వెలిసిన పోస్టర్లకు తనకు ఎలాంటి సంబంధం లేదని వివరించారు. సేవ్ ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ప్లీజ్ సే నో టికెట్ టూ ప్యారాశుట్స్ గో బ్యాక్ అంటూ మధు యాష్కీని ఉద్దేశించిన దానిలో తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. 35 ఏండ్ల నుంచి స్థానికంగా ఉంటూ ఒకే పార్టీలో కొనసాగుతూ, స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నందున తానే గెలుస్తానన్న భయంతో తనపై రాజకీయంగా ఎదుర్కోలేక బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండి పడ్డారు. నాపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట డివిజన్ అధ్యక్షుడు బుడ్డా సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

'అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించాలని వినతి'



నవతెలంగాణ- బడంగ్ పేట్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించాలని టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆలిండియా కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్, ఎంపీ మురళీధరన్, స్క్రీనింగ్ కమిటీ మెంబర్ బాబా సిద్ధికి, ప్రోటోకాల్ కమిటీ చైర్మన్ వేణుగోపాలరావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌లను మర్యాదపూర్వకంగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ.. ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారని మండి పడ్డారు. అధికార పార్టీ పై ప్రజలకు విశ్వాసం కోల్పోయిందని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీని ఓడించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొనిరావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశా భావం వ్యక్తం చేశారు.

ఎన్‌హెచ్ ఆర్ఎస్ జేసీ వైస్ చైర్మెన్‌గా యాదవ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్(ఎన్ హెచ్ ఆర్ఎస్ జేసీ) తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా వంగూరి యాదవ రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర చైర్మన్ సగ్గు వేణుమాధవ్ ఆయనకు నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ యూత్, చిల్డ్రన్స్, స్టూడెంట్స్, వర్కర్స్, ఉద్యోగులు, మహిళల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. 20 ఏండ్లుగా హ్యూమన్ రైట్స్ కమిషన్ లో పనిచేశానని, గతంలో జస్టిస్ సుభాషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంతోమందికి అండగా ఉన్నామని తెలిపారు. అనంతరం నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ మెహతాబ్ రాజ్, మహిళా అధ్యక్షురాలు సరస్వతి, ప్రధాన కార్యదర్శి వెంకన్న బాబు, వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్, శ్రవణ్ కుమార్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అత్యాధునిక ఐవీఎఫ్ చికిత్సతో సతానం



శుభ ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభించిన విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - వనస్థలిపురం

వివాహం తర్వాత కొన్ని సమస్యలతో తల్లి కానీ వారికి అత్యాధునిక ఐవీఎఫ్ చికిత్సతో సతానం అందించేందుకు 'శుభ ఫెర్టిలిటీ' ముందుకువచ్చిందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్న 'శుభ ఫెర్టిలిటీ' వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎల్బీనగర్‌లో తమ మొదటి ఫెర్టిలిటీ సెంటర్‌ను సోమవారం ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డితో కలిసి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ వివాహం తర్వాత ప్రతి స్త్రీ తల్లి కావాలని కోరుకుంటుంది..కానీ కొన్ని వంధ్యత్వ సమస్యల కారణంగా వారికి ఇది సవాలుగా మారుతుందన్నారు.ఇలాంటి తరుణంలో నగరంలోని ప్రసిద్ధ గైనకాలజిస్ట్, ప్రసూతి వైద్యురాలు డాక్టర్ సి.స్రవంతి రెడ్డి తన నైపుణ్యంతో ఈ నూతన ఫెర్టిలిటీ సెంటర్ ద్వారా వంధ్యత్వానికి చికిత్స అందిస్తుందన్నారు. అనంతరం ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, ప్రసూతి, గైనకాలజిస్ట్, శుభా ఫెర్టిలిటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ సి.స్రవంతి రెడ్డి మాట్లాడుతూ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సమక్షంలో మా మొదటి సంతానోత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. శుభా ఫెర్టిలిటీ మంచి నిపుణుల బృందంతో కలిసి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని మిళితం చేస్తుందని అన్నారు. ముఖ్య విషయం ఏంటంటే శిశువు కోసం ప్రణాళిక వేసుకునే సమయంలో ఏవైనా సమస్యలు ఉంటే సంతానోత్పత్తికి వైద్యుడిని సంప్రదించడం తప్పనిసరి అని తెలిపారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్బీనగర్ లో తమ మొదటి ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభించినందుకు డాక్టర్ సి.స్రవంతి రెడ్డిని అభినందిస్తున్నట్లు చెప్పారు. గర్భం దాల్చాలనుకునే జంటలకు శుభ ఫెర్టిలిటీ సెంటర్ తమ కొత్త టెక్నాలజీతో నాణ్యమైన చికిత్సను అందిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సంస్థ గౌరవ చైర్మన్ అమరవాది లక్ష్మీనారాయణ, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, పలువురు డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు ఎదురైతే చెప్పండి : కార్పొరేటర్



నవతెలంగాణ - వనస్థలిపురం

వర్షాల వలన ఇబ్బందులు ఎదురైతే తమకు తెలియజేయాలని కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ కే డీ నగర్‌లో వర్షాల కారణంగా రోడ్లపై నిలిచిన నీటితో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు సోమవారం కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో ఎలాంటి ఇబ్బందులు తన దృష్టికి తీసుకురావాలని, ఆ సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు శ్రీధర్ రావు, కృష్ణారావు, అమరేందర్ రెడ్డి, జంగారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

తీజ్ పండుగ నిర్వహణపై సమావేశం



నవతెలంగాణ- సంతోష్‌నగర్

రవీంద్రనాథ్ నగర్ కాలనీ బంజారా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో తీజ్ పండుగ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఫలకనుమా ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర హాజరై మాట్లాడారు. తీజ్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. రవీంద్ర నాయక్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ మాట్లాడుతూ గిరిజనుల సాంస్కృతి ఉనికిని కాపాడాలనే ఉద్దేశంతో ఈ కాలనీలో తీజ్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఫలకనుమా సబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్, రవీంద్ర నాయక్ నగర్ కాలనీ నాయకులు లచ్చి రామ్ నాయక్, రామ్ కుమార్, రాజు, నరేందర్ నాయక్, శ్రీను, రాజేష్, కృష్ణ, సోమా శంకర్, భూరో ఆంజనేయులు, సంతోష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నవతెలంగాణ -సంతోష్ నగర్

గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా.. అప్పటికే సదరు వ్యక్తి మృతిచెందినట్లుగా నిర్ధారించారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 45-50 మధ్యలో ఉంటుందన్నారు. మెరున్ కలర్ షర్ట్, ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వ్యక్తులు, అతని కుటుంబ సభ్యులు మలక్‌పేట్ పోలీస్ స్టేషన్లో, 8712661581,8712661580,8712665183 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ వార్షికోత్సవంలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి



నవతెలంగాణ- వనస్థలిపురం

బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పద్మావతి కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయ 10వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై ప్రత్యేక పూజాలు చేశారు. తర్వాత భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆలయానికి తన సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, రాజు, సుభాష్, కిరణ్, సాయినాథ్, రామ్మోహన్, రామయ్య, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు



నవతెలంగాణ - బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 15వ డివిజన్ పరిధిలో ఉన్న బాలాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో కంట మహేశ్వర సూరమాంబ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో బడంగ్ పేట్ నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగురింత నరసింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్ద బావి సుదర్శన్ రెడ్డి, బండారి మనోహర్, బాలు నాయక్, జైహింద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాలలింగం జంగయ్య, సుధాకర్ రెడ్డి, లింగం, శ్రీశైలం, నరహరి గౌడ్ పాల్గొన్నారు.

మధుయాష్కీకి
వ్యతిరేకంగా వెలసిన పోస్టర్స్‌ను ఖండించిన మల్ రెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

మధు యాష్కీకి వ్యతిరేకంగా ఎల్బీనగర్ కాంగ్రెస్ పేరుతో గాంధీ భవన్ సమీపంలో వెలిసిన పోస్టర్లను ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి ఖండించారు. చైతన్యపురిలోని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధులు యోగేశ్వర్ రెడ్డి, సంకేపల్లి సుధీర్ రెడ్డిలతో కలిసి మల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీకి వ్యతిరేకంగా ఇలా పోస్టర్లు వేయడం హేయమైన చర్య అని అన్నారు. ఎల్బీనగర్ కాంగ్రెస్ నేతల మధ్య చిచ్చు పెట్టడానికే బీఆర్ఎస్ వాళ్లు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం అని తెలిసి..బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయన్నారు. అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇకముందు ఇలాంటివి జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహా యాదవ్, జైపాల్ రెడ్డి, గోవర్ధన్, గద్దగూటి స్వామి ముదిరాజ్, శ్రీనివాస్, ఫాయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : మల్‌రెడ్డి

హస్తినాపురం :

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలపై ప్రభుత్వ అధికారులతో చర్చించి.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో సోమవారం పర్యటించి..స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కాలనీల రక్షణ కోసం సీ.సీ కెమెరాలతో పాటు పలు రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరినట్లు తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అనంతరం వాంబే కాలనీ హనుమాన్ ఆలయం వద్ద టీపీసీసీ అధికార ప్రతినిధి యోగేశ్వర రావ్..కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మల్‌రెడ్డి మాట్లాడారు.ఆలయాలకు కావాల్సిన వసతులు సమకూరుస్తానని భరోసా ఇచ్చారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగు చెందిన ప్రజలు.. నేడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. 2014లో కాంగ్రెస్ హయాంలో రూ.500 లోపు ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం..రూ.1200 కు పైగా పెంచి, ఇప్పుడేదో రూ.200 తగ్గించి ప్రజలను మభ్య పెట్టేందుకు చూస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కుటిల రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎస్టీ సెల్ చైర్మన్ రమేష్ నాయక్, కాలనీ అధ్యక్షుడు గోపాల్ నాయక్, హనుమాన్ గుడి చైర్మన్ శ్రీకాంత్ నాయక్, కాంగ్రెస్ నాయకులు శ్రీపాల్ రెడ్డి, హుస్సేన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరం



నవతెలంగాణ- బడంగ్ పేట్

నేటి సమాజంలో ఆత్మ రక్షణకు కరాటే విద్య ఎంతో అవసరమని కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి అన్నారు. సోమవారం నాయక్ బుడోకాన్ కరాటే అకాడమీ లక్ష్మీ దుర్గ హిల్స్ విద్యార్థులు రుజుకై శోటాఖాన్ కరాటే అకాడమీ వారు ఫస్ట్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ బోడుప్పల్ హైదరాబాదులో నిర్వహించారు. ఆ పోటీల్లో నాయక్ మూడోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ అండ్, మెడల్స్‌ను అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్న నాటినుండే కరాటే శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరసింహ గౌడ్, మాస్టర్ పీ.గణేష్ నాయక్, రవీందర్ మాస్టర్, వి.సుమన్, కాలనీ వాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిత్ర కృష్ణను కలిసిన మాదిగ సేవా సంఘం నాయకులు



నవతెలంగాణ - ధూల్ పేట్

కార్వాన్ నియోజక వర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణను సోమవారం జియాగూడ మాదిగ సేవా సంఘం అధ్యక్షులు జి రాములు, ప్రధాన కార్యదర్శి ఎం చంద్ర మోహన్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ మాట్లాడుతూ.. అందరికీ అందుబాటులో ఉంటూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం మాదిగ సేవా సంఘం నాయకులు డబల్ బెడ్ రూమ్ ఇండ్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు జి చెన్నయ్య, జి కిషన్, బి రాజు, సహాకోశాధికారి ఎం మొగులయ్య, జాయింట్ సెక్రెటరీ రామ్ కుమార్, పి దాసు, టి యాదగిరి, పి వెంకటేష్, పి గోపాల్, జి లక్ష్మయ్య డి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్ లైన్ పనుల పరిశీలన



నవతెలంగాణ - వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో చేపట్టిన తాగునీటి పైప్ లైన్ పనులను డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జలమండలి డీజీఎం రాజగోపాల్, మేనేజర్ సిరివెన్నెలలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. లేదంటే చర్యలు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో కాలనీ అధ్యక్షులు చిత్రంజన్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, వాటర్ వర్క్స్ ఇన్ స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.